తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 04.09.2025 | సంపుటి : 12 సంచిక : 46 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# కడుపులో కత్తులు.. పైకి కౌగిలింతలు



హనుమాన్ గుడి లేకపోవచ్చు

హనుమాన్ లేని గ్రామం ఉండొచ్చు కానీ ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం లేదు. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న గ్రామాల్లో మేం ఓట్లు అడుగుతాం. డబుల్ బెడ్ రూం ఉన్న గ్రామాల్లో మీరు ఓట్లు అడగాలి. ఒకవేళ ఏ నియోజకవర్గంలోనైనా డిపాజిట్లు వస్తే మమ్మల్ని క్షమించండని కేసీఆర్‌కు సవాల్ విసిరా...

"నేను ఎవరి వెనుకాల లేను. ప్రజలు తిరస్కరించిన వారి వెనుక నేనెందుకు ఉంటాను?. ఇన్ని దుర్మార్గాలు చేసిన మీరు ఎలా మనుగడ సాగిస్తారు? మీ కుల, కుటుంబ పంచాయితీల మధ్య మమ్మల్ని తీసుకురావద్దు" – సీఎం రేవంత్ రెడ్డి

## మీపాపాలు ఊరికే పోవు.. మీది పైసల పంచాయతీ మీ వెనకాల నేనెందుకుంటా?: సీఎం రేవంత్ రెడ్డి

కత్తులతో ఒకరినొకరు పొడుచుకుంటున్నారు • లక్షకోట్లను పంచుకోవడంలో కేసీఆర్ కుటుంబంలో కలహాలు
మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగొద్దు • బీఆర్ఎస్ చచ్చిన పాము.. మళ్లీ చంపడమెందుకు?
వారి పంచాయితీలో తలదూర్చే సమయంమాకెక్కడిది • కవిత వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్

మహబూబ్‌నగర్ బ్యూరో(జనంసాక్షి):భారత రాష్ట్ర సమితి నేతల ను ప్రజలు తిరస్కరించారని, అలాంటి వారి వెనుక తాను ఎందుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావు వెనుకాల రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలపై సీఎం తాజాగా స్పందించారు."నేను కవిత వెనుకున్నాను అని కొందరు అంటున్నారు. హరీశ్,సంతోష్ వెనుక ఉన్నానని మరికొందరు అంటున్నా రు. నేను ఎవరి వెనుకా లేను. ఇప్పటికే ప్రజలు వాళ్లను తిరస్కరించారు. అలాంటి వారితో కలిసే సమయం నాకు లేదు. ప్రజల వెంట మాత్రమే ఉంటాను. మీ కుల, కు టుంబ పంచాయితీల మధ్య మమ్మల్ని తీసుకురావొద్దు' 'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లక్ష కోట్లు– దోచుకున్న వ్యక్తి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి.

మిగతా 2లో..

## ఎమ్మెల్సీకి,బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి కవిత

# రాజీనామా

### సస్పెండ్ చేయడంతో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి



- రెండు దశాబ్దాలు పార్టీ కోసం కష్టపడ్డా
- ఇదా నాకు దక్కిన గౌరవమని ఆవేదన
- హరీశ్ వెనక సీఎం రేవంత్ ఉన్నాడు
- బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు
- రేపు కేటీఆర్‌కు కూడా ఇలాంటి గతే పడుతుంది
- నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో కుట్రలు పన్నుతున్నారు
- కేసీఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి
- గుంటనక్కలు హరీశ్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త!
- హరీశ్ రావు బబుల్ షూటర్
- సమస్యను సృష్టించి సాల్వ్ చేసానని చెప్తాడు
- మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి):తను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కారణంగా బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. తన నిజాయి తీని నిరూపించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు– ఆమె వివరించారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన ఆత్మాభిమానం కాపాడుకునేందుకు తాను ఈ పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యల

మిగతా 3లో..

## కేసీఆర్ చెప్పిందే హరీశ్ చేశాడు



### సొంతంగా ఏదీ చేయడు: నిరంజన్ రెడ్డి

- కాళేశ్వరంపై రిపోర్టుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని అద్భుతంగా ఎండగట్టాడు
- ఆయనను టార్గెట్ చేసి మాట్లాడడం ఆశ్చర్యంగా, విడ్డూరంగా ఉంది
- బీఆర్ఎస్ నేతలు ఆయనకు రక్షణ కవచంగా ఉండాల్సిన సందర్భం ఇది
- వీరబ్రహ్మం చరిత్రలో సిద్ధయ్యలాగా పనిచేశారని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):వీరబ్రహ్మంచరిత్రలో సిద్ధయ్యలాగ కేసీఆర్ ఏది చెపితే అది హరీశ్‌రావు చేశారు అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి హరీశ్‌రావు గొప్ప సంపద, ఆయన ట్రబుల్ షూటర్ అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన

మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదు

- కాంగ్రెస్ అంటేనే పేదలపక్షం
- ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతను నెరవేరుస్తున్న మంత్రి పొంగులేటి
- పదేళ్లుగా లేని రేషన్ కార్డులు ఇచ్చాం
- పేదలందరికి సన్నబియ్యం సరఫరా
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

భద్రాద్రికొత్తగూడెం,చంద్రుగొండ(జనంసాక్షి): హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని

మిగతా 2లో..



## మొదటి ముద్ద పాలమూరుకే..

పరిశ్రమలస్థాపనలో తొలి ప్రాధాన్యం ఈ జిల్లాకే..

సాగునీటి ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు

ఎస్‌జిడి కార్నింగ్ టెక్నాలజీస్ ఫర్నేస్ లైటింగ్ ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్

2లో..

## కాంగ్రెస్, భాజపా ములాఖాత్

• మాపై కుట్ర - కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
• ఆ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ • మరోసారి కేటీర్ విమర్శలు

హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు– 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో చేరారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధిగల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడం.. పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకోటి లేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్న వేసిండు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మూడున్నర లక్షల కోట్లు– అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకంటే ముందు 72 వేల కోట్ల అప్పు ఉంది. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఇది మాత్రమే అప్పు అంటూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పింది. అయినా కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటడు..

మిగతా 2లో..



## కేసీఆర్ వదిలిన బాణం.. కవిత

### అదే నా సందేహం: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి):కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకొని ఇప్పుడు తిట్టుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత చెప్పిన విషయాలన్నీ వాస్తవమేనని, రాష్ట్రంలో పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందన్నారు."పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు. వాళ్ల పార్టీ లేకుండా వారే చేసుకుంటున్నారు. కవిత ఇన్ని రోజులు బాణాన్ని కేటీఆర్ మీదకు ఎక్కుపెట్టారు. అకస్మాత్తుగా ఆ బాణాన్ని హరీశ్‌రావు మీదకు తిప్పారు. అమెరికా వెళ్లి వచ్చాక కవిత వైఖరిలో మార్పు కనిపించింది. కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం. కేసీఆర్ కుటుంబంలో ఇది కొత్త నాటకం"అని అన్నారు.

## కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే..

: కేంద్రమంత్రి బండి సంజయ్..

2లో..

## ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం.. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ



### 2028 జనవరి మాసాంతానికి ప్రాజెక్టు పూర్తిచేస్తాం

- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణకు ప్రణాళికలు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలి
- ప్రాజెక్టు పూర్తితో ఏపీ అనధికారికంగా వాడుకుంటున్న నీటికి చెక్
- టన్నెల్ నిర్మాణంలో నిపుణుల ఇంజినీర్లతో మూడు షిఫ్ట్‌లలో పనులు
- భద్రతా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షణ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నేడు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశవుతామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణకై ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సంకల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.అందులో భాగం ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన ప్రకటించారు. అందులో భాగంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతిపై బుధవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సలహాదారులు అదిత్యా దాస్ నాద్,లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి లు అంజత్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబులతో పాటు ఆర్&ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,సి.ఇ నల్గొండ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నెలకు 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకుని జనవరి 2028 నాటికి పూర్తి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.మొత్తం 44 కిలోమీటర్ల సొరంగమార్గానికి గాను ఇప్పటికే 35 కిలోమీటర్ల సొరంగం తవ్వడం పూర్తి అయ్యిందని మిగిలిన తొమ్మిది కిలోమీటర్ల సొరంగ మార్గం తవ్వడానికి గాను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించ బోతున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా ప్రపంచం మొత్తంలో అత్యాధునిక సాంకేతికతో కూడిన హెలీ–బోర్న్ సర్వే

మిగతా 3లో..

## బీజింగ్ పరేడ్‌లో అధునాతన అణు క్షిపణి..

విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో 20,000 కిమీ సామర్థ్యంగల డీఎఫ్-5సీ అటామిక్ మిసైల్ ప్రదర్శన

బీజింగ్(జనంసాక్షి):చైనా తన అమ్ముల పొదిలోని అత్యాధునిక భారీ అణు క్షిపణిని ప్రపంచం ముందు ప్రదర్శించింది. దీనిని డీఎఫ్–5సీగా వ్యవహరిస్తున్నట్లు గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో ఈ క్షిపణి ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సరికొత్త మిసైల్ రేంజిలోకి భూగోళం మొత్తం వస్తుంది. అంటే ప్రపంచంలో ఎక్కడున్న లక్ష్యాన్నైనా ఇది ధ్వంసం చేయగలదు.

మిగతా 2లో..



## శాంతా -యుద్ధమా?.. చర్చలా - ఘర్షణా?

### ప్రపంచం ముందు రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి: జిన్‌పింగ్

బీజింగ్(జనంసాక్షి):అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం ముందు రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. శాంతా–యుద్ధమా, చర్చలా–ఘర్షణా.. ఏం కావాలో తేల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఈక్రమంలో తొలిసారి అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి 26 దేశాల నేతలు హాజరయ్యా రు. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ ఇందుకు వేదికైంది. దీనిని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. జిన్‌పింగ్‌తో పాటు ఇందులో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్



ఉన్ గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఈ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరే కంగా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికన్ సైనికుల త్యాగాలను గుర్తించాలన్నా రు. యుద్ధం నేపథ్యంలో చైనాకు మద్దతిచ్చి, ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా..? లేదా..? అనేది పెద్ద ప్రశ్న

మిగతా 2లో..

## భారత్ సుంకాలతో చంపేస్తోంది

### మా వస్తువులపై అధిక టారీఫ్‌లు విధిస్తోంది : ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):సుంకాలతో విరుచుకుపడుతోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయని విమర్శించారు.ఈ సందర్భంగా భారత్ సుంకాలతో తమని



చంపేస్తోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ వస్తువులపై సుంకాలు ఉండవని ఢిల్లీ అంగీకరించిందని చెప్పిన ఆయన.. భారత్ వస్తువులపై 50శాతం టారిఫ్‌లు విధించడాన్ని మరోసారి సమర్థించుకున్నారు. "మాపై పలు దేశాలు సుంకాలు విధించాయి. చైనా సుంకాలతో చంపేస్తోంది. టారిఫ్‌లతో భారత్ మమ్మల్ని చంపుతోంది. బ్రెజిల్ కూడా భారీ సుంకాలు విధిస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూ మాట్లాడిన ఆయన.. మరేదేశం అర్థం చేసుకోని విధంగా టారిఫ్‌ల గురించి తాను అర్థం చేసుకున్నానని చెప్పారు. "అందరికంటే ఎక్కువగా సుంకాల గురించి అర్థం చేసుకున్నా. నేను చేపట్టిన చర్యలతోనే ఆయా

మిగతా 2లో..

## యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదు

• యుద్ధాల కారణంగా దేశాల నుంచి దిగుమతి లేదు
• అందుకే కొరత ఏర్పడింది : మంత్రి తుమ్మల



ఢిల్లీ(జనంసాక్షి):యుద్ధాల కారణంగా కేంద్రం ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేదని, అందువల్లనే కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొ న్నారు. 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారు.

మిగతా 2లో..

## పాక్, అఫ్గాన్ మైనార్టీలకు ఊరట

పౌరసత్వ నిబంధనలు సడలించిన కేంద్రం

వార్త 2లో

జనంసాక్షి www.janamsakshi.org

గురువారం 04.09.2025

# పాక్, అఫ్గాన్ మైనార్టీలకు కేంద్రం ఊరట..

– పౌరసత్వ నిబంధనలు సడలింపు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మైనార్టీలకు కేంద్రం ఊరట కల్పించింది. వివిధ రకాల కారణాలతో డిసెంబరు 31, 2024 తేదీ లోపు భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లేకపోయినా వారు భారత్‌లో ఉండేందుకు అనుమతిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.ఆయా దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు భారత పౌరసత్వం కల్పిస్తామని పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ప్రకారం.. 2014 డిసెంబరు 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు మాత్రమే భారత పౌరసత్వం కల్పించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. తాజాగా ఈ పౌరసత్వ నిబంధనలకు సడలింపులు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) 2025లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. "అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో మతపరమైన హింసల కారణంగా భయంతో డిసెంబరు 31, 2024 తేదీలోపు భారత్‌ను ఆశ్రయించిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం ఇవ్వడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుంది. చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు లేకపోయినా భారత్‌లో నివసించవచ్చు. ఇకపై వారికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోతాయి. దశాబ్దాలతరబడి కాందిశీకుల్లా బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తుంది. దేశంలో ఎక్కడికైనా వారు రాకపోకలు సాగించొచ్చు. ఆస్తులు కొనవచ్చు." అని హోంశాఖ వెల్లడించింది.పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వాన్ని ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది పౌరసత్వ సవరణ చట్టం–2019 ని అమల్లోకి తెచ్చింది. సీఏఏ –2019 చట్టం ప్రకారం.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా కేంద్రం నిబంధనల్ని రూపొందించింది. 2014 డిసెంబరు 31 కంటే ముందు ఈ మూడు దేశాల నుంచి మన దేశానికి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ముగుస్తుంది.

# కాంగ్రెస్, భాజపా ములాఖాత్

ఇంకొకడు ఏడు లక్షలు అంటడు. ఇంకోడు ఎనిమిది లక్షలు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నాడు.. ఆధారం, ప్రామాణికం, పత్రం అడిగితే లేదంటరు. ఉపన్యాసాలు అదరగొట్టాలి.. మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి.. ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి మీదికి దృష్టికి రాకుండా.. డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద సొల్లు పురాణం తప్ప ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీ–ఆర్ నిప్పులు చెరిగారు.పంచాయతీ ఎన్నికలు అయినా, ఢిల్లీ ఎన్నికలు అయినా ఎగరాల్సింది గులాబీ జెండానే. కేసీఆర్ నాయకత్వంలో ముందుకు పోవాలి. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి.. వాటిని పక్కకున పెట్టాలి. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ప్రజలు ఇవాళ కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటు–న్నారు ఎందుకంటే.. మన మధ్యన ఒక పెద్దాయన ఉంటే ఆయన విలువ తెలియదు. ఆయన ఆ పోజిషన్‌లో లేనప్పుడే తెలుస్తుంది. ఎప్పుడైనా చీకటిని చూస్తనే వెలుగు విలువ తెలుస్తుంది. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. ఇవాళ గాడిదులు ఎవరైతే ఉన్నారో వారిని చూసిన తర్వాత కేసీఆర్ విలువ ప్రస్ఫుటంగా తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం ఇవ్వడం లేదు.. చివరకు ఇనుము కూడా ఇవ్వరు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదు. ఇది దండుపాళ్యం బ్యాచ్.. బంగారం ఇచ్చే బ్యాచ్ అసలే కాదు. ఒక్కొక్క వర్గాన్ని చైతన్యవంతం చేసి.. గెలుపు దిశగా పయనించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# భారత్ సుంకాలతో చంపేస్తోంది

దేశాలు దిగివస్తున్నాయి. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్. తమ వస్తువులపై సుంకాలు ఉండవని వాళ్లు నాకు చెప్పారు. నేను ఈ చర్యలు తీసుకోకుండా ఉంటే వాళ్లు దిగివచ్చేవారు కాదు. అందుకే సుంకాలు ఉండాలి. ఆర్థికంగా మరింత బలపడతాం" అని ట్రంప్ వెల్లడించారు.అనేక దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు అక్రమమని ఓ ఫెడరల్ అప్పీలు న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్.. ఆ కేసును ఇతర దేశాలు స్పాన్సర్ చేస్తున్నాయని ఆరోపించారు. భారత సుంకాలపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందునే ఈ చర్యలు తీసుకున్నామని చెప్పిన విషయం తెలిసిందే

# కేసీఆర్ చెప్పిందే హరీశ్ చేశాడు

తర్వాత సభలో హరీశ్‌రావు అధికార పక్షాన్ని అద్భుతంగా చెడుగుడు ఆడుకున్నాడు. 30సార్లు ఆటంకం కలిగించినా అన్ని విషయాలను వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డొల్లతనాన్ని ఎండగట్టారు. ఎవరి ప్రయోజనం నెరవేర్చడానికో, ఎవరికి బలం చేకూర్చడానికో కొంత మంది హరీశ్‌రావును టార్గెట్ చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఆశ్చర్యకరంగా ఉంది. ఈ సందర్భంలో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ఎవరైనా సరే తెలంగాణను ప్రేమించే వారు, ప్రత్యేకంగా బీఆర్ఎస్ నేతలు రక్షణ కవచంగా ఉండాల్సిన సందర్భం ఇది. బీఆర్ఎస్‌పై చేస్తున్న కుట్రపూరిత ఆరోపణలరకు తావ్వికుండా చీల్చి చెండాల్సింది పోయి, ఖండించాల్సింది పోయి వారికి ఊతమిచ్చే విధంగా మాట్లాడడం బాధాకరమని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.కేసీఆర్ 2000లో పార్టీ ప్రారంభించినప్పటి నుంచి హరీశ్‌రావు ఉన్నారు. ఎదురు చెప్పకుండా, ప్రశ్నించకుండా.. వీరబ్రహ్మం చరిత్రలో కేసీఆర్ ఏది చెపితే అది సిద్ధయ్యలాగ హరీశ్‌రావు చేశారు. పార్టీ కలర్ కోసం బేగం బజార్ పోయి రంగులు తీసుకొచ్చింది ఆయనే. జలదృశ్యంలో దిమ్మె కట్టించింది హరీశ్‌రావే.. అక్కడ్నుంచి ప్రస్థానం మొదలుపెట్టారు. ఇవాళ శాసనసభలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా క్రమశిక్షణ కలిగిన పార్టీ వర్కర్‌గా పని చేస్తున్నారు. ప్రజల కోసం పని చేశారు హరీశ్‌రావు. విరామం లేకుండా పని చేశారు. ఆయన పనితీరును గతంలో ఇప్పుడు మాట్లాడుతున్న వారు కూడా ప్రశంసించారు. ఇవాళ రివర్స్ గేర్ చేసి ఆలయనను తులనాడి మాట్లాడడం మనసు ఎలా ఒప్పుకుంటుంది అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.ఈటల రాజేందర్ పార్టీలో ఉండేలా చివరి నిమిషం వరకు హరీశ్‌రావు ప్రయత్నించారు. ప్రజాభిమానాన్ని చూరగొనడంలో హరీశ్‌రావును చూసి నేర్చుకోవాలి. బీఆర్ఎస్ పార్టీకి హరీశ్‌రావు ఒక సంపద.. ట్రబుల్ షూటర్.. ఉప ఎన్నిక ఎక్కడ వచ్చినా గెలిపించుకున్న కార్యదక్షుడు ఆయన. ఇలాంటి నాయకులను బలహీన పరుచుకుంటే తెలంగాణ సమాజానికి నష్టం కలుగుతుంది. కేసీఆర్ ఆయనకు అప్పగించిన అన్ని శాఖలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. గతంలో ప్రతిపక్ష పార్టీలు కూడా ఆయన పనితీరును బహిరంగంగా మెచ్చుకున్నాయి. హరీశ్‌రావుపై నిందలు వేయడం సరికాదు. రేవంత్ కాళ్లు హరీశ్‌రావు మొక్కాడు అని రాజకీయాల కోసం నీచంగా మాట్లాడడం సరికాదు. ఇలాంటి ప్రచారం ఎవరూ నమ్మరు. కవితకు కష్టం వచ్చినప్పుడు పార్టీ మొత్తం అండగా నిలిచింది. కవితను జైలు నుంచి తీసుకొచ్చేందుకు కేటీఆర్, హరీశ్‌రావు ఎన్నో ప్రయత్నాలు చేశారని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డొల్లతనాన్ని కేటీఆర్, హరీశ్‌రావు ఎండగడుతున్నారు. ఎవరికి లాభం జరగాలని హరీశ్‌రావును టార్గెట్ చేస్తున్నారు..? కేసీఆర్‌కు వ్యక్తిగత సహాయకుడు సంతోష్ రావు. ఆయన గురించి మాట్లాడడం కూడా సరికాదు. భవిష్యత్ పట్ల ఏదేదో ఊహించుకుని మాట్లాడితే అది అపరిపక్వత అవుతుందని అన్నారు.

హనుమాన్ గుడి లేకపోవచ్చు



# ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదు

ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు.ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిది. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే .. పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు–.. కొత్త రేషన్ కార్డులు అంటే ఏంటో తెలియదు. మా ప్రభుత్వం రాగానే లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటున్నామో.. పేదలకూ అవే సన్నబియ్యం ఇస్తున్నాంఅని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విషనాగు. ఈ పాములో కాలకూట విషం ఉంది. అయితే, ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. దామరచర్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవితస్వప్నం అని.. గత పదేళ్లు పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని అన్నారు. ఏటా 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల మందికి వచ్చేవని.. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనబడుతోంది. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి భూభారతి తీసుకొచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాచుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటారని.. వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలి దోచుకుంటారట అంటూ తీవ్రంగా విమర్శించారు. టీవీలు, పేపర్లు సంపాదించుకున్నారు.. వాటి కోసం కొట్టు–కుంటు–న్నారని ఆరోపించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు సీఎం రేవంత్. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచలోనే మొదలైందని, ఖమ్మం జిల్లా ప్రజల తెలంగాణకు దిశ దిశను చూపించారన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలని కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచన చేయాలి. రోటీ, కప్డా, మకాన్ అనే నినాదాన్ని నాడు ఇందిరమ్మ కొనసాగిస్తే, అదే నినాదాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గల్లీ గల్లీ.. ఊరు ఊరు తిరిగి ప్రతి పేద వాడికి 25 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లోనే ఓట్లు–అడుగుతామని 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు సవాలు విసిరా. పేదలు ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసినప్పుడు కలిగిన ఆనందం నేను జూబ్లీహిల్స్‌లో గృహప్రవేశం చేసిన రోజు కూడా రాలేదన్నారు. 4500 ఇండ్లు కేవలం అశ్వారావు పేటకు ఇచ్చా. కొందరికి పేదరికం అంటే ఎక్స్ కర్షన్.. మేము పేద వర్గంలో పుట్టి పెరిగి, వారితో అన్ని సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం. పేదరికం తెలిసి, కుటుంబ సభ్యులుగా భావించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు. పేదలు కళ్లు కాయలు కాసేలా వేచి చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు.ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి. పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# కడుపులో కత్తులు.. పైకి కౌగిలింతలు

పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్లు వాళ్లు కొట్టు–కుంటూ మాపై నిందలు వేస్తున్నారు. మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. బీఆర్ఎస్ ను ప్రజలే బొందపెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దోపిడీ సొమ్మే ఇవాళ వాళ్ల మధ్య చిచ్చు పెట్టిందని, వాటాల కోసం వాళ్లు వాళ్లు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలే బొంద పెట్టారని.. సచ్చిన పామును చంపాల్సిన అవసరం మాకేముందని ఎద్దేవా చేశారు. మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగొద్దని హెచ్చరించారు. " కాంగ్రెస్ పార్టీని బతకనివ్వమని ఆనాడు శాసనసభ్యులు కాకుండా అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారు.ఇవాళ వాళ్ళేతన్నుకుని చస్తున్నారు.. ఒకరినొకరు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుం టున్నారు.ఎవరూ అక్కర్లేదు వాళ్లను వాళ్ళే పొడుచుకుం టారు.అవినీతి సొమ్ము పంపకాల్లో తేడా వచ్చి కుటుంబంలో తగాదాలు పెట్టుకుంటున్నారు.కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు.పాపం ఊరికే పోదు.. ఆ పాపాలు వెంటాడుతూనే ఉంటాయి.. ఖచ్చితంగా అనుభవించాల్సిందే. ఒకరివెనక ఒకరు ఉన్నారని కొందరు మాట్లాడుతున్నారు.అంత చెత్తగాళ్ళ వెనక నేనెందుకు ఉంటాను.నేను నాయకుడిని.. ఉంటే ముందుంటా నా వాళ్లకు తోడుగా ఉంటా...వాళ్ళ కుటుంబంలో వాళ్లు వాళ్లు కత్తులతో పొడుచుకుని హరీష్, సంతోష్ వెనక రేవంత్ రెడ్డి ఉన్నారని ఒకరంటే లేదు లేదు కవిత వెనకాల రేవంత్ రెడ్డి ఉన్నారని ఇంకొకరంటున్నారు.మీరంతా దిక్కుమా లినవారని తెలంగాణ ప్రజలు బండకేసి కొట్టారు.. అన్నం తినేవారు ఎవరైనా మీ వెనక ఉంటారా? దయచేసి మీ కుటుంబ పంచాయతీలనో మీ కుల పంచాయతీలోనో.. మమ్మల్ని లాగకండి..మాకు ఎలాంటి ఆసక్తి లేదు.మిమ్మల్ని ఎప్పుడో ప్రజలు తిరస్కరించారు ఆ పార్టీ.. కాలగర్భంలో కలిసిపోతుంది.ప్రకృతి ఉంటుంది.. ప్రకృతి శిక్షిస్తుంది" అని అన్నారు.



# మొదటి ముద్ద పాలమూరుకే..

**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి):** తనకు ఏ అవకాశం వచ్చినా.. మొదటి ముద్ద పాలమూరుకు పెడతా అని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండకూడదని చూసిన వారు.. ఇపుడు వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని.. కౌగిలించుకుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను హరీష్ రావు, సంతోష్ రావు వెనకాల ఉన్నానని ఒకరు, కవిత వెంట ఉన్నానని మరొకరు అంటున్నారని.. ఎవరి వెనకాల తాను ఎందుకు ఉంటా.. అని ప్రశ్నించారు. తాను ప్రజల అభివృద్ధి కోసం ముందు ఉంటానని వివరించారు. ఒకప్పుడు జనతా పార్టీ చాలా ఫేమస్.. కాల గర్భంలో కలిసిపోయిందని గుర్తు చేశారు. ఏ పార్టీ, ఎవరు శాశ్వతం కాదని హితవు పలికారు. పాపం ఎప్పుడూ ఊరికే పోదని నొక్కిచెప్పారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో విద్య, వైద్య రంగాలతో పాటు సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇస్తూ వలసల పాలమూరు జిల్లాను అభివృద్ధి కి కలిసి కట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్.జి.డి కార్నింగ్ ఫార్మాస్యూటికల్ గ్లాస్ ట్యూబింగ్ జాయింట్ వెంచర్ ఫర్నేస్ లైటింగ్ ప్రారంభ వేడుకలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణా రావు, శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో మహబూబ్ నగర్ జిల్లా నూతన పరిశ్రమలకు వేదిక కాబోతోంది అన్న రేవంత్ రెడ్డి... నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలకు మహబూబ్ నగర్ జిల్లా వేదిక కాబోతుందన్నారు. ఒకప్పుడు పాలమూరు జిల్లా వలసలకు మారుపేరనీ, నాటి పాలకులు పేదరికం, వలసలు, సమస్యలను చూపించడానికి ప్రపంచ నాయకులను పాలమూరు జిల్లాకు తీసుకువచ్చే వారన్నారు. భవిష్యత్తులో మన అభివృద్ధిని,పరిశ్రమలను, యూనివర్సిటీలను, సాగునీటి ప్రాజెక్టులను చూపించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా జిల్లాను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అందుబాటులో లేకపోవడం వల్లే ఆ పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన పాలమూరు రంగారెడ్డి, జూరాల, నెట్టెంపాడు వంటి ఏ ప్రాజెక్టులు సంపూర్ణంగా పూర్తి కాలేదని... ఎడ్యుకేషన్, ఇరిగేషన్, ఎంప్లాయిమెంట్ లో మన జిల్లాను అభివృద్ధి చేసుకోకపోతే శాశ్వతంగా జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుంది అన్నారు. విద్య ఒక్కటే మన తలరాతలు మారుస్తుందనీ వలసలు వెళ్ళే పాలమూరు బిడ్డలు ఆ వలసల బారి నుండి బయటపడాలంటే చదువొక్కటే మార్గమన్నారు. పాలమూరు జిల్లా నుంచి ఇంజనీర్లు, డాక్టర్లే కాదు, ఐఏఎస్ లు, ఐపీఎస్ లు అయ్యి రాష్ట్రానికే కాదు దేశానికి సేవలందించేలా ఎదగాలనీ అందుకే.. జిల్లాకు ఇంజనీరింగ్, లా కాలేజీ, డిగ్రీ కాలేజీలతో పాటు ట్రిపుల్ ఐటీని పాలమూరు జిల్లాకు మంజూరు చేయడం జరిగిందని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక్కో నియోజకవర్గానికి రూ. 200 కోట్ల చొప్పున రూ. 2800 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 నియోజకవర్గాల్లో 14 అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే విధంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగుతుందన్నారు. చదవాలంటే మనకు వసతులు ఉండాలి, ఆ వసతులు అందించే బాధ్యత పాలమూరు బిడ్డగా నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు. చదువు అందించేందుకు ఎక్కడ ఏది కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

ఉదండాపూర్ జలాశయం పూర్తి చేయాలని ప్రయంత్నిస్తుంటే ప్రతిపక్షాలు గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారనీ దుయ్యబట్టారు. ఏ ప్రాజెక్టులు కట్టాలన్నా, పరిశ్రమలు నెలకొల్పాలని భూమి అవసరమని... రైతులకు ఎప్పటికీ అన్యాయం చేయమని, భూసేకరణ విషయంలో రైతులతో మాట్లాడి ఒప్పించి మంచి పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ లు, అధికారులకు సూచిస్తున్నట్లు తెలిపారు. గతంలో నాయకత్వ నిర్లక్ష్యం వల్లే ఇప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజక్టులు పూర్తి కాలేదనీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి అసంపూర్తిగా ఉన్న పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసుకుందామని అన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు అందించి పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ ఈ రెండే పాలమూరు జిల్లా రూపురేఖలు మారుస్తాయనీ పునరుద్ఘాటించారు. ఇది బాధ్యత, నైతిక ధర్మం అన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి.. . రాజకీయ కారణాలతో అభివృద్ధిని అడ్డుకుంటే మనకు మనమే మరణ శాసనం రాసుకునేవాళ్లం అవుతామన్నారు.

భూమికి బదులు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..

కొడంగల్, నారాయణపేటకు ఎత్తిపోతల పథకం తెస్తే.. ఎన్ జి టి లో ఫిర్యాదు చేస్తున్నారుని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అక్కడ భూసేకరణ కోసం వెళ్తే.. రైతులు కొడంగల్ లో ఇచ్చినట్లు రూ. 20 లక్షలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. కొడంగల్ పరిస్థితి వేరు.. నారాయణపేట పరిస్థితి వేరు అని స్పష్టం చేశారు. నారాయణ పేట వారికి కావాలంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ఇక్కడ భూసేకరణ కోసం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, మహబూబ్ నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి, వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘా రెడ్డి, నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఎస్.జి.డి టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ సర్జిత్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదు

రామగుండం పరిశ్రమ నుంచి కూడా ఒక్క బస్తా ఇవ్వలేదు. కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారు. అన్ని పంటలకు సెప్టెంబర్‌లో యూరియా చివరి కోటా వేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల భారీ వర్షాల వల్ల ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం సంభవించింది. రాష్ట్రంలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయి. చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆయిల్‌పామ్ దిగుమతిపై సుంకాలు 40 శాతానికి పెంచాలని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారంతో తమకు సంబంధం లేని వ్యవహారం అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరం వ్యవహారాన్ని సీబీఐ విచారణకు ఇచ్చినట్లు– తెలిపారు. ఏది ఉన్నా.. వాళ్లే చూసుకుంటారన్నారు. ఇదిలావుంటే ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25000 కనీస మద్దతు ధర కల్పించేలా ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని మంత్రి విజ్ఞప్తి.చేశారు. తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్–ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాలపై, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న 12 శాతం జిఎస్టీని మినహాంచాలని విజ్ఞప్తి చేశారు. పాస్పరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకురావాలని మంత్రి తుమ్మల కోరారు.

# బీజింగ్ పరేడ్‌లో అధునాతన అణు క్షిపణి..

అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించుకొని వెళ్లగలదని చెబుతున్నారు.ఈ క్షిపణిని ఒక్క వాహనంపై తీసుకెళ్లడం సాధ్యం కాదు. దీనిని మూడు భాగాలుగా తరలించి.. ఆ తర్వాత అసెంబ్లింగ్ చేసి ప్రయోగిస్తారు. గత డీఎఫ్–5 కన్నా డీఎఫ్–5సీని వేగంగా ప్రయోగానికి సిద్ధం చేయొచ్చని అణ్వాయుధ నిపుణుడు ప్రొఫెసర్ యాంగ్ చెంగ్జిన్ వెల్లడించారు. దీనిని భారీ సిలోస్ (బొరియ) నుంచి కూడా ప్రయోగించవచ్చు.ఈ మిసైల్ భూమి మొత్తం ప్రయాణించగలదు. దీని రేంజి 20,000 వేల కిలోమీటర్లకు పైగానే. దీంతో చైనా ప్రతి దాడి సమయంలో శత్రువు ఎక్కడా అందకుండా దాక్కొనే అవకాశమే ఉండదు.శత్రుదేశంలోని భూగర్భ స్థావరాలను కూడా ఛేదించగలదు.డీఎఫ్–5సీని ప్రయోగించే విధానం కూడా విభిన్నంగా ఉంటుందని యాంగ్ చెప్పారు. ఈ భారీ అణు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి దాడి సమయంలో శబ్దం కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగలదు. దీంతో ప్రస్తుతం ఉన్న గగనతల రక్షణ వ్యవస్థలకు దీనిని ఎదుర్కోవడానికి అతి తక్కువ సమయం మాత్రమే లభిస్తుంది.డీఎఫ్–5సీలో ఎంఐఆర్వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్)ను వాడారు. అంటే ఏకకాలంలో పలు అణు, సంప్రదాయ వార్‌హెడ్‌ల.. గగనతల రక్షణ వ్యవస్థలను మోసగించే డెకాయ్‌లను ఇది మోసుకెళ్లగలదు. వేర్వేరు లక్ష్యాలపై ఏకకాలంలో దాడి చేసేలా 10 వార్ హెడ్‌లను తీసుకెళ్లగలదని అంచనావేస్తున్నారు. సాధారణంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణలకు అత్యంత కచ్చితత్వంతో దాడి చేసే సామర్థ్యం ఉండదు. వీటిల్లో ఇంటర్నల్ గైడెన్స్ సిస్టమ్, స్టార్‌లైట్ గైడెన్స్ టెక్నాలజీలను వాడుతుంటారు. కానీ, డీఎఫ్–5సీలో మాత్రం చైనా అభివృద్ధి చేసిన బైడూ నేవిగేషన్ వ్యవస్థ సహా ఇతర టెక్నాలజీలను వాడారు. 20,000 కిలోమీటర్లు ప్రయాణించగలిగినా.. షార్ట్ మిసైల్స్ వలే అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తుందని చైనా చెబుతోంది.

**తొలిసారి ప్రదర్శించిన ఆయుధాలు..**

చైనా తొలిసారి ఎల్‌వై–1 లేజర్ వ్యవస్థను ప్రదర్శించింది. దీనిని టక్కుపై అమర్చి పరేడ్‌కు తీసుకొచ్చారు. వీటితోపాటు హైపవర్డ్ మైక్రోవేవ్ వ్యవస్థలను కూడా ప్రదర్శించింది.న్యూజనరేషన్ టైప్–100 ట్యాంక్‌లను ప్రదర్శించింది. గతలో టైప్ 99 ట్యాంక్‌ల కన్నా ఇవి అత్యాధునికమైనవని చైనా ప్రభుత్వ మీడియా పేర్కొంది. దీనిని హైలీ ఇంటెలిజెంట్ ట్యాంక్‌గా అభివర్ణించింది. సమన్వయం చేసుకొంటూ దాడులు చేయగలదని వెల్లడించింది. డాంగ్‌ఫెంగ్–61 ఖండాంతర క్షిపణిని ప్రదర్శించింది. దీని రేంజి 12,000 కిలోమీటర్లుగా వెల్లడించింది. డీఎఫ్–41కు ఆధునిక వెర్షన్‌గా వెల్లడించింది.గగనతలం నుంచి ప్రయోగించే అణు క్షిపణి జేఎల్–1ను ఈ సారి పరేడ్‌లో తొలిసారిగా ప్రపంచం ముందుకు తెచ్చింది. గతంలో జలాంతర్గాముల నుంచి ప్రయోగించే జేఎల్–3ను వినియోగంలోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో చైనా న్యూక్లియర్ ట్రైయాడ్‌ను ఇది బలోపేతం చేసినట్లైంది.ఏజేఎక్స్002 భారీ సముద్ర డ్రోన్‌ను ఈ సారి పరేడ్‌కు తీసుకొచ్చింది. సముద్రం లోతుల్లోకి చొచ్చుకొచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి వీలుగా దీనిని నిర్మించారు.హ–6జే లాంగ్ రేంజి బాంబర్ బీజింగ్ గగనతలంపై ఎగిరింది. దీనిని పీఎల్ఏ నేవీ కోసం రూపొందించారు. ఇది వైజే–12 యాంటీ షిప్ మిసైల్స్‌ను ప్రయోగించగలదు. కృత్రిమ మేధ సాయంతో దాడిచేసే డ్రోన్లను విక్టరీ డే సందర్భంగా చైనా ప్రదర్శించింది.

# శాంతా-యుద్ధమా?.. చర్చలా-ఘర్షణా?

అని ట్రంప్ అన్నారు. ఈ తరుణంలో జిన్‌పింగ్ నుంచి స్పందన వచ్చింది.దేశం సైనిక సామర్థ్యాలను మరింత పెంచుతామని ఈసందర్భంగా చైనా అధ్యక్షుడు ప్రతిజ్ఞ చేశారు. దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని రక్షించడంలో సైనికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈసందర్భంగా తైవాన్‌ను పరోక్షంగా ప్రస్తావించారు. అది తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. ప్రస్తుతం అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక, ఈ కార్యక్రమంలో చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ హాజరయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే..

బండి సంజయ్

**హైదరాబాద్(జనంసాక్షి):**కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చాక కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తే ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం ముందుకు వచ్చిందన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెల కుంభకోణంపై చర్చ జరగాలని అన్నారు.

## ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం.. ఎస్ఎల్బీసీ

- 2028 జనవరి మాసాంతానికి పూర్తిచేస్తాం
- భద్రతా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ ద్వారా ఈ సర్వే నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు.తద్వారా సొరంగ మార్గం తవ్వకాల సమయంలో ప్రమాదాలను ముందుగానే పసిగట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకునే వెసులుబాటు ఇంజినీర్లకు ఉంటుందన్నారు.నీటిపారుదల సలహా దారుడిగా లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ నియామకం ఈ సొరంగ మార్గం పూర్తికి దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సొరంగ మార్గం తవ్వకాల సమయంలో గాలి,వెలుతురు ఆవశ్యకతతో పాటు నీటిపారుదల రంగంలో యువ ఇంజినీర్లకు శిక్షణ ఇచ్చే ఆవశ్యకతను ఆయన వివరించారు. ఎటువంటి జాప్యం లేకుండా సత్వరమే సర్వే ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెండువైపులా మొదలు పెట్టిన ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాలలో ఒక భాగం నుండి 21 కిలోమీటర్లు పూర్తి కాగా మరో వైపు 14 కిలో మీటర్లు పూర్తి అయిందని మిగిలిన తొమ్మిది కిలోమీటర్లు పూర్తికి మూడు షిఫ్ట్ లలో పనిచేసేవిదంగా ప్రణాళికలు రూపొందించుకుంటే నిర్ణిత వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు. ఆయా షిఫ్ట్ లలో యువ ఇంజినీర్లను నియమించి రోజువారీ పురోగతిని రికార్డ్ చేయాలన్నారు.అందుకుగాను యువ ఇంజినీర్లకు శిక్షణతో పాటు ప్రోత్సాహకాలు కల్పించి సొరంగ మార్గం తవ్వకాలలో అనుభవం గడిరచేలా చూడాలన్నారు. సవరించిన అంచనాల పరిధిలోనే ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన ఏజెన్సీ లకు సూచించారు. ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో వస్తున్న నీటిని పంపింగ్ చేయడానికి విద్యుత్ బిల్లులు సంవత్సరానికి 500 నుండి 550 కోట్లు చెల్లిస్తున్నామన్నారు.పైగా పంపింగ్ కోసం వినియోగిస్తున్న మోటార్లు 20 సంవత్సరాలు పూర్తి కావడంతో అదనపు భారాన్ని భరిస్తూ మోటార్లను మార్చాల్సి వస్తుందన్నారు. ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టును పూర్తి చేసుకున్నట యితే రోజుకు 0.3 టి.యం.సి ల నీటిని 90 రోజుల పాటు అందించవచ్చన్నారు. కాగా శ్రీశైలం నుండి 824 అడుగుల నుండి ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గానికి నీరు వస్తుండగా 840 అడుగుల నుంసి పోతిరెడ్డి పాడు కు నీరు చేరుతుందని ఎస్.ఎల్.బి.సి పూర్తి అయితే అనధికారికంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు కు తరలించుకు పోయో అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు ప్రాజెక్టును పూర్తి చేసే అంశంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు.

# మలుపులు తిరిగిన వర్షిణి హత్యా కేసు

- అంతకుముందే వర్షిని తండ్రిది కూడా హత్యే..
- పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిన ఆసక్తికర ఘటనలు..
- ఇద్దరు హంతకుల అరెస్టు..
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్ ఖరే..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనాత్మకంగా మారిన కప్పల వర్షిణి(22) హత్య కేసు మలుపులు తిరిగింది. వర్షిణి హత్య కేసు పై విచారణ చేపట్టిన పోలీసులకు మరో హత్య జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. దీనిపై పూర్తి విచారణ చేపట్టిన పోలీసులు అనతికాలంలోనే డబుల్ మర్డర్ కేసు చేధించారు. పూర్తి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే ఈ డబుల్ మర్డర్ కేసు వివరాలను వివరించారు. ఎస్పి మాట్లాడుతూ గత నెల 28న కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఒక గుర్తుతెలియని యువతి మృతదేహం నేషనల్ హైవే పక్కన పడి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మృతదేహం చుట్టుపక్కల క్షుద్ర పూజలు చేసినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయని, ఈ సమాచారం మేరకు కాటారం ఎస్సై ఆకుల శ్రీనివాస్, సిఐ నాగార్జున రావు, డిఎస్పి సూర్యనారాయణలు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, చిట్యాల మండలం ఒడితలకు చెందిన కప్పల వర్షిణిగా గుర్తించడం జరిగిందన్నారు. వర్షిణి అగస్టు 3 నుండి కనిపించడం లేదని మృతురాలు తల్లి కప్పల కవిత చిట్యాల పోలీస్ స్టేషన్ లో అగస్టు 6న ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అప్పటి నుండి పోలీసులు గాలిస్తున్నారని, ఈ క్రమంలో వర్షిణి మృతదేహం లభ్యం కావడంతో నా కూతుర్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజల కోసం చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి కవిత మరో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఈ మేరకు కాటారం డిఎస్పి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిఐ నాగార్జున రావు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. కాగా ఈ నెల 2న సిఐ తన సిబ్బందితో గంగారం క్రాస్ రోడ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పై మృతురాలి తల్లి కవిత, మరొక వ్యక్తితో కొయ్యూరు నుండి కాటారం వైపు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి వాహనాన్ని వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా అసలు విషయం చెప్పడం జరిగిందన్నారు. పోలీసు విచారణలో ఈ కేసుపై విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జిల్లాలోని చిట్యాల మండలం ఒడితలకు చెందిన కప్పల కుమారస్వామి(50)కి మొదటి భార్య గతంలోనే చనిపోయింది. కాగా గత 24 ఏళ్ల క్రితం తాడిచర్లకు చెందిన మాదరవేణి కవితను రెండో వివాహం చేసుకోగా వీరికి ఇద్దరు కూతుళ్లు సంతానం ఉన్నారని తెలిపారు. పెద్ద కూతురు వర్షిణి కాగా, చిన్న కూతురు హన్సిక కు వివాహమై ఇంటి నుండి వెళ్లిపోయిందని, ఇక ఒడితలలో పెద్ద కూతురు వర్షిణితో పాటు భార్యాభర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. కాగా గత ఐదేళ్ల క్రితం కవిత భర్తకు పక్షవాతం వచ్చి ఇంటికి పరిమితం అయ్యాడు. ఈ క్రమంలో కప్పల కవితకు తన గ్రామానికి చెందిన జంజర్ల రాజ్ కుమార్(24) అనే యువకుడితో అక్రమ సంబంధం పెట్టుకుందని తెలిపారు. గత మూడేళ్ల నుండి వీరు తరచూ కలుసుకుంటున్న క్రమంలో ఈ విషయం కొన్ని నెలల క్రితం కవిత భర్త కుమారస్వామికి తెలిసింది. దీంతో కుటుంబంలో తరచూ తగాదాలు జరుగుతున్నాయి. రాజ్ కుమార్, కవితలు ఇద్దరు కలుసుకోవడానికి భర్త అడ్డం వస్తున్నాడని, ఎలాగైనా తొలగించుకోవాలని జూన్ 25న తన కూతురు ఇంట్లో లేని సమయంలో పక్షవాతంతో మంచంపై పడుకుని ఉన్న భర్తను కవిత కదలకుండా కాళ్లు పట్టుకోగా, రాజ్ కుమార్ నోరు మూసి గొంతు నొలిమి హత్య చేసి అక్కడి నుండి వెళ్లిపోయాడని తెలిపారు. ఈ విషయం దాచిపెట్టి భార్య కవిత తన భర్త అనారోగ్య కారణంతో చనిపోయాడని అందరినీ నమ్మించి అంత్యక్రియలు జరిపించిందని తెలిపారు. తర్వాత కొద్ది రోజులకు ఈ విషయం తెలుసుకున్న తన పెద్ద కూతురు వర్షిణి తరచూ తన తల్లిని నిలదీయడం, తన తల్లిని కలవడానికి తరచూ వస్తున్న రాజ్ కుమార్ ని అడ్డుకోవడం వంటివి చేయడం జరిగింది. దీంతో మళ్లీ వర్షిణి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుని, ఇద్దరు కలిసి ఆగష్టు 2న అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న తన కూతురు వర్షిణిని తన భర్తను చంపిన విధంగానే ఇరువురు కలిసి హత్య చేసి, ఇంట్లో ఉన్న సంచిలో మూటకట్టి, ఇంటి వెనకాల ఉన్న చెట్ల పొదలలో దాచిపెట్టారని, మరో రోజు మరో చోట దాచి పెట్టారని తెలిపారు. ఆ తరువాత అగష్టు 25న సాయంత్రం టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పైన మధ్యలో శవాన్ని ఉంచుకొని ఒడిదల గ్రామం నుంచి తీసుకొని వచ్చి కమలాపూర్ క్రాస్ రోడ్ దాటిన తర్వాత కాటారం వైపుగా నేషనల్ హైవే కి పక్కన పడేయడం జరిగిందని తెలిపారు. కప్పల కవిత తన భర్తను, ఆ తరువాత కూతుర్ని చంపిన విషయం ఎప్పటికైనా బయటకి వస్తుందన్న భయంతో రాజ్ కుమార్ తో కలిసి గ్రామం నుండి వెళ్లిపోయి మహారాష్ట్రలో ఏదో ఒక పని చేసుకుంటూ ఇద్దరం కలిసి జీవిద్దాం అనే ఆలోచనతో రాజ్ కుమార్ ఎక్సెల్ బండి పైన ఒడితల నుండి బస్వాపూర్ రోడ్డు మీదుగా కొయ్యూరు నుండి గంగారం క్రాస్ మీదుగా మహారాష్ట్ర వెళ్లే ఉద్దేశంతో వస్తూ ఉండగా పోలీసులు ఆ ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ డబుల్ హత్య కేసులను చాకచక్యంగా చేదించిన కాటారం డిఎస్పి సూర్యనారాయణ, విచారణ అధికారి, సిఐ నాగార్జున రావు, ఎస్సై శ్రీనివాస్, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## కాకతీయుల వారసత్వ సంపదను ప్రతిబింబించే అద్భుత కట్టడం రామప్ప



ఐఎఫ్ఎస్ ఉన్నతాధికారులు

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి) :** వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని బుధవారం భారత విదేశాంగ శాఖకు చెందిన సాన్‌ఫ్రాన్సిస్కో లోని భారత కౌన్సిల్ జనరల్ శ్రీకర్ కె రెడ్డి (ఐఎఫ్ఎస్) మరియు బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగాని (ఐఎఫ్ఎస్) ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు వారికి కుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం రామప్ప దేవాలయ చారిత్రక ప్రాముఖ్యత, విశిష్ట శిల్పకళా నైపుణ్యం గురించి టూరిజం గైడ్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిల్ప సౌందర్యానికి నిదర్శనం రామప్ప అని, రామప్ప బ్యూటిఫుల్ టెంపుల్ అని, భారతదేశంలో రామప్ప అద్భుతమైన కట్టడమని, రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు పొందడం అదృష్టమని, ఆలయ ప్రాంగణంలో అహ్లాదకరంగా ఉందని, ఆలయ శిల్పకళా అద్భుతంగా ఉందని వారు కోనియాడారు. కాకతీయుల వారసత్వ సంపదను ప్రతిబింబించే ఈ అద్భుత కట్టడం యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని దర్శించుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. అనంతరం రామప్ప అందాలను, ప్రకృతి అందాలను, చెరువును సందర్శించారు. వారి వెంట భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి, వెంకటాపూర్ తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

## సమృద్ధిగా యూరియా, ఎరువుల నిల్వలు

- పంట సాగుకు అనుగుణంగా యూరియా పంపిణీ చేయాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యచరణ ప్రకారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భుక్యా ఛాత్రు తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో కార్యచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ - పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు, సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలలో ఎలాంటి విభేదాలు ఉండకూడదని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుండి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేసి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటల వివరాలు, సాగు మెలకువలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ, పంట సాగు చేసే రైతుల వివరాలు తదితర అన్ని అంశాలు అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి, కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి కోర్టుకు నాగార్జున

**హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు సినీ నటు-డు అక్కినేని నాగార్జున, అక్కినేని నాగ చైతన్య హాజరయ్యారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తి ఎదుట నాగార్జున, చైతన్య స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం నాగార్జున మీడియాతో మాట్లాడుతూ తాను వేసిన పరువునష్టం దావా కేసులో కోర్టుకు హాజరైనట్లు తెలిపారు.

## కొండపోచమ్మ సాగర్‌కు భారీగా గోదావరి జలాలు

**సిద్దిపేట, సెప్టెంబర్3 (జనంసాక్షి) :** గజ్వేల్ పరిధిలోని మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ జలాశయంలోకి గోదావరి జిల్లాలను ఎత్తిపోసే పక్రియ ప్రారంభమైంది. రంగనాయక సాగర్ జలాశయం నుంచి మల్లన్న సాగర్ జలాశయంలోకి ఎనిమిది పంపుల ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ పంప్ హౌస్‌కు మూడు పంపుల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసే పక్రియను ఈ రోజు ప్రారంభించారు. మూడు పంపుల ద్వారా 3,750 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి విడుదల చేస్తున్నట్లు జలాశయం నిర్వహణ విభాగం ఏఈ సాయికుమార్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 6.85 టీ-ఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

## హరీష్‌రావు, సంతోష్‌పై విషపూరిత విమర్శలు

### బిఆర్ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు తన్నీరు హరీశ్ రావు అని, కేసీఆర్ సమర్థ నాయకత్వంలో రెండు దశాబ్దాలుగా పార్టీని బలోపేతం చేస్తూ, నిస్వార్థ సేవతో ప్రజల మనసులు గెలుచుకున్న నాయకుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ అని బిఆర్ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల అన్నారు. ఇటువంటి అంకితభావంతో పనిచేసే నాయకులపై చీప్ పబ్లిసిటీ కోసం, రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత స్థాయిలో విషపూరిత విమర్శలు చేయడం అత్యంత హీనమైన చర్య అని, ఇలాంటి నీచమైన రాజకీయాలను ప్రజలు, కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తారని తెలిపారు.

# ఎమ్మెల్సీకి పార్టీ సభ్యత్వానికి కవిత రాజీనామా

### సస్పెండ్ చేయడంతో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

వల్ల ఏదో జరిగిపోయినట్లు దుష్టచతుష్టయం ఏదో ప్రచారం చేస్తుందంటూ కవిత మండిపడ్డారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్లుగా ప్రచారం చేశారని మండిపడ్డా రు. కేసీఆర్ వద్దకు వెళ్లితే.. తనను గన్‌మెన్లు అడ్డుకున్నట్లు రాయించారన్నారు. ఆరడు గుల బుల్లెట్ ఈ రోజు తనను గాయపరిచిందన్నా రు. సంతోష్ రావు.. చేసిన పనులతో కేటీఆర్‌కు చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్, సంతోష్ మూ రాలు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కుమ్మక్కయ్యాయ న్నారు. హరీష్ రావును పక్కన పెట్టుకుని.. నిజాలు మాట్లా డిన తనను బయటకు పంపాంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రెండు దశాబ్దాలు పార్టీ కోసం కష్టపడ్డా

రెండు దశాబ్దాల పాటు పార్టీ కోసం కష్టపడి పని చేస్తే.. చివరకు తనకు సస్పెన్షన్ దక్కిందంటూ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. వివరణ కూడా కోరకుండా తనపై సస్పెన్షన్ వేటు- వేశార న్నారు. బీఆర్ఎస్ పార్టీలోఉన్న సమయంలో తాను పార్టీ కోసం, తెలంగాణ కోసం మాత్రమే కష్టపడ్డానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. బిడ్డను చంకన వేసుకుని వచ్చి తెలంగాణ కోసం కష్టపడ్డానని అన్నారు. అమ్మకు కూడా దూరంగా ఉండాల్సి రావడం బాధగా ఉందన్నారు. అయితే తాను ఏ పార్టీలో చేరనన్నారు. తనకు ఏ పార్టీతో పనిలేదని కుండ బద్దలు కొట్టారు. జాగృతి కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడిన తర్వాతే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. పార్టీని హస్తగతం చేసుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఉంటే ఎంత.. లేకుంటే ఎంత అని తాను అనలేదన్నారు. కేసీఆర్‌కు నష్టం చేసే పార్టీ ఉంటే ఎంత.. లేకుంటే ఎంత అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన శరీరం బీఆర్ఎస్ అయితే.. తన ఆత్మ జాగృతి అని అభివర్ణించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా తాను పని చేశానన్నారు. బీఆర్ఎస్‌లో తన భాగస్వామ్యం ఏం లేదా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్‌రావు, సంతోష్‌రావు భాగస్వామ్యం మాత్రమే ఉందా? అని అడిగారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్టుగా ప్రచారం చేశాయని మండిపడ్డారు. కేసీఆర్ దగ్గరకు వెళ్తే గన్‌మెన్లు తనను అడ్డుకున్నట్టు రాయించారన్నారు. లేఖ లీక్ చేసిన వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఆమె ప్రశ్నించారు. పార్టీ తనపై సస్పెన్షన్ వేటు- వేయడంతో.. తన పుట్టింటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో తనకు అమ్మ అంటే చాలా ఇష్టమన్నారు. ఆమెను కలవ లేక పోతున్నట్లు కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు


బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కెసిఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు వీరికు కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు..తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వరితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం పన్నారని అన్నారు. బిఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత విరీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన



ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. వీరీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీ-ఆర్)కు, వీరికూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారని కవిత వ్యాఖ్యానించారు. అక్రమ కేసులు పెట్టి తిహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. రామన్నను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. వీరీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచీ హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న అంటూ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలని కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతికి హరీష్ రావే కారణమన్నారు. తుమ్మడిహట్టి నుంచి మార్చిందే హరీష్ రావని అన్నారు.

## జనగామ జిల్లాలో వరిధాన్యం ఉత్పత్తి ఎక్కువ

### స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 03 ( జనం సాక్షి ) :** ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యంత కరువు ప్రాంతం అయిన జనగామ జిల్లా నేడు రాష్ట్రంలోనే ఎక్కువ వరి ధాన్యం ఉత్పత్తి చేసున్న జిల్లాగా మారిందని దాని కి కారణం దేవాదుల ఎత్తిపోతల పథకమే అని మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గండి రామారం (మల్లన్న గండి) రిజర్వాయర్ నుండి 29కోట్లతో నిర్మించిన కుడి కాలువ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై కాలువను ప్రారం భించి, కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రైతు క్షేత్రం లో పచ్చదనం కాసేలా చేసిన ఈ సాహసం అనుభవజ్ఞు డైన నాయకుడు కడియం శ్రీహరికే సాధ్యమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కడియం శ్రీహరి ఎప్పుడు సిఎంని కలిసినా, రేవంత్ రెడ్డి కూడా అంతే అభిమానంతో నిధులు మంజూరు చేస్తున్నారని, ఇప్ప టివరకు 800 కోట్ల రూపాయలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి జరగడం కడియం శ్రీహరి దూరదృష్టికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఒకప్పుడు తొండలు గుడ్లు పెట్టని భూమిలో నేడు బంగారం పండుతుందని దానికి కారణం దేవాదు ల ఎత్తిపోతల పథకమేనని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి1000 కోట్ల నిధులు తీసుకువచ్చానని, ఉమ్మడి జిల్లా లోనే ఏ నియోజకవ ర్గానికి ఇన్నినిధులు రాలేదనితెలిపారు.గండి రామారం నుండి చిల్పూర్, వేలేరు మండలాలకు సాగు నీరు అందించేందుకు 104 తో లిఫ్ట్ పనులు జరుగుతు న్నాయని 3నెలలో ఆ పనులు పూర్తి అవుతాయాని తెలిపారు.గండి రామారం కుడి కాలువ ఉప కాలువల పనులుకూడా త్వరలో పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. ఎడమ కాలువ ద్వారా కూడా సాగునీరు అందించాల ని దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అనేక సార్లు అడగడం జరిగిందని, గండి రామారం ఎడమకాలువ పనులు కూడా త్వరలోనే చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించి చూపి స్తానని స్పష్టం చేశారు. తన చివరి శ్వాస వరకు నియో జకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. 15 ఏళ్ళు అధికారంలో ఉండి ఎంచేశారని ఈ రోజు పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర రోడ్ల మీద కాదు కాలువల వెంట చేస్తే తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలు కుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పీఏసీఎస్ చైర్మన్లు దూదిపాల నరేందర్ రెడ్డి, కరుణాకర్ రావు,నీటి పారుదల శాఖ ఎస్ఈ సుధీర్, ఈఈ వినయ్, డీఈ సంపత్, ఆర్డిఓ వెంకన్న,మాజీ వైస్ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి,నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

# వీధులు నిశ్శబ్దం కావద్దనే ఉపరాష్ట్రపతి!





*ఎన్నికల రాజకీయాల పట్ల నాకు గౌరవమూ లేదు, నమ్మకమూ లేదు. ఏడు దశాబ్దాల వయోజన వోటు హక్కు రాజకీయాలు ఈ దేశప్రజల నిత్యజీవిత సమస్యలను పరిష్కరించడంలో చిన్నమెత్తు ప్రయత్నం కూడా చేయలేదు. ఎన్నికల ద్వారా అందిన అధికారం పాలకవర్గ సంపదా అధికారమూ దౌర్జన్యమూ పెరగడానికి తప్ప మరెందుకూ ఉపయోగపడలేదు. గద్దెల మీది వాళ్లు అప్పుడప్పుడు చేతులు విదిలిస్తే రాలిన ఎంగిలి మెతుకులు అందుకున్నవాళ్లు, ఆ సంపద, అధికార, దౌర్జన్య ప్రవాహపు గొట్టానికి అక్కడక్కడ చిల్లులు పెట్టి ఎంతో కొంత సాధించుకోగలిగిన వాళ్లు కొందరు ఉంటే ఉండవచ్చు గాని భారత ప్రజా జీవన అభివృద్ధికి ఎన్నికల రాజకీయాలు చేసినదేమీ లేదని చరిత్ర విద్యార్థిగా నేను నేర్చుకున్న పాఠం.*

**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

అటువంటి వ్యవస్థలో అధికార పీఠాల మీద కూచున్నవాళ్లు ఎంత మంచివాళ్లయినా ప్రత్యేకంగా చేయగలిగినదేమీ ఉండదు. తప్పనిసరిగా ఈ ఏడు దశాబ్దాలలో కొందరయినా మంచివాళ్లు ఆ ఆధికార పీఠాలను అధిరోహించగలిగారు. వందల వేల సంవత్సరాలుగా దోపిడీకీ, పీడనకూ, ప్రత్యేకించి మన దేశపు దుర్మార్గమైన మనువాద అణచివేతకూ గురైన వర్గాల నుంచి కూడా కొందరు ఆ అధికార పీఠాలకు ఎదిగారు. కాని నిర్మొహమాటంగా వారి చరిత్రలను పరిశీలిస్తే, వారు అత్యంత కీలక సమయాల్లో కూడా ప్రజా జీవన అభ్యున్నతి కోసం, కనీసం తమ వర్గపు మేలు కోసం చేసిన పని లేదనో, అతి కొంచెం అనో తేలుతుంది. "ప్రజాప్రతినిధులు"గా ఎన్నికై మంత్రులూ ముఖ్యమంత్రులూ ప్రధానమంత్రులూ అయినవాళ్ల సంగతి పక్కన పెట్టండి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ఎన్నికల కమిషనర్ వంటి రాజ్యాంగబద్ధ పదవులు అధిరోహించినవారు కూడా దేశానికి చేసిన పెద్ద మేలు ఏమీ లేదు. వారు అణగారిన వర్గాల నుంచి వచ్చినవారైనప్పుడు కూడా వారి పదవీ కాలాలలో ఆయా వర్గాలకు ఒరిగినదేమీ లేదు.

ఉపరాష్ట్రపతి దేశంలో రెండో అతి పెద్ద రాజ్యాంగబద్ధ పదవి అయినప్పటికీ రాజ్యసభ అధ్యక్షులుగా తప్ప, రాష్ట్రపతి లేనప్పుడు విధి నిర్వహణ తప్ప, ఇతరంగా ఆ పదవికి ప్రాధాన్యత ఉన్నట్టు రాజ్యాంగం చెప్పడం లేదు. ఇప్పటివరకూ ఆ పదవి చేపట్టినవారు చెప్పుకోదగిన ముద్ర వేసిన ఉదాహరణలూ లేవు. ఈ స్థితిలో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనేది అంతగా పట్టించుకోవలసిన అంశమేమీ కాదు. కాని ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ఈ దేశ పౌరులందరూ తప్పనిసరిగా పట్టించుకోక తప్పని స్థితి కల్పించింది. ఇది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా కాక, చరిత్రాత్మక భావజాల పోరాటంగా మారుతున్నది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్ డి ఎ కూటమి ఆ పదవికి సి పి రాధాకృష్ణన్ ను తన అభ్యర్థిగా ప్రకటించింది. తమిళనాడుకు చెందిన ఈ 68 సంవత్సరాల వ్యక్తి తన జీవితంలో 52 సంవత్సరాలు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో, సంఘ్ పరివార్ లో ఉన్నారు. తమిళనాడులో, కేరళలో ఆర్ఎస్ఎస్ కు పునాది సంపాదించి పెట్టినవాడిగా, భారతీయ జనతా పార్టీ అగ్రనాయకుడు అటల్ బిహారీ వాజపేయికి ఆంతరంగికుడిగా ఆయనకు పేరు. కాని ఆ వాజపేయి 'రాజ ధర్మం' కాదన్న పని చేసిన నరేంద్ర మోడీకి, గుజరాత్ మారణ కాండ జరిగిన కొద్ది వారాల్లోనే, పార్టీ అభిప్రాయానికి కూడా భిన్నంగా కోయంబత్తూరులో మొట్టమొదటి బహిరంగ ప్రజా ప్రదర్శనతో మద్దతు పలికిన వ్యక్తి ఆయన. అలా ఆయనకు ఇవాళ్టి సంఘ్ పరివార్ ప్రతిపాదనకు తగిన అర్హతలన్నీ ఉన్నాయి.

ప్రత్యర్థిగా జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరు మొదట ఇండియా కూటమి, తర్వాత ఒకటొకటిగా ఆ కూటమిలో లేని పక్షాలు కూడా ప్రతిపాదించాయి. నిజానికి సుదర్శన్ రెడ్డి పేరు ప్రతిపాదనకు రావడమంటేనే రాజ్యాంగ వ్యతిరేకతకు – రాజ్యాంగ స్ఫూర్తికి పోటీ ప్రతిపాదన వచ్చినట్టు. డెబ్బై తొమ్మిది సంవత్సరాల సుదర్శన్ రెడ్డి యాభై సంవత్సరాలకు పైగా రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇరవై సంవత్సరాలకు పైగా న్యాయవాదిగా పని చేసి, ఆ తర్వాత పన్నెండు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోనే న్యాయమూర్తిగా ఉండి, 2005లో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు.

ఆయన పేరు ప్రతిపాదన రాగానే కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా ఆయన మీద దుమ్మెత్తిపోయడం ప్రారంభించారు. ఎన్ డి ఎ ప్రభుత్వంలో మంత్రిగా ఆయన తమ అభ్యర్థికి వోటు వెయ్యమని అడగవచ్చు, తమ అభ్యర్థి గుణగణాలు చెప్పవచ్చు. కాని ప్రత్యర్థి మీద విమర్శలు ఎక్కుపెట్టారంటేనే తమ అభ్యర్థి గురించి చెప్పుకోవలసింది ఏమీ లేదని అర్థం. ఆ విమర్శలు కూడా అవాస్తవికమైనవి, హాస్యాస్పదమైనవి, దుర్మార్గమైనవి, దేశంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేవి.

మొదట ఆగస్ట్ 22న కొచ్చిలో మలయాళ మనోరమ ఉత్సవంలోనూ, ఆ తర్వాత ఆగస్ట్ 25న ఎఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోనూ అమిత్ షా నేరుగా ప్రతిపక్ష అభ్యర్థి పేరు చెప్పి విమర్శలు చేశాడు. ఆయన అర్బన్ నక్సల్ అన్నాడు. ఆయన ఇచ్చిన సాల్వా జుడుమ్ తీర్పు కొన ఊపిరితో ఉన్న నక్సలైట్లకు ప్రాణం పోసిందన్నాడు. ఆ తీర్పు రాకపోతే నక్సలైట్ల పని ఇరవై ఏళ్ల కిందనే అయిపోయేదన్నాడు. ఆ తీర్పు గిరిజనుల ఆత్మరక్షణా హక్కును రద్దు చేసిందన్నాడు.

వీటిలో ప్రతి ఒక్కటీ పచ్చి అబద్ధం. లేదా అబద్ధానికి సరిసమానమైన అర్ధసత్యం. సాల్వా జుడుమ్ తీర్పు సుప్రీం కోర్టు తీర్పు గాని ఒకానొక వ్యక్తి తీర్పు కాదు. నిజానికి ఆ తీర్పు ఇచ్చినది ద్విసభ్య ధర్మాసనం.

ఆ తీర్పు ఆ తర్వాత పద్నాలుగు సంవత్సరా లలో అనేక మంది ఇతర న్యాయమూర్తుల ముందు చర్చకు వచ్చింది. దాన్ని కొట్టివేయడం గాని, సవరించడం గాని, అందులో తప్పులు ఎన్నడం గాని జరగలేదు. అటువంటి సుప్రీం కోర్టు తీర్పును ఒక కేంద్ర హెూమ్ మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి అలా ఖండించడం కోర్టు ధిక్కార నేరం అవుతుంది. తీర్పుల మంచి చెడుల గురించి చర్చించగూడదని కాదు. తప్పకుండా ఎవరికైనా చర్చించే అధికారం ఉంది. కాని ఆ చర్చకు ఏకైక ప్రాతిపదిక, చట్రం ఆ తీర్పు రాజ్యాంగ పరిధిలో ఉందా, ఆ పరిధి దాటిందా అనేది మాత్రమే. అలా చూసినప్పుడు ఆ తీర్పు సంపూర్ణంగా రాజ్యాంగబద్ధమైన, రాజ్యాంగాన్ని పరిరక్షించిన తీర్పు.

ఆ తీర్పు గిరిజనుల ఆత్మరక్షణా హక్కును రద్దు చేసిందనడం అబద్ధాలలోకెల్లా పరమ అబద్ధం. ఛత్తీస్ గడ్ లో నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, మహేంద్ర కర్మ నాయకత్వంలో సాల్వా జుడుమ్ అనే హంతక మాఫియా సంస్థను ఏర్పాటు చేసింది. ఆదివాసీ యువత నుంచి కొందరిని చేరదీసి, వారి చేతికి తుపాకులు ఇచ్చి, స్పెషల్ పోలీస్ ఆఫీసర్ అనే హెూదా ఇచ్చి, నక్సలైట్లను, వారి సాను భూతిపరులైన ఆదివాసులను చంపడానికి అధికారం ఇచ్చింది. ఆ బీభత్స కాండలో సాల్వా జుడుమ్ ఆదివాసులను నక్సలైట్ల నుంచి దూరం చేయడానికి, వందలాది గూడాలను తగులబెట్టి, ఆదివాసులను వెంటాడింది. కొందరిని పట్టుకుని నిర్బంధ శిబిరాల్లో నిర్బంధించింది. లక్షలాది మంది పారిపోయి ఇతర చోట్ల, ఇతర రాష్ట్రాల్లో తలదాచుకున్నారు. ఈ క్రమంలో ఎంతమంది హత్యకు గురయ్యారో, ఎంతమంది స్త్రీల మీద అత్యాచారాలు జరిగాయో లెక్కలేదు. ఆదివాసుల మధ్య అంత ర్యుద్ధంగా మారిన ఆ హింసాకాండను ఆపమని 2007లో సామాజిక శాస్త్రవేత్తలు నందిని సుందర్, రామచంద్ర గుహ, మాజీ ఉన్నతాధికారి ఈ ఏ ఎస్ శర్మ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ సురీందర్ నిజ్జర్ ల బెంచీ ముందుకు వచ్చింది. వారు నాలుగు సంవత్సరాల విచారణ తర్వాత విద్యార్హతలు, శిక్షణ, వినియోగం మీద చట్టబద్ధ ఆంక్షలు లేకుండా ఎవరో ఒకరి చేతికి తుపాకి ఇవ్వడం, ఏమైనా చేయడానికి అధికారం ఇవ్వడం రాజ్యాంగం అంగీకరించదు అని తీర్పు ఇచ్చారు.

ఇప్పుడు అమిత్ షా ఆ తీర్పును తప్పు పడుతున్నాడంటే, అలా ఎవరి చేతికైనా తుపాకి ఇవ్వవచ్చునని, హింసాకాండకు బారా ఖూన్ మాఫ్ అనవచ్చునని అంటున్నాడా? అమిత్ షాకు ఒకందుకు మాత్రం కృతజ్ఞతలు చెప్పాలి. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. పద్నాలుగు సంవత్స రాల కిందటి రాజ్యాంగ పరిరక్షణ తీర్పు మరొకసారి చర్చకు వచ్చింది. ఎప్పుడైనా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయే ఉప రాష్ట్రపతి ఎన్నిక దేశవ్యాప్త చర్చకు, అవసరమైన విషయాల ప్రస్తావనకు, గుర్తు తెచ్చుకోవడానికి, వాదవివాదాలు సాగడానికి అవకాశం ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును ఇలా రాజకీయ వివాదాలలోకి లాగగూడదు అని పద్దెనిమిది మంది మాజీ న్యాయమూర్తులు రాసిన లేఖకు జవాబుగా, ఆ లేఖే రాజకీయాలలోకి లాగడం అని, అంటే అమిత్ షా వ్యాఖ్య సరైనదేనని అర్థం వచ్చేలా సంఘ్ పరివార్ యాభై ఆరు మంది మాజీ న్యాయమూర్తుల సంతకాలతో మరొక లేఖ విడుదల చేసింది. ఇలా న్యాయమూర్తులు బహిరంగ చర్చకు దిగిన అరుదైన సందర్భం ఇది. ఎవరు రాజ్యాంగం వైపు ఉన్నారో, ఎవరు రాజ్యాంగ విధ్వంసాన్ని సమర్థిస్తున్నారో లోకం ముందుకు బహిరంగంగానే వచ్చింది.

గతంలో వెంకయ్య నాయుడు, పి వి నరసింహారావుల ఎన్నికల సందర్భంలో తెలుగు బిడ్డ గనుక రాజకీయ విభేదాలు పక్కన పెట్టి సమర్థించాలని పిలుపులు ఇచ్చిన వ్యక్తులూ పార్టీలూ ఇప్పుడు అవసరం కోసం ఆ తెలుగు బిడ్డ వాదనను వదులుకోవడం కూడా బహిరంగంగా ప్రజల దృష్టికి వస్తూనే ఉంది. అధికారంలో ఉన్నవారూ ప్రతిపక్షంలో ఉన్నవారూ కూడా ఏదో ఒక సాకుతో, అవి తమ మీద ఉన్న కేసులు కావచ్చు, లేదా యూరియా ఇస్తారా వంటి చౌకబారు ప్రకటన కావచ్చు, రాజ్యాంగ విధ్వంసకుల పక్షం తీసుకుంటున్నారనేది కూడా బహిరంగంగా కనబడుతూనే ఉంది.

న్యాయమూర్తులు కూడా సమాజంలో వ్యక్తులే గనుక వారికి తప్పనిసరిగా రాజకీయ, సామాజిక అభిప్రాయాలు ఉంటాయి, ఉండాలి. వారు విధినిర్వహణలో మాత్రం తప్పనిసరిగా రాజ్యాంగ పరిధిని దాటకుండా, రాజ్యాంగ వ్యాఖ్యాతలుగా, రాజ్యాంగ పరిరక్షకులుగా, రాజ్యాంగ అర్థాలను వివరించేవారుగా మాత్రమే ఉండాలి. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తనను తాను సోషలిస్టుగా, డా. రామమనోహర్ లోహియా భావాలను ఆమోదించే వ్యక్తిగా అనేకసార్లు చెప్పుకున్నారు. అయినా ఆయన తీర్పులలో ఎప్పుడూ రాజ్యాంగ పరిధిని దాటి తన అభిప్రాయాల ప్రకటన చేయలేదు.

ఆయన నోటి నుంచి గతంలో చాలా సార్లు, మొన్న నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన రోజున కూడా డా. రామమనోహర్ లోహియా (1910-1967) మాట ఒకటి వినబడింది. 'అగర్ సడకే ఖామోష్ హెూ జాయే, తో సంసద్ ఆవారా హెూ జాయేగీ' అనేది ఆ మాట. వీధులు నిశ్శబ్దంలో మునిగితే, చట్టసభ దిక్కు లేనిదవుతుంది అనే ఈ మాటకు లోతైన అర్థాలున్నాయి. సమాజంలో బహిరంగంగా ప్రజా ఉద్యమాలు, నిరసనలు, ఆలోచనలు, ప్రదర్శనలు, సత్యాగ్రహాలు, సభలు, సమావేశాలు, ఒత్తిడి లేకుండా పోతే, చట్టసభ, పాలన, అధికార కేంద్రం కూడా దిక్కుతోచని స్థితిలో, మార్గదర్శకత్వం లేని స్థితిలో పడిపోతాయి, ప్రజాస్వామిక ఆదర్శాలను వదిలేస్తాయి అని దాని అర్థం.

చట్టసభ సజీవంగా ఉండాలంటే ప్రజాభిప్రాయ ప్రకటనలు ఉండాలి అని దాని అర్థం. నిరంతర జాగరూకతే ప్రజాస్వామ్యానికి మూల్యం అనే మాటకు మరొక రూపం అది. ఆ లోహియా మాటను అక్షరాలా నమ్మే వ్యక్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి. ఆయన అభ్యర్థిగా ఉన్నందువల్ల ఈసారి ఉపరాష్ట్రపతి ఎన్నిక చరిత్రాత్మకమూ, ప్రతి ఒక్కరూ పట్టించుకోవలసినదీ, అవసరమైన విస్తారమైన చర్చకు దారి తీస్తున్నదీ అవుతున్నది.

## దేశ ప్రగతిపథ జ్ఞానశిల్పి

(ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక కవితాసుధ)

పసిప్రాణాల హృదయాల్లో జిజ్ఞాస రగిలించి,
చీకటి గూడిన చిత్తాల్లో జ్ఞాన దీపం వెలిగించి,
అక్షరమనే అమృతధారతో భవిష్యత్తును తీర్చిదిద్ది,
నైతిక సమాజాన్ని నిర్మించే కారుణ్యశీలి ఆచార్యుడు.
మనసుల్లో మాణిక్యాలను తరశించి
మెరిపించేవాడు,
దేశానికి దిక్సూచి, సమాజానికి మార్గదర్శి,
త్యాగమే శ్వాస, సేవే జీవన గమ్యగా చేసుకొని,
మానవ జాతికి వెలుగునిచ్చే జ్ఞానజ్యోతి బోధకుడు.
శ్రమకు నిదర్శనమై, సత్యానికి సాక్ష్యమై,
సంస్కారాలకు, సమగ్రతకు మూలస్తంభమై,
భవిష్యత్తు యోధులకు జ్ఞానాయుధాన్ని ప్రసాదిస్తూ,
యువశక్తికి దారి చూపిస్తున్న మార్గదర్శి గురువు.
అజ్ఞానపు మబ్బులను పారద్రోలే ఉదయరావి,
పుస్తకమే కవచం, జ్ఞానమే ఖడ్గమని,
విద్యార్థుల ఆలోచనల్లో స్ఫూర్తినింపే మహర్షి,
ప్రేరణకు జ్ఞానదాత ఉపాధ్యాయుడు.
రైతు ధాన్యసంపదను పండిస్తే,
తాను జ్ఞానసంపదను పండించే వాడు,
మనసును మలిచి మానవతను నేర్పే,
నాగరికత పునాది ఈ విద్యాసేవకుడు.
తరతరాల స్ఫూర్తిని భావితరాలలో కలిగించి,
మనసులో జ్ఞానమనే విత్తనం నాటి,
బోధనవే వర్షంతో మొలకెత్తించి,
తలరాతను మార్చే మరో బ్రహ్మ అధ్యాపకుడు.
శ్రద్ధా, శ్రమ, అకుంఠిత దీక్షలను ఎరువుగా వాడి,
విద్యార్థుల మదిలో జ్ఞానపుష్పాలు పండించి,
దేశానికి విజ్ఞాన పంటను సమకూర్చి,
దేశ ప్రగతిపథాన్ని నిర్మించే జ్ఞానశిల్పికి వందనం.



**నసుబోలు రాజశేఖర్,**
తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా,
9885739808, 8330969808

## "బతికేది కొన్నేళ్లయినా"

ఎవరో ఏదో అంటారని,
భయాన్ని రానిచ్చావా -
ఏం చేద్దామన్నా, భయం నిన్ను వదలదు.
ఆ భయంలో, నిర్లక్ష్యం నిన్ను నిండా
ముంచేస్తుంది.
నీకు నువ్వు కాకుండా చేస్తుంది,
తిరిగి నువ్వే లేకుండా చేస్తుంది.
నీ ఉనికిని ఊదరగొట్టి,
ఉన్నపళంగా నిన్ను ఊడ్చేస్తుంది.
ఎవరెన్ని మాటలన్నా,
అన్నింటినీ తీసుకెళ్లి ఏ నదిలోనైనా పారబోయి.
నీ హృదయ రాజ్యాన,
నీవే రాజులా,
వెయ్యేండ్ల బలాన్ని పుణికి పుచ్చుకుంటావు.
బతికేది కొన్నేళ్లయినా -
నాణ్యమైన, సాంద్రతగల జీవితాన్ని
జీవించిన వాడవవుతావు.

**బాలాజీ పోతుల**
8179283830

# ఆఫ్ఘనిస్తాన్ విషాదం
## మానవత్వానికీ ఒక పరీక్ష



ఆఫ్ఘనిస్తాన్ గత వైభవానికి, ప్రస్తుత విషాదానికి ఒక నిలువుటద్దం.ఇక్కడ గొప్ప నాగరికతలు పురుడు పోసుకున్నాయి, కానీ దశాబ్దాలుగా యుద్ధాలు, ఘర్షణలు, మానవతా సంక్షోభాల కబంధ హస్తాల్లో చిక్కుకుంది. ఈ మానవ నిర్మిత విలయానికి ప్రకృతి ఆగ్రహం తోడైనప్పుడు, అది ఒక భయంకరమైన విషాదానికి దారి తీస్తుంది. 2025 ఆగస్టు 31న ఆఫ్ఘనిస్తాన్‌లోని సంభవించిన భూకంపం అలాంటిదే. రిక్టర్ స్కేల్‌పై కేవలం 6.0 తీవ్రత ఉన్నప్పటికీ, ఈ భూకంపం 800 మందికి పైగా ప్రజల ప్రాణాలను బలిగొంది. ఇది కేవలం ఒక ప్రకృతి విపత్తు కాదు, మానవ వైఫల్యం, అంతర్జాతీయ నిర్లక్ష్యం కలగలిసి సృష్టించిన ఒక భయంకరమైన విషాదం.

ప్రకృతి వైపరీత్యాలు అన్ని దేశాల్లోనూ సంభవిస్తాయి. జపాన్, చిలీ, టర్కీ వంటి దేశాలు కూడా తరచుగా భూకంపాలను ఎదుర్కొంటాయి. కానీ అక్కడ ప్రాణనష్టం ఇంత భారీ సంఖ్యలో ఉండదు. ఎందుకు? దీనికి కారణం వారి ముందుచూపు, శాస్త్రీయ విధానాలు. ఆ దేశాలు కఠినమైన భవన నిర్మాణ నియమావళిని అమలు చేస్తాయి. సాధారణ గృహాలు కూడా భూకంపాల ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించబడతాయి. కానీ ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. గ్రామాల్లో ఎక్కువ ఇళ్లు మట్టి, మట్టి ఇటుకలు, గట్టిపడని రాళ్లతో కట్టబడతాయి. ఒక చిన్న ప్రకంపన చాలు, మొత్తం గోడలు కూలిపోయి నిద్రలో ఉన్న ప్రజలను సమాధి చేస్తాయి. ఇలాంటి బలహీన నిర్మాణాల వల్లనే తక్కువ తీవ్రత గల భూకంపం కూడా ఇంత భారీ ప్రాణనష్టాన్ని కలిగించింది.

ఈ విధ్వంసానికి మూల కారణం భౌగోళికమే అయినా, దాని పర్యవసానాలు మానవ నిర్మితాలే. భారత యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య నిరంతర ఘర్షణ వల్ల భూకంపాలు సంభవిస్తాయి. ఈ ప్రక్రియ ఒక శాశ్వత భౌగోళిక సత్యం. అయితే, ఈ భౌగోళిక సత్యానికి మానవ దుర్బలత్వం తోడైంది. దశాబ్దాల అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత, ఆర్థిక క్షీణత దేశాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పటిష్టమైన విపత్తు నిర్వహణ వ్యవస్థ లేకపోవడం, అంతర్జాతీయ సమాజం నుండి తాలిబాన్ ప్రభుత్వం వేరుపడటం వంటి కారణాలు సహాయక చర్యలను ఆలస్యం చేశాయి. ఇది శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి అత్యంత కీలకమైన మొదటి కొన్ని గంటలను వృథా చేసింది.

2025లో సంభవించిన ఈ భూకంపం ఆఫ్ఘనిస్తాన్‌కు కొత్త పాఠం కాదు. దీని చరిత్రలో అనేక విధ్వంసకర భూకంపాలు సంభవించాయి. 1998 తఖర్ భూకంపం, 2015 హిందూకుష్ భూకంపం, 2022 పక్టికా భూకంపం, మరియు 2023 హెరాత్ భూకంపం వంటివి ఈ విషాదానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. ప్రతీసారీ ప్రపంచం సహాయం కోసం ముందుకు వచ్చింది, కానీ శాశ్వత పరిష్కారాలను అందించడంలో విఫలమైంది.

ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, కేవలం అత్యవసర సహాయం సరిపోదు. ఇది ఒక దీర్ఘకాలిక, వ్యూహాత్మక ప్రయత్నంగా ఉండాలి. ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపాలను తట్టుకునేలా బలమైన నిర్మాణాలను ప్రోత్సహించాలి. స్థానిక సాంకేతికతలతో, తక్కువ ఖర్చుతో కూడిన ఇళ్లను నిర్మించడానికి వారికి సహాయం చేయాలి. భూకంపాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించి, అమలు చేయడంలో వారికి శిక్షణ ఇవ్వాలి. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, అంతర్జాతీయ సమాజం మానవతా దృక్పథంతో ఆఫ్ఘనిస్తాన్‌కు సహాయం అందించాలి. 2025 భూకంపం కేవలం ఆఫ్ఘనిస్తాన్‌కు మాత్రమే ఒక విషాదం కాదు. ఇది ప్రపంచ మానవత్వానికి ఒక పరీక్ష. ఈ విషాదం నుండి మనం పాఠాలు నేర్చుకొని, భవిష్యత్తులో వచ్చే భూకంపాలను తట్టుకునేలా ఆఫ్ఘనిస్తాన్‌కు బలం చేకూర్చాలి. లేకపోతే, భౌగోళిక శక్తులు మరియు మానవ దుర్బలత్వం కలిసి ఇలాంటి అనేక విషాదాలను సృష్టిస్తూనే ఉంటాయి.

**జె యం ఆర్ దుంగ**
8247045230

# ఇంటి గుట్టు లంకకు చేటు





### బీఆర్ఎస్‌లో భగ్గుమన్న కవిత ఆరోపణలు

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పార్టీ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ నుంచి సస్పెన్షన్, ఆపై ఆమె చేసిన సంచలన ఆరోపణలు, తదుపరి రాజీనామా ... ఇవన్నీ బీఆర్ఎస్‌లోని అంతర్గత కలహాలను బట్టబయలు చేశాయి. ఈ వివాదం కేవలం కుటుంబ రాజకీయాలకు పరిమితమా? లేక పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే సమస్యలా? వివిధ మీడియా వర్గాలు, సోషల్ మీడియా చర్చలు, పత్రికల విశ్లేషణల ఆధారంగా ఈ వ్యాసంలో లోతుగా పరిశీలిద్దాం.

ముందుగా,ఈ ఘటనల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే, బీఆర్ఎస్ పార్టీలో కవిత సస్పెన్షన్‌కు ముందు నుంచి అంతర్గత విభేదాలు ఉన్నాయి. "తెలంగాణ జాగృతి" సంస్థ వ్యవస్థాపకురాలిగా, మాజీ ఎంపీగా కవిత పార్టీలో కీలక పాత్ర పోషించారు. అయితే, ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమె అరెస్ట్ అయి, ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించిన తర్వాత పార్టీలో ఆమె స్థానం ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ పార్టీ ఆమెను సస్పెండ్ చేసింది. కారణం...ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పార్టీ చాలా కాలంగా ఓపిక పట్టి, ఆమె శృతిమించి పార్టీ పై,ఇతర పార్టీ నేతలపై చేసిన ఆరోపణల ప్రభావంతో ఆమెను టీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. ఇది కవితకు షాక్‌గా మారింది.దీనితో ఆమె వెంటనే ప్రెస్ మీట్ పెట్టి మరి కొన్ని సంచలన ఆరోపణలు చేశారు. కవిత ముఖ్య ఆరోపణలు హరీశ్ రావు (కేసీఆర్ మేనల్లుడు), సంతోష్ రావు (కేసీఆర్ మరో బంధువు)పైనే ఎక్కువగా సాగాయి. "వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకోవాలని కుట్రలు పన్నుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి వీరే కారకులు, నా తండ్రి కేసీఆర్‌ను బలిపశువుగా చేస్తున్నారు" అని ఆమె అన్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హరీశ్ రావు కుమ్మక్కై, తన సస్పెన్షన్‌కు కారణమయ్యారని ఆరోపించారు. "నాన్నా, (కేసీఆర్) రామన్నా (కేటీఆర్) జాగ్రత్త" అంటూ ఆమె వారిని హెచ్చరించడం విశేషం. ఇంకా, "పార్టీని బీజేపీలో విలీనం చేయాలని వీరు ప్రయత్నిస్తున్నారు, నేను జైలులో ఉన్నప్పుడు ఇలాంటి ప్రతిపాదనలు వచ్చాయి" అని ఆమె వెల్లడించారు. ఈ ఆరోపణలు బీఆర్ఎస్‌లో మాత్రమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లోనూ పెద్ద చర్చకు దారితీశాయి. ఈ ప్రెస్ మీట్ తర్వాత కవిత బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. "నేను వేరే పార్టీలో చేరడం లేదు, కానీ పార్టీలోని కుట్రదారులు నన్ను బయటకు తోసేశారు" అని అన్నారు.

ఇది బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా చెప్పవచ్చు. ఎందుకంటే, కవిత తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆమె నిజామాబాద్ ఎంపీగా, జాగృతి సంస్థ ద్వారా మహిళలు, బీసీల హక్కుల కోసం పోరాడారు. అలాంటి నేతను పార్టీ నుంచి తొలగించడం పార్టీ ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇక, బీఆర్ఎస్ పార్టీ స్పందన చూస్తే, కవిత ఆరోపణలను తోసిపుచ్చారు. పార్టీ అధికారికంగా "ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు" అని ప్రకటించింది. కేసీఆర్ మాత్రం రిలాక్స్‌గా ఉన్నారని, ఆయన ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటున్నారని మీడియా వర్గాలు చెబుతున్నాయి.

అయితే, పార్టీలోని కొందరు నేతలు కవితకు మద్దతుగా మాట్లాడుతున్నారు. మరోవైపు, సోషల్ మీడియాలో బీఆర్ఎస్ క్యాడర్ విభజితమైంది. కొందరు కవితను "పార్టీ ద్రోహి" అంటుంటే, మరికొందరు "ఆమె ఆరోపణల్లో నిజం ఉంది" అని అంటున్నారు. "X" (ట్విట్టర్)లో ట్రెండింగ్ అయింది, అక్కడ కవిత మాటలను ఉటంకిస్తూ వీడియోలు వైరల్ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందనలు కూడా వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "లాగుతారు?" అని స్పందించారు. అయితే, కవిత ఆరోపణలు కాళేశ్వరం అవినీతి విషయాన్ని మళ్లీ తెరమీదకు తెచ్చాయి. ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇప్పటికే విమర్శలున్నాయి. కవిత "హరీశ్ రావు ధన దాహం అపారం" అని అనడం ద్వారా పార్టీలోని అవినీతిని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్‌కు ప్రత్యక్షంగా రాజకీయ లాభం చేకూర్చవచ్చు, ఎందుకంటే వారు ఇప్పటికే కాళేశ్వరం విచారణకు సీబీఐకి ఆదేశాలు ఇచ్చారు.

విశ్లేషణాత్మకంగా చూస్తే, ఈ వివాదం బీఆర్ఎస్‌కు పెద్ద సవాల్. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇది పార్టీలో అతిపెద్ద చీలిక. కేసీఆర్ కుటుంబం ఆధిపత్యంలో ఉన్న పార్టీలో కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు పార్టీ క్యాడర్‌ను డిమోరలైజ్ చేయవచ్చు. కవిత "కొత్త పార్టీ పెట్టే అవకాశం లేదు కానీ భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు" అని అనడం ఆసక్తికరం. ఆమె తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చవచ్చని ఊహాగానాలు ఉన్నాయి. అయితే, విశ్లేషకులు "కవిత సొంత పార్టీ పెట్టినా, క్యాడర్ వెంట రావడం కష్టం" అంటున్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, లోక్‌సభలో కూడా బలహీనమైంది. ఈ చీలిక పార్టీని మరింత బలహీనపరుస్తుంది.

విమర్శనాత్మకంగా చూస్తే, కవిత ఆరోపణలు ఎంతవరకు నిజమో అన్న ప్రశ్న. ఆమె "కాళేశ్వరంలో అవినీతి హరీశ్ రావు చేతి పని" అని అన్నారు కానీ, ప్రాజెక్టు నిర్మాణం కేసీఆర్ హయాంలోనిది. ఇది పార్టీపైనే బురద జల్లడమా? మరోవైపు, పార్టీలో మహిళా నేతలకు సరైన అవకాశాలు లేకపోవడం కవిత సస్పెన్షన్‌కు కారణమా? సోషల్ మీడియాలో కొందరు "కవితను లక్ష్యం చేసుకోవడం గ్రీక్‌వీరుల చర్య" అని విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ట్విట్టర్ ట్రెండ్‌లు, ప్రెస్ మీట్ వీడియోలు ఈ వివాదాన్ని మరింత రెచ్చగొట్టాయి. ఈ ఘటన తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ రాజకీయాల ప్రమాదాలను బయటపెడుతోంది. బీఆర్ఎస్ ఐక్యత కాపాడుకోకపోతే, కాంగ్రెస్, బీజేపీలకు లాభం చేకూరవచ్చు. కవిత భవిష్యత్ నిర్ణయాలు, పార్టీ పునర్నిర్మాణం... ఇవి రాబోయే రోజుల్లో కీలకం. ఈ వివాదం పార్టీలో సంస్కరణలకు దారి తీస్తుందా? లేక మరిన్ని చీలికలకా? అనేది కాలమే చెప్పాలి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# గ్రామపంచాయతీ ఎన్నికల తుది ఓటరు జాబితా విడుదల

- బొంరాస్ పేట 32,120,దుద్యాల 21,078 మంది ఓటర్లు
- స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి
- వెల్లడించిన ఎంపీడీవోలు వెంకన్ గౌడ్,మహేష్ కుమార్



**బొంరాస్‌పేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30 లోపు నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వానికి గడువు విధించిన నేపథ్యంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను అధికారులు వెల్లడించారు.బొంరాస్ పేట మండలంలో మొత్తం 35 గ్రామ పంచాయతీలు,292 వార్డులు,292 పోలింగ్ స్టేషన్లు ఉండగా మొత్తం 32,120 మంది ఓటర్లు ఉన్నారు.వారిలో పురుషులు 15,897,మహిళలు 16,223 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో వెంకన్ గౌడ్ తెలిపారు.దుద్యాల మండలంలో 20 గ్రామ పంచాయతీలు,166 వార్డులు,166 పోలింగ్ స్టేషన్లు ఉండగా మొత్తం 21,078 మంది ఓటర్లు ఉన్నారు.వారిలో 10,248 మంది పురుషులు,10,830 మంది మహిళ ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో మహేష్ కుమార్ తెలిపారు. బొంరాస్ పేట మండలంలో గ్రామాల వారిగా ఓటర్లు కొత్తూరు 1,433,కట్టుకాల్వతాండ 366, కాకర్లగండితాండ 346, జానకంపల్లి 355, వై ఎనిమిదితాండ 426,ఎన్కేపల్లి 1,220, చౌదర్పల్లి 1,618, ఏర్పుమళ్ళ 1,349,దుప్చర్ల 637, లింగన్‌పల్లి 716, లోతుకుంటతాండ 479,మదన్ పల్లి 462,మదన్ పల్లితాండ 699,మేడిచెట్టుతాండ 508, మెట్లకుంట 1,643,నాగిరెడ్డిపల్లి 530,నాందార్ పూర్ 1,204,రేగడిమైలారం 1,723, సాలిండపూర్ 814,టేకులగడ్డతాండ 591,తుంకిమెట్ల 1,621,ఎనిమిదితాండ 855, కుబ్యానాయక్ తాండ 595, బుర్రితాండ 967,బాపల్లితాండ 779,బాపన్ చెరువు 530, బొంరాస్ పేట 3,422,బొట్లవాణితాండ 728,బురాన్ పూర్ 1,477,గట్టేగానితాండ 579, పాలబాయితాండ 292, మూడుమామిళ్ళతాండ 655,సూర్యనాయక్ తాండ 483,వడిచర్ల 921, మహంతిపూర్ 1,100 మంది ఓటర్లు ఉన్నారు. దుద్యాల మండలంలో గ్రామాల వారీగా ఓటర్లు ఆలేడు 808, అల్లిఖాన్ పల్లి,1,080, హంసాన్పల్లి 432,చెట్టుపల్లితాండ 482,చిల్ముల్ మైలారం 1,198,దుద్యాల 3,643, ఎక్కచెరువుతాండ 538, ఈర్లపల్లి, 638,గౌరారం 1,208, హకింపేట్ 1,708, కుదురుమళ్ళ 2,239, లగచర్ల 1,391, నాజ్‌ఖాన్‌పల్లి 460, పోలేపల్లి 2,190, రోటిబండతాండ 691, సాగారంతాండ 409, సంగాయిపల్లి 624, సంట్రకుంటతాండ 426,సత్తర్ కుంటతాండ 505, వాల్యానాయక్ తాండ 408 మంది ఓటర్లు ఉన్నారు.

# యువత కోసమే ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నాం

- కార్మిక, ఉపాధి శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**బొంరాస్‌పేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** దుద్యాల మండలం హకీంపేట పరిసరాల్లో నూతనంగా నిర్మించే అధునాతన సాంకేతిక కేంద్రానికి బుధవారం రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తిరుపతిరెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో ఏటీసీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 4000 కోట్ల రూపాయలతో ఏటీసీ, ఐటిఐలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు.రూ.7 కోట్ల 20 లక్షల వ్యయంతో హాకీంపేటలో చేపట్టే ఆధునాతన సాంకేతిక కేంద్రం ద్వారా యువత భవిష్యత్తును మార్చే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. భవన నిర్మాణమే కాకుండా అధునాతన యంత్రాల కొనుగోలు కోసం 36 కోట్ల రూపాయలను వెచ్చించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.ముఖ్యంగా గ్రామీణ యువతకు అందుబాటులో ఉండే విధంగా ఏటీసీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. యువత సాంకేతిక రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకుంటూ ఉపాధి పొందాలని మంత్రి పిలుపునిచ్చారు.యువత సాంఘిక రంగాన్ని మంది పుచ్చుకున్నట్లయితే ఉద్యోగాలు పొందడం చాలా సులభం అని మంత్రి అన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యువతను ప్రోత్సహిస్తూ ఏటిసిల్లో చేరే విధంగా చూడాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచి తెలిపారు. భూమి పూజ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జోనల్ మేనేజర్ కవిత, ఏటిసి ప్రిన్సిపల్ కన్వీనర్ నరేంద్రబాబు,ఏటీసీ ప్రిన్సిపల్ శ్యాంసుందర్,తహసిల్దార్ కిషన్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం



**బొంరాస్‌పేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్చి తిరుపతిరెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డితో కలిసి బుధవారం లగచర్ల గేటు సమీపంలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు.అనంతరం గౌరారం,చౌదర్పల్లి గ్రామాలలో మోడల్ అంగన్వాడీ భవనాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్,ఆవుటి శేఖర్,రాంరెడ్డి,వెంకట్ రాములు గౌడ్,అంజిల్ రెడ్డి,మల్లేష్ నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రం లోని లైన్ వాడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన మహా గణనాథు డునీ డీఎస్పీ నల్లపు లింగ య్య దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులకు భద్రతాపరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద తప్పకుండా ఆర్గనైజర్స్ అప్రమత్తంగా ఉండాలనీ, పోలీస్‌లు పాయింట్ బుక్స్ తనిఖీ వచ్చినప్పుడు వారికి సహకరించాలని అన్నారు. అలాగే మండపాల దగ్గర దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. సాయంత్రం వేళ గణేష్‌లను వీక్షించడానికి వచ్చే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, మండపాల దగ్గర వచ్చే మహిళల పట్ల గౌరవంతో ఉండాలని తెలిపారు. గణేష్ విగ్రహాల వద్ద శోభయాత్ర వద్ద డిజెలను నిషేధించడం జరిగిందని ఎవరు పెట్టరాదని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ బాక్స్‌లు బంద్ చేయాలని, చుట్టుపక్కల కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను ప్రజలంతా సంతోషంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నందు నామాజీ,హన్మంతు రావు,శ్రీనివాస్,గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# హామీల అమలులో వైఫల్యం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బిసి కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి



**ఊర్కొండ, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. బుధవారం ఉరుకొండ మండల పరిధిలోని రాచాలపల్లి నుండి మాదారం బీటి రోడ్డు పనుల ప్రారంభానికై పాదయాత్ర చేస్తున్న బిజెపి నాయకులు జనార్ధన్ రెడ్డికి మద్దతుగా ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు బిటి రోడ్డు నిర్మించాలని పాదయాత్ర నిర్వహించుకుంటూ వస్తూ ఉరుకొండ మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని తాహసిల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం తల్లోజు ఆచారి మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితమైన వాగ్దానాలు చేసి గద్దెనెక్కిందని ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కి కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై హామీలు అమలు చేసే వరకు పోరాడుతామని రానున్న స్థానిక ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలోమహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,బిజెపి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్,బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మా రెడ్డి, రాజేశ్వర్ , సాహితీ రెడ్డి,దుర్గాప్రసాద్,నర్సింహా, రాంచంద్రారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పరుశరామ్,ఆంజనేయులు, బ్రహ్మ చారి, బుచ్చయ్య,సందీప్, కొమ్ము శ్రీను,గోపి బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి అవగాహన అవసరం



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి అవగాహన అవసరమని మహిళా సాధికార శాఖ కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా బుధవారం వనపర్తి మండలంలోని అంకూర్ గ్రామంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఆడ పిల్లలను చదివించాలని, ఆడపిల్లల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు అందించే సుకన్య సమృద్ధి యోజన, ముద్ర, పిఎంకెవివై, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో నిరుపేదల రేషన్ కార్డు కళ సహకారం


- కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**మర్పల్లి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** గత పదివేల పాలల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పేదలందరికీ రేషన్ కార్డు కళా సహకారమయిందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పల్లి మండల కేంద్రంలో కొత్తగా రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులకు ఈనెల కోటా సన్న బియ్యం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలు రేషన్ కార్డు లేక చాలా ఇబ్బందులు పడ్డారని అది ప్రజా ప్రభుత్వంలో నెరవేరింది అన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను మన ప్రజా ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, బీసీ కాలనీలో ఉన్న గణనాధునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించార స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాములు యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, తహసిల్దార్ పురుషోత్తం, ఉప్పరి నాగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, పిఎసియస్ వైస్ చైర్మెన్ పసియోద్దీన్, రామేశ్వర్, కలిముద్దీన్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా లోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించబడ్డాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ వనపర్తి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ, ఇప్పటికి రాష్ట్రం అంతటా దాదాపు 13 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు బోల్డంత కష్టాలు పడ్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు రాకపోవడంతో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచి, బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అప్పులు తెచ్చి కాలేజీలు నడపలేమంటూ పరీక్షలకే బహిష్కరిస్తున్నారు. చివరికి మోసపోతున్నది మాత్రం నిరపరాధ విద్యార్థులే అని ఆయన మండిపడ్డారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కాలేజీ చుట్టూ తిరుగుతూ అవమానాలు ఎదుర్కుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చేతులు కట్టుకుని కూర్చుంది. గత ప్రభుత్వం విద్యార్థుల్ని పట్టించుకోలేదు, అందుకే ప్రజలు దించేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్య వైఖరి చూపుతోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటమే అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే రిలీజ్ చేయకపోతే ఏబీవీపీ రాష్ట్రం అంతా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుంది. అవసరమైతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, జిల్లా కేలో భారత్ కన్వీనర్ రమేష్, నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, కళాశాల ప్రెసిడెంట్ శివ, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# యువత ఆదునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**కొడంగల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** యువత ఆదునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం దుద్యాల మండలం హకీంపేట పరిసరాల్లో నూతనంగా నిర్మించే అధునాతన సాంకేతిక కేంద్రానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో ఏటీసీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4000 కోట్ల రూపాయలతో ఏటీసీ, ఐటిఐ లను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. 7 కోట్ల 20 లక్షల వ్యయంతో హాకీంపేటలో చేపట్టే ఆధునాతన సాంకేతిక కేంద్రం ద్వారా యువత భవిష్యత్తును మార్చే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. భవన నిర్మాణమే కాకుండా అధునాతన యంత్రాల కొనుగోలు కోసం 36 కోట్ల రూపాయలను వెచ్చించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ యువతకు అందుబాటులో ఉండే విధంగా ఏటీసీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. యువత సాంకేతిక రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకుంటూ ఉపాధి పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. యువత సాంఘిక రంగాన్ని మంది పుచ్చుకున్నట్లయితే ఉద్యోగాలు పొందడం చాలా సులభం అని మంత్రి అన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యువతను ప్రోత్సహిస్తూ ఏటిసిల్లో చేరే విధంగా చూడాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచి తెలిపారు. భూమి పూజ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జోనల్ మేనేజర్ కవిత, ఏటిసి ప్రిన్సిపల్ కన్వీనర్ నరేంద్రబాబు, ఏటీసీ ప్రిన్సిపల్ శ్యాంసుందర్ , కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, తహసిల్దార్ కిషన్ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుబేర రెస్టారెంట్‌ను ప్రారంభించిన టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి




**సదాశివపేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** పట్టణ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కుబేర ఫ్యామిలీ రెస్టారెంట్ ను బుధవారం తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలికల సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో కొత్తగా ప్రారంభమైన కుబేర రెస్టారెంట్ స్థానిక ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రెస్టారెంట్ వ్యాపారం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం రెస్టారెంట్ నిర్వాహకులు నిర్మలా జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, హెూటల్ యజమానులు మఠం శ్రీశైలం స్వామి,గౌండ్ల రాజు గౌడ్, సూరారం పవన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మిద్దె రాములు



**బిజినేపల్లి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల రాజేష్ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మిద్దె రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా సరిగ్గా ప్రభుత్వం ఇవ్వడం లేదని జిల్లా కేంద్రంలో మంగళవారం నాడు ధర్నా చేపట్టారు అట్టి ధర్నాలు యూరియాకు సంబంధించిన అంశమే మాట్లాడాలని కానీ అది మాట్లాడకుండా నాగర్కర్నూల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అధికారం కోల్పోయామని అక్కస్సుతో మతిభ్రమించి వ్యక్తిగత విమర్శలు దూషణలు చేయడం సరికాదన్నారు. మీరు పది సంవత్సరాలు నియోజకవర్గాన్ని పాలించిన నాడు మీరు చేసిన పనులు, మీరు చేసిన రాజకీయం మీ వెంబడి ఉన్న నాయకుల కోసం తప్ప ప్రజల కోసం కాదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం అర్హులైన పేదలకు నేరుగా అందుతున్నాయి అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, రేషన్ కార్డ్, రైతు రుణమాఫీ, పెంచిన పెన్షన్, 500కి గ్యాస్ సిలిండర్ అన్నిటిని ప్రజలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కానీ మీరు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పేద ప్రజలు ఏమన్నా సమస్యల గురించి అడిగితే వారి పైన అక్రమ కేసులు బనాయించి లోపల పెట్టించిన ఘనత మీకే దక్కిందన్నారు. దొంగలు దొంగలు ఏకమై నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మావేషమై 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఒకరిని కూడా విమర్శించని మా నాయకులను అసభ్య పదజాలాలతో మీరు మాట్లాడడం సమంజసం కాదన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకున్ని నీవు మాట్లాడే భాష మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి దైవంతో సమానం అని అన్నారు. కానీ జక్క రఘునందన్ రెడ్డి నీకు ఏమవుతాడో నీవు తెలుసుకోవాలన్నారు. నీవు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ప్రజలు సమస్యల పైన నీ దగ్గరకు వస్తే జక్కా రఘునందన్ రెడ్డి తోనికి పొమ్మనలేదా అని ఆయనను ప్రశ్నించారు. మా ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా ఈరోజు వరకు ఎవరిని కూడా విమర్శించలేదు ఎందుకంటే చదువుకున్న వ్యక్తి కాబట్టి ప్రభుత్వ వైఫల్యాలు ఏమన్నా ఉంటే ప్రజలలోకి తీసుకొని రావాలి కానీ మీరు మాట్లాడే భాషా విధానాన్ని మార్చుకోవాలన్నారు. మరోసారి వ్యక్తిగత విమర్శలు పునరావృత్తం అయితే రాబోయే పరిమాణాలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరించారు. మీరు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, నల్ల మట్టి మాఫియా, ఎర్ర మట్టి దండుకొని పైకి వచ్చి మీరు మా నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మీరు రాజకీయంలోకి రాకముందు వ్యాపారం చేసుకుంటూ రాజకీయాల్లోకి వచ్చారు కానీ రాజకీయం అంటే ఏమిటో మీనింగ్ తెలియదు నీకు అసభ్యకరమైన మాటలు మాట్లాడే ముందు నీ వీపును నీవు చూసుకొని మాట్లాడాలన్నారు. మీరు రాజకీయాలకు వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ రాజకీయ చరిత్ర తెలియని ఈనస్థితిలో నీవు ఉన్నావంటే ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన ఏ విధంగా పోరాటం చేస్తారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి లేకుంటే ఎమ్మెల్యేగా గెలుపొందే అవకాశం నీకు లేకుండేదని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎన్నోసార్లు ఓడిపోయిన ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ప్రజాసేవలో కొనసాగుతున్నటువంటి వ్యక్తిని విమర్శించడం తగదని తక్షణమే క్షమాపణ కోరాలని వారన్నారు. మీరు రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినప్పుడు ఏ విధంగా మాట్లాడాలో తెలియని స్థితి నీది అలాంటిది మా ఎమ్మెల్యే కు మాట్లాడడం రాదని ఏ విధంగా అన్నావో చెప్పాలన్నారు. మీరు రాజకీయం చేయండి అభివృద్ధికి అడ్డుపడకండి అని ఎన్నో మాటలు చెప్పారు మీరు కానీ ఇప్పుడు మీరు చేస్తున్నది ఏమిటి అని ప్రశ్నించారు. ఒక సంస్కారమైన కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యేను సంస్కార ఈనుడైన అవివేకుడైన మర్రి మాట్లాడిన మాటలను చూస్తూ ఉంటే ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త రక్తం చమచమా ఉడుకుతుంది ఎందుకంటే ఆయనలాగా కొఠారి పెట్టుకుని పల్లెల్లో రైతులను ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన దాఖలాలు మా నాయకుల దగ్గర లేవని అన్నారు. మీరు మాట్లాడిన మాటలను వెనకకు తీసుకొని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కే తిరుపతయ్య, రామ్ చందర్, అమృత్ రెడ్డి, జీ తిరుపతయ్య, వెంకట్ స్వామి, నజీర్, పర్వతాలు, మాన్య నాయక్, పాషా, పరుశరాములు, సైదులు, ముక్తార్, ఎద్దుల రాముడు, రామ్ చందర్ నాయక్, ఖలీల్, బాలరాజ్, తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య తెలంగాణగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా అభివృద్ధి చేస్తామని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 79 మంది లబ్ధిదారులకు 38 లక్షల రూపాయల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ ను చిన్నాభిన్నం చేసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొన్ని నెలలుగా ఎంతో క్రమశిక్షణ తోటి ఆర్థిక వ్యవస్థ ను గాడిలో పెట్టేందుకు కృషి చేసినందుకే పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ఏర్పుల నాగరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, చిన్న, మోసిన్, నాయకులు డీలర్ రఘు, కిషన్ నాయక్, అక్బర్ , వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి దిగుమతిపై ట్యాక్స్ రద్దు దారుణం

- ఏఐయుకేఎస్ మక్తల్ డివిజన్ కార్యదర్శి ఆనంద్



**కృష్ణ, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** పత్తి దిగుమతిపై ట్యాక్స్ 11 శాతం రద్దు చేయడం దారుణమని ఎఐకేఎంఎస్ మక్తల్ డివిజన్ కార్యదర్శి ఆనంద్ అన్నారు. బుధవారం సంయుక్తా కిసాన్ మోర్చా(ఎస్ కే యం) పిలుపులో భాగంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కృష్ణ మండల తహసిల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతిపై ఉన్న 11శాతం వన్నును రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ , భారత వాణిజ్య విధాన రూపకల్పన సందర్భంలో ఆగస్టు 7న భార త రైతుల ప్రయోజనాలపై రాజీ పడబోమని ప్రధానమంత్రి ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో ఎర్రకోట నుండి రైతులు, పశుపెంపకందార్లు, మత్స్యకారుల రక్షణకోసం “గట్టిగోడగా నిలుస్తామని” ప్రకటించారు కానీ ట్యాక్స్ రద్దు చేయడం మోసం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్,కరకు బసవరాజ్, రాజు, జ్ఞానప్ప, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని మానుకోండి

**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం పై కాంగ్రెస్ విషప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి మీరు పాలమూరు బిడ్డ అయితే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయండి. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలోబిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పైనిరసనగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపడం జరిగింది. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వనపర్తి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగట్టడం జరిగింది.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాక్టుపై ఘోష్ కమిషన్ వేసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నిరసిస్తూ బి.ఆర్.ఎస్ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమము చేపట్టింది.ఇట్టి నిరసన కార్యక్రమములో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు కట్టకుండా తెలంగాణకు కాంగ్రెస్, టి.డి.పి పార్టీలు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. తెలంగాణ సాధించిన కె.సి.ఆర్ కృష్ణా నదిపై పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మించి 12లక్షల ఎకరాలకు సాగు నీరు అదేవిధంగా గోదావరి నదిపై రికార్డ్ స్థాయిలో 3 ఏండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి 70లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తెలంగాణను సస్యశామలం చేశారని అటువంటి మహానాయకునిపై 94వేల 300కోట్లు ఖర్చు చేస్తే లక్ష కోట్లు దోచుకున్నారని, కేంద్ర జలవనరుల ఇంజనీర్స్ కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించి కె.సి.ఆర్అద్భుతం సృష్టించారని కితాబు ఇచ్చిన విషయాని రేవంత్ మరవొద్దని హితవు పలికారు.అన్ని శాఖల అనుమతులు తీసుకొని ప్రాజెక్ట్ పూర్తి చేసిన కె.సి.ఆర్ సమర్ధతను తట్టుకోలేక ఆరోపణలు చేస్తున్నారని తన గురువు చంద్రబాబు మెప్పు కోసమే కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రములో ఒకవైపు యూరియా కొరత,వరదలతో బాధపడుతుంటే రేవంత్ పట్టించుకోకుండా,కె.సి.ఆర్‌పై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాబోవు స్థానిక సంస్థల



ఎన్నికల్లో ప్రజలు కె.సి.ఆర్ గారికి అండగా నిలిచి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు మండల నాయకులు పృథ్వీరాజు తాజా మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డ మార్కెట్ మాజీ డైరెక్టర్ జలీల్,శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- ఎమ్మెల్యే సంగారెడ్డి చింతా ప్రభాకర్




**సంగారెడ్డి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** సంగారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. 20 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ప్రజలు ,రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు 40 శాంతం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న ప్రకారం, ఎమ్మెల్యే ద్వారా పంపిన లబ్ధిదారుల ప్రతిపాదనలకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి సూచించిన ఎండర్స్ మెంట్ లేఖను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపాలిటీలలో టియుఎఫ్ఐడిసి కింద మంజూరు అయినా పనులు వేగవంతంగా చేపట్టుటకు కోరినారు. జనాభ దృష్టిలో ఉంచెకొని నూతన ఫెయిర్ ప్రైస్ షాపుల ఏర్పాటుకు ప్రతిపదించారు. కంది మండలం బేగంపేట గ్రామంలో ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సర్వేనెంబర్ 249 నుండి 1000 గజాలు కేటాయించుటకు ప్రతిపాదనలు అందజేసినారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, అక్బర్ తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా



**నంగునూరు, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** నంగునూరు మండలంకి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని బుధవారం రోజు ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడీవో వినతిపత్రం అందించారు. అనంతరం నంగునూరు మండలం గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు దేవులపల్లి రాజమౌళి మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు లేక పస్తులుండే కాలం వచ్చింది ప్రభుత్వం వెంబడే కార్మికుల ఆవేదన తెలుసుకొని వారికి రావలసిన రెండు మూడు నెలల జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య గారు మాట్లాడుతూ 51 జీవో నీ సవరిస్తూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తూ 60 జీవోను అమలు చేయాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ ఎస్ ఐ పి ఎఫ్ ను వర్తింపజేసేలా ప్రభుత్వ ఉద్యోగులాగా ప్రతి నెల గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు ఒకటో తారీకు నాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జీడి కంటి కనకవ్వ బిల్లం బాలయ్య దేవులపల్లి రేణుక రామస్వామి బెల్లం శీను తదితరులు పాల్గొన్నారు.

## ఖేడ్ పర్యాటక అభివృద్ధి కోసం కృషి

- ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, సెప్బెంబర్ 3 (జనం సాక్షి) :** నల్లవాగు మధ్యతర ప్రాజెక్టు, బోరంచ, కమలాపూర్ పర్యాటక అభివృద్ధిపై కల్లేరు తాసిల్దార్ కార్యాలయంలో టూరిజం డెవెలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇక్కడి ప్రాంతానికి టూరిజం బోరంచ కమలాపూర్ నల్లవాగు మధ్యతర ప్రాజెక్టు ఇక్కడి ప్రాంతంలో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, ఇక్కడి ప్రశాంత వాతావరణం, టూరిజం డెవలప్మెంట్ కావలసిన అన్ని సదుపాయాలు ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్నాయని కావున వీటిని తప్పకుండా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రాజెక్టు వద్ద చేపట్టవలసిన ప్రదేశాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ వై ఆర్ కె రాజు కన్సల్టేషన్ ప్రవీణ్ డి ఈ నటరాజు లు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ..

నిజాంపేట మండలం జంబికుంట, కల్లేరు మండల కేంద్రంలో, సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామంలో కొత్త రేషన్ కార్డులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమాయక ప్రజల బలహీనతే సైబర్ నేరాగాళ్ల బలం

- సైబర్ నేరాలపై అవగాహన ఒక్కటే మార్గం
- సైబర్ మోసాలపై ఎల్లేంకి డిగ్రీ కళాశాల
- విద్యార్థులకు అవగాహన
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** అమాయక ప్రజల బాలహీనతే సైబర్ నేరాగాళ్ల బలంగా మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. సైబర్ జాగ్రుకత దివాస్ జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికాగోయల్ ఆదేశాలనుసారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎల్లేంకి డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ నెల మొదటి బుధవారాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివాస్ పేరుతో వివిధ రకాల ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యంగా ఆర్.టి.ఎ. చలాన స్కామ్స్, ఫేక్ ప్రొఫైల్ ఫేక్ స్కామ్స్, కస్టమర్ సర్వీస్ (ఆన్లైన్ బుకింగ్స్) స్కామ్స్, డిజిటల్ ప్రపంచంలో మీకు మీరే రక్షకులు.. అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. సైబర్




నేరాలు అనేవి ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు ఎదురుకుంటున్న సమస్య సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ముఖ్యం అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దన్నారు. సైబర్ నేరాలకు గురిఅవుతున్న వారిలో విధ్యావంతులే అధికంమని, మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహ కలిగి ఉండాలన్నారు. మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. ఆర్.టి.ఎ. చలాన స్కామ్స్ వాహనంపై ఆర్.టి.ఎ. ఈ చలాన ఉందని, దానిని క్లియర్ చేయడానికి ఏపీకే ఫైల్ ఓపెన్ చేయాలని సూచిస్తారాని, ఏపీకే ఫైల్ ఓపెన్ చేసిన వెంటనే మన ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం సైబర్ మోసాగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుందని, తద్వారా ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని అన్నారు. ఫేక్ ప్రొఫైల్ ఫేక్ స్కామ్స్.. ఫేక్ ప్రొఫైల్ తో పోలీసు అధికారులం అని, కస్టమ్స్ అధికారులమని గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుండి, కాల్స్, వీడియో కాల్స్ వస్తే నమ్మరాదన్నారు. ఏ పోలీసు అధికారి ఎంక్వైరీ పేరుతో నేరుగా వాట్స్ ఆప్ వీడియో కాల్స్ చేయరాని, డిజిటల్ అరెస్ట్ అని కాల్స్ వస్తే నమ్మరాదని అన్నారు. అనుమానిత ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ వస్తే సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ నందు రిపోర్ట్ చేయాలని సూచించారు. కస్టమర్ సర్వీస్ స్కామ్స్ (ఆన్లైన్ బుకింగ్స్).. ఆన్లైన్ షాపింగ్ లో భాగంగా వివిధ రకాల సైట్లలో కస్టమర్ కేర్ నెంబర్ల కోసం సర్చ్ చేసిన వెంటనే సైబర్ మోసగాళ్ళు గుర్తించి, తప్పుడు ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ చేసి ఆన్లైన్ లో ఎంక్వయిరీ చేశారని మోసగించి సైబర్ నేరాలకు పాల్పడతారని, అమాయక ప్రజల బాలహీనతే, సైబర్ నేరాగాళ్ల బలంగా వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో టెక్నాలజీని వాడుకొని మరిన్ని సైబర్ మోసాలు చేయడానికి అవకాశం ఉందని, సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ నేరాల నుండి బయటపడవచ్చని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలోపు 1930కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి. (https://www.cybercrime.gov.in) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి టౌన్ ఎస్ఐ సర్ధార్, ఎల్లేంకి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ రెడ్డి డి 4సి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ

- సమస్యలపై ఆరా
- పరిష్కారానికి కృషి చేస్తానని హామీ




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో కలియ తిరుగుతూ విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను వివరించి చెప్పారు. గత పదేళ్ల కింద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని, కొత్త ఆర్వో ప్లాంట్ కావాలని, వేడి నీటి కొరకు గ్లీజర్లు ఏర్పాటు చేయాలని, మూడు నెలల నుండి కాస్మోటిక్ సామాగ్రి ఇవ్వడం లేదని, డిజిటల్ క్లాస్ రూమ్స్ కావాలని, క్రీడా సామాగ్రి, దోమలు రాకుండా కిటికీలకు మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు కూడా సరిగా తిరగడం లేదని ఎమ్మెల్యేకు విద్యార్థులు వివరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే ఏటూరునాగారం ఐటిడిఏ పీఓకు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. సమస్యలను వీలైనంత త్వరగా ఎస్టిమేట్స్ వేసి పనులను ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని కోరారు. విద్యార్థినుల వసతి గృహాన్ని పక్కనున్న భవనంలోకి మార్చాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు గుర్తుచేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# సకల సౌకర్యాలతో మహా మేడారం జాతర

- జాతర సమయానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం
- మేడారం మాస్టర్ ప్లాన్ అమలు - భక్తుల సౌలభ్యం ప్రధాన లక్ష్యం
- సమ్మక్క సారలమ్మల త్యాగ ఔన్నత్యానికి తగిన వేడుకగా మహా జాతర
- మేడారం మహా జాతర ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్ సమీక్షలో మంత్రి సీతక్క



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి) : సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మేడారం మహా జాతర నిర్వహణ, ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయార్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఇతర ఉన్నతాధికారులు, పలు విభాగాల ఇంజనీర్లు హాజరయ్యారు. సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణం నూతన డిజైన్‌ను మంత్రులు పరిశీలించారు. డిజైన్‌లో అవసరమైన మార్పులపై చర్చించి, తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేయాలని, మహా జాతర ప్రారంభానికి ముందుగానే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పూజారుల అభిప్రాయం మేరకు ఆధునికరణ పనులు చేపట్టాలని సూచించిన ఆమె, భక్తుల దర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో అమర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులు సౌకర్యంగా దర్శించుకునేలా గద్దెల ఎత్తును పెంచాలన్న పూజారుల అభ్యర్థనను కూడా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాలని సూచించిన మంత్రి సీతక్క, జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించనున్నట్లు ప్రకటించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మేడారం పరిసరాలను తీర్చిదిద్దుతున్నామని, మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా జాతరకు 150 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో అదనపు నిధులు కూడా కేటాయిస్తామని తెలిపారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను ముఖ్యమంత్రికి నివేదించి, వారి ఆమోదం తర్వాత పనులు వేగవంతం చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ముందుకు వెళ్తామని, మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారులను భాగస్వామ్యం చేస్తామని స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మేడారం ఆలయం తో పాటు, ఆ పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను అలంకరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా భక్తులందరికీ సౌకర్యవంతమైన వాతావరణంలో మహా మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రులు స్పష్టం చేశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



మంగపేట, సెప్టెంబర్ 03 (జనంసాక్షి) : మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. వార్షిక తనిఖీ నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్. ముందుగా ఎస్పి శబరిష్ కు ఏటూరునాగారం ఏఎస్పి డా.శివం ఉపాధ్యాయ, సర్కిల్ ఇన్స్పెక్టర్ అనుముల శ్రీనివాస్, స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై టివిఆర్ సూరి లు స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ సిబ్బంది జిల్లా ఎస్పీ శబరీష్‌కు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ శబరిష్ పోలీస్ స్టేషన్ పరిసరాలను వాటి పరిశుభ్రతను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ సెంటర్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి రిసెప్షన్ సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ అధికారిని నియమించి విచారణ అనంతరం ఆలస్యం చేయకుండా కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే (5ఎస్) విధానం అమలు చేస్తున్నారా లేదా అని అడిగి స్టేషన్ మొత్తం కలియతిరిగి గదులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ప్రతి వర్టికల్ కు ఒక అధికారిని కేటాయించి ఎప్పటికప్పుడు రికార్డులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విచారణలో ఉన్న కేసులను పరిశీలించి ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్ కలిగి ఉండాలని సూచించారు. మిస్సింగ్ కేసుపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి చేదన చేయాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్ కార్యాలయంలో కంప్యూటర్ సిబ్బంది పనితీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తూ అధికారులు మరియు సిబ్బంది కూడా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అలాగే సైబర్ మోసగాళ్ల ప్రజలు పడకుండా, గేమింగ్ బెట్టింగ్ అప్లికేషన్ వాటి ద్వారా జరిగే మోసాలను వివరించాలని యాక్సిడెంట్, తదితర కేసులలో స్వాధీన పరుచుకున్న వాహనాలను పరిశీలించి ఆ వాహనాల యజమానులకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సిబ్బంది వారి విధులను ఒక్కొక్కరిని విడివిడిగా పనితనాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఏటూరునాగారం ఏఎస్పి డా. శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ అనుముల శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ శంకర్, స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయ హౌస్ ఆఫీసర్ ఎస్సై టివిఆర్ సూరి, ఇతర అధికారులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

- కార్యదర్శి వెంకట స్వామిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో ఏసిబి అధికారులు లంచగొండి అధికారులపై కొరడా ఝుళిపించిన ఘటన మరువక ముందే మరో అవినీతి తిమింగలం ఏసీబీ దాడిలో పట్టుబడింది. హెల్త్ డిపార్ట్మెంట్, లేబర్ డిపార్ట్మెంట్లో అధికారులు లంచాలు తీసుకొని పట్టుబడి రెండు నెలలు గడవకముందే మంచిర్యాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శి 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడడం సర్వత్ర చర్చనీయంగా మారింది. లంచగొండి అధికారులపై ఏసీబీ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు కొనసాగిస్తున్నప్పటికీ కొంతమంది లంచగొండి అధికారుల తీరు తెన్నుల్లో మార్పు రావడం లేదు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటస్వామి , ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులైన డి.నాగమణి ఇల్లు నిర్మాణానికి సంబంధించిన 1,5 లక్షల బిల్లు మంజూరు చేయాలంటే పంచాయతీ కార్యదర్శి 20 వేలు లంచం డిమాండ్ చేయడంతో చేసేది ఏమీ లేక బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నేరుగా లబ్ధిదారుల ఇంటికి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి వచ్చి 20 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా అక్కడే మాట వేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎసిబి డిఎస్పి మధు టీం నిందితున్ని పట్టుకున్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు కెమికల్ తో కూడిన నోట్లను బాధితునికి ఇచ్చి పంపగా పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి బాధితురాలి ఇంటికి వచ్చి డబ్బులు తీసుకుంటుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకటస్వామిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు.

# పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దు

- రోడ్లు వెంటనే పునరుద్ధరిస్తాం
- కవిత సస్పెండ్ ఒక బూటకం
- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



ఖానాపూర్ సెప్టెంబర్ 03 (జనం సాక్షి) : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలలో 3249 మంది రైతులు 3661 ఎకరాలలో పంట నష్టపోయారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెంబి మండలంలో నది పరివాహక ప్రాంతంలో ఏకంగా 700 ఎకరాలు పత్తి పంట కు నష్టం వాటిల్లిందని అన్నారు. పంచాయతీ రాజ్ పరిధిలో 13 కిలోమీటర్ల రోడ్డు, ఆర్ %ఒ% బి పరిధిలో 10 కి.మీ. మేర రోడ్డు చెడిపోయిందని దాన్ని తాత్కాలిక పరమ్మత్తులు వెంటనే చేపడతామని పేర్కొన్నారు. రెండు రోజుల్లో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కాళేశ్వరం పై ప్రజలకు తెలియాలనే ప్రభుత్వం అసెంబ్లీలో చర్చ పెట్టిందని పిసి ఘోష్ కమిటీ వేసింది కూడా ప్రజలకు తెలిసేందుకేనని ఎమ్మెల్యే వివరించారు. కాళేశ్వరంలో స్వయంగా కేసీఆర్ కూతురే అవినీతి జరిగిందని ఆరోపిస్తుంటే బిఆర్ఎస్ శ్రేణులు మతిస్థిమితం లేని మాటలు మాట్లాడు తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల్లో చర్చ జరగాలని దురుద్దేశంతోనే కేసీఆర్ ప్రణాళిక బద్ధంగా తన కూతురు ఎమ్మెల్సీ కవితను బి ఆర్ ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం ఒక బూటకం అని అన్నారు. కేంద్రం పరిధిలో ఉండే సిబిఐ కి కాళేశ్వరం కేసు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పడంతో బిజెపి ముందు ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలని అలాగే కేసీఆర్ కుటుంబం కాళేశ్వరం ప్రాజెక్టులో అడ్డదారికి తవిస్తూ పోగు చేసిన డబ్బంతా కక్కిస్తారని ఆశిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్, సత్తనపల్లి పిఎసిఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ శాఖ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ లు అంకం రాజేందర్, రాజుర సత్యం, నాయకులు శంకర్, గంగా నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన, ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... పల్లె దవాఖాన కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రహదారి నుండి ఆసుపత్రికి వచ్చే అటాచ్ రోడ్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు చేయాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వాడండి

- భూసారాన్ని కాపాడండి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద



వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 3(జనంసాక్షి): ఉద్యాన పంటల్లో నానో యూరియా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం గీసుగొండ మండలంలో డ్రోన్ ద్వారా తిమ్మాపురం శ్రీకాంత్ వరకాయ తోటలో (నానోయూరియా ) పచికారీ చేయించడం జరిగింది. క్షేత్ర ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గోని రైతులకు ఉద్యాన పంటల్లో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, తీగ జాతి కూరగాయలైన సోర్ట్, బీర్ కాండోర్, దొండ, దోస, పొట్ల, బోడకాకర్ తదితర పంటల్లో ఈదశలో నేలపై మొత్తం పరుచుకొని ఉండడం వల్ల డ్రోన్ సాయంతో నానోయూరియా స్ప్రే చేయడం వల్ల నత్రజని వినియోగ సామర్థ్యం పెరిగి మొక్క ఎదుగుదల జరిగి అధిక దిగుబడులు పొందవచ్చని, దీనికి బదులుగా "ఘన రూపంలో ఉన్న యూరియా బస్తాలు వాడితే మొక్కకు సరిగా అందక ఎక్కువగా పృథా అవుతుందని అన్నారు. తీగజాతి కూరగాయల సాగులో పందిళ్ళ పైన పోషకాలు పురుగు మందుల పిచికారీ చేయడం, సాధారాణ స్ప్రేయర్స్ తో కష్టంతో కూడిన పనియని, అదే డ్రోన్ ద్వారా సులభంగా ఎకర విస్తీర్ణంనకు 10 నిమిషాల్లో పిచికారి చేయచ్చునని అన్నారు. అరటి, బొప్పాయి, మొనగ లాంటి ఎక్కువ ఎత్తి పెరిగే ఉద్యాన పంటల్లో డ్రోన్ ద్వారా పోషకారమైన నానో యూరియా పిచికారి చేసుకోవచ్చునని అన్నారు . నానో యూరియా అనేది నత్రజనిని మొక్కలకు మరింత సమర్థవంతంగా అందించే అంజనే ద్రవ ఎరువని, దీన్ని సమర్థవంతంగా పంటల చురుకైన పెరుగుదల దశలో లీటర్ మీటర్ నీటికి 2-4మి.లీ. చొప్పున కలిపి ఆకులపై పాచికారి చేయాలి. నానో యూరియా చిన్న కణాల రూపంలో ఉడటం వల్ల మొక్కలు వేగంగా, సులభంగా గ్రహిస్తాయని, మొక్కలు బాగా ఎదిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని,. ఇంతే కాకుండా వాము, భూ కాలుష్యం పర్యావరణానికి ఎటువంటి నష్టం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నానో యూరియా వాడిన రైతులు మిగిలిన రైతులతో వారి అనుభవాలను పంచుకొని ఉద్యాన పంటల సాగులో పెద్దఎత్తున నానోయూరియా వాడకాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఉద్యాన అధికారి తిరుపతి, ఎంఈఓ హరిప్రసాద్, హెచ్ఈఓ వేణు, ఏఈఓ రజని, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై లంబాడీలు కన్నెర్ర చేయాలి

- లంబాడీలపై సుప్రీంకోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి
- లంబాడీలను కాపాడుకున్నది కేసీఆరే
- మాజీ మంత్రి దయాకర్ రావు



పాలకుర్తి, సెప్టెంబర్ 03(జనంసాక్షి) : లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని కాంగ్రెస్ నేతలు కుట్ర పన్నుతున్నారని, ఆ పార్టీపై లంబాడీలు కన్నెర్ర చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తీజ్ పండుగ ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్ రావు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోయం బాబూరావు, తెల్లం వెంకట్రావులపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని డిమాండ్ చేశారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడిన కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి కేసీఆర్ సస్పెండ్ చేశారని అన్నారు. లంబాడీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలపై వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లిన ఇద్దరు ఎమ్మెల్యేలను ఎందుకు నస్పెండ్ చేస్తలేరని సీఎం రేవంత్రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని తెచ్చుకున్న తర్వాత కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చిన రైతుల గోస పడుతున్న పరిస్థితి ఉంటుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే యూరియా కొరత తప్పకుంట ఉంటుందని విమర్శించారు. ఏ కష్టం వచ్చినా ప్రతి కార్యకర్తలను బీఆర్ఎస్ ప్రభుత్వంమేనని, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అక్రమ కేసులు పెట్టి ఇబ్బందికి గురిచేస్తే పోలీస్ స్టేషన్లోనే కూర్చుంటానని అన్నారు. ఏ కష్టం వచ్చినా ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జరుపుల బాలూ నాయక్, పల్లా సుంద రాంరెడ్డి, పాకనాటి సునీల్ రెడ్డి, పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్,గాంధీ నాయక్, మహేందర్ నాయక్, పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, నర్సింహనాయక్, రాంసింగ్, నాగరాజు, సురేష్, రాజేష్, కేలోతు సత్తమ్మ, నాగిరెడ్డి, శ్రీనివాస్ రావు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
04 సెప్టెంబర్ 2025

## ఇందిరా మహిళా శక్తి మిషన్ - 2025ను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**భువనగిరి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి మిషన్-2025' పథకం ద్వారా స్వయం సహాయక బృందాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీఎంఈజీపీ పథకంతో సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పట్టణ ప్రాంతాల్లో మెప్మా వేర్వేరుగా ఉండేవి. ఈ పథకం కింద ఈ రెండు సంస్థల మహిళా సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, పథకాలను సమానంగా అందిస్తారు. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గల ఎమ్మార్వో ఆఫీస్ నందు అయితే ఈ రోజు మన భువనగిరి లో లబ్ధి పొందిన వారు ఉడుగుల దివ్య మరియు కె.సౌమ్య నిర్వహించనున్న సీఎస్‌సీ సెంటర్ ప్రారంభించడం జరిగింది. ఈ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా మహిళా సాధికారిక మరియు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం కింద సబ్సిడీ రుణాలు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి అనే ఈ బృహత్తర కార్యక్రమంలో తెలంగాణలోని అన్ని పట్టణ ప్రాంతాలలో గల మహిళలు ఆర్థిక స్వాలంబనను సాధించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని కొనియాడారు. మహిళ లేనిదే మనుగడ లేదని తెలంగాణ మహిళలు . మహిళలు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యాపార లావాదేవీలు ఉన్నప్పుడు అగ్రస్థానంలో నిలవాలని తమ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బోనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పీఎంఈజీపీ ప్రోగ్రాం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళ శక్తి కార్యక్రమం ద్వారా మరింత ఆర్థిక ప్రగతిని పెంపొందించుకోవాలని తెలియజేశారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార విస్తరణను విస్తరించుకోవడానికి మెలకువలు నేర్చుకోవాలనీ సూచించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మన జిల్లాలో చాలామంది మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక పురోగతి లభిస్తుందని అన్నారు. నిరుపేదలుగా ఉన్నటువంటి మహిళలు ఆర్థికంగా బలపేతం కావాలని కోరారుఅందులో భాగంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనీ మహిళలు కుటుంబానికి ఆర్థిక భరోసా అంది ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, స్థానిక ఎమ్మార్వో, డిఆర్‌డిఓ, బోనగిరి మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, ఏడిఎంసి మెప్మా టీం, ఆర్‌పిలు తదితర విభాగాల మరియు మహిళలు పాల్గొన్నారు.

## పండుగలా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు





**చంద్రుగొండ, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ఎప్పుడు ఎప్పుడు అని ఊరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన చంద్రుగొండ మండలం బెండలపాడు దామరచర్ల లో జరిగిన సభకు వచ్చిన వేలాదిమంది కి సీఎం రేవంత్ రెడ్డి స్పీచ్‌తో దద్దరిల్లింది. తొలుత బెండలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం సేవించి వారితో మాట్లాడి వారి అనుభవాలు తెలుసుకొని అక్కడే పైలాను ప్రారంభించి దామరచర్లలో ఏర్పాటుచేసిన వేలాది మంది హాజరైన బహిరంగ సభలో ఉత్సాహంగా ఆనందంతో ప్రజల అభిమానుల ఈలలు చప్పట్లు మధ్య ఆద్యంతం 21 నిమిషాల పాటు ఆయన బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరుగుతూ కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయల కోసం వాటాల కోసం కోట్లాటకు దిగారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పని పట్టాలంటే సరైన మంత్రి కోసం పట్టుబట్టి అధిష్టానంతో ఒప్పించి ఉమ్మడి ఖమ్మం జిల్లా అంటే పొంగులేటి జిల్లా అనే విధంగా అభిమానాన్ని చాటుకున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ గృహ నిర్మాణాల శాఖ మంత్రిగా తానే అప్ప చెప్పానని తెలిపారు. తాను పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వడివడిగా రాష్ట్రంలో రెండు లక్షల 90 వేల ఇళ్లను నిర్మాణంలో వేగాన్ని చేపట్టి ప్రజల అభిమానాన్ని చోరకొన్న నాయకుడని పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని కొనియాడారు. ఇక మీ ఎమ్మెల్యే జారి ఆదినారాయణ అందరికీ 3500 ఇస్తే తనకు మరో వెయ్యి ఇల్లు కావాలని పట్టుబట్టి మంజూరు చేయించుకొని రాష్ట్రంలోనే వడివడిగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి నేడు తన రాకకు కారకుడయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ మంత్రి వాకిటి శ్రీనివాస్, ఎంపీలు పొరికె బలరాం, రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వారం కనకయ్య,రాగమయి రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోనంనేని సాంబశివరావు రాష్ట్ర జిల్లా యంత్రాంగం నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పైకప్పు మర్మతులను చేయించాలి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ఇటీవల భారీ వర్షాల దృశ్య ఆయా గ్రామాలలో జ్వరం సర్వే నిర్వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సాయి సింధుకు జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. బుధవారం ఆకస్మికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. భారీ వర్షాలకు గాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పైకప్పు నుండి నీరు కాడడంతో దాన్ని మరమ్మతులు చేయించాలని సూచించారు. అదే విధంగా గ్రామాలలో జ్వరం సర్వే కొనసాగించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సహకారంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రోగ్రాం అధికారి రవిప్రసాద్, సిహెచ్ఓ యాదగిరిరావు,సిబ్బంది హారిక,సూపర్వైజరు బుజ్జి,ల్యాబ్ టెక్నీషియన్ నర్సిములు,నర్సింగ్ ఆఫీసర్ అనిత,ఫార్మసిస్ట్ రవి, ఏఎన్ఎం రజిత, అటెండర్ కొమురయ్య పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఎదుట బారులు తీరుతున్న రైతులు



**నిడమనూర్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** మండలంలో యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర యూరియా సరిపోవడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యూరియా లోడ్ వచ్చిందని తెలియగానే సహకార సంఘాల, ప్రైవేట్ దుకాణాలు ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి వేచి చూసి వారు ఇచ్చే ఒకటి రెండు బస్తాలు తీసుకొని అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. వరినాట్లేసి నెలలు గడుస్తున్న యూరియా లేక పైరు బలహీనపడి ఎదుగుదల తగ్గడంతో యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచే గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి సొసైటీ, ప్రైవేట్ ఎరువుల దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బుధవారం లోడ్ వస్తుందని సమాచారం తెలియగానే పలు గ్రామాల నుండి రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రైతుల ఒత్తిడి తగ్గించుకునేందుకు అధికారులు మాత్రం కొత్త మార్గాన్ని ఏర్పాటు చేశారు. గడువు విధించి రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్ ఉన్నవారికి మాత్రమే ఈరోజు ఎరువులు ఇస్తామని అధికారులు తేల్చి చెప్పడంతో టోకెన్లు లేని రైతులు ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులుగాసి హుసురుమంటూ అంటూ వెనుదిరిగారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు యూరియా విరివిగా అందించి అన్నదాతను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- రోడ్డుపై ధర్నా రాకపోకలు బంద్
- వారం రోజుల నుంచి యూరియాకోసం ఎరువుల దుకాణాలు కాడ పడిగాపులు



**మహమ్మదాబాద్/గండీడ్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** యూరియా కోసం ఎంతో మంది రైతులు ఎదురుచూపులు బుధవారం మహమ్మదాబాద్ మండలంలో నంచర్ల ఎక్స్ రోడ్డు వద్ద తెల్లవారుజాము నుంచి రైతులు యూరియా కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడ్డారు. ఆగ్రహించిన రైతులు నడిరోడ్డుపై ధర్నా చేసి,వాహనాలను అడ్డుకోగా, పోలీసులు వచ్చి శాంతింపజేశారు. పంటల ఎదుగుదలకు యూరియా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో ఇలాంటి కొరత లేదని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు.సెప్టెంబర్ 2న జిల్లాకు1,500మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగినప్పటికీ,పంపిణీలో జాప్యం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు గమనించి రైతులకు మండలానికి సరిపడే యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రెస్‌క్లబ్ కృషి చేయాలి

- మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 3 (జనం సాక్షి):** జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతనంగా ఎన్నికయిన ప్రెస్ క్లబ్ కార్యవర్గం కృషి చేయాలని మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం అంబేద్కర్ కళాభవన్ లో జరిగిన సమావేశంలో ఇటీవల ఎన్నికైన జడ్చర్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా సహకారం అందిస్తానన్నారు. సన్మానం అందుకున్న వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్, కోశాధికారి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మల్లేష్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సంతోషి కిరణ్మయిలు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండువాగు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన కలెక్టర్



**టేక్మాల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామంలో గుండు వాగు వరద ప్రభావిత ప్రాంతాలు, నీట మునిగిన పంట పొలాలను కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగిపోయాయి. రోడ్లు, కాలువలు కోతకు గురయ్యాయి. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు. పత్తి పంట నీట మునిగిన కారణంగా కుళ్లిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద తీవ్రతకు రోడ్లు కొట్టుకు పోయాయని దీంతో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి అసౌకర్యంగా ఉందని తెలిపారు. వెంటనే మరమ్మత్తులు చేపడుతామని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో స్పష్టమైన నివేదికలు రూపొందించి, ప్రభుత్వం దృష్టికి సాధ్యమైనంత త్వరగా తీసుకు వెళ్లేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తులసీరామ్, వ్యవసాయ అధికారి రాంప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో శోభాయాత్ర నిరంతర పర్యవేక్షణ

- 950 మంది సిబ్బందితో శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు



**దేవరకొండ, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ శుక్రవారం రోజున నిర్వహించే గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు భద్రతా ఏర్పాటు చర్యలు తీసుకుందని జిల్లా యస్.పి శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ తెలిపారు. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో అజ్మాపూర్ మరియు దేవరకొండ లోకల్‌లోని కొన్ని నిమజ్జన ప్రాంతాలనీ దేవరకొండ ఏఎస్పి మౌనిక ఐపీఎస్, ఆర్.డి.ఓ మరియు ఇతర శాఖ అధికారులతో కలిసి పరిశీలించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం దేవరకొండ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు, పోలీసు స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిసరాలు, స్థితిగతులు వివరాలు గురించి సిఐని అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, తనిఖీ చేయడం జరిగింది.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



**మెదక్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ స్పష్టం చేశారు. బుధవారం హవేలి ఘనపూర్ మండలం పోచం రాల్ గ్రామంలో భారీ వానలతో నష్టపోయిన రైతుల పంట పొలాలు, బోరు బావులను పరిశీలించి అన్నదాతలకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో రైతు పాలన నడుస్తుందన్నారు.గత పాలకులు ఏనాడూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. వానలతో పాడైన వాటిని వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై ఫోన్ లో జిల్లా అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ తో అక్కడించే మాట్లాడారు. వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పరుశరామ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు లక్కర్ శ్రీనివాస్, నోముల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## మైహోం సిమెంట్స్‌పై విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**మేళ్లచెరువు, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** మండలంలోని గ్రామపంచాయతీ, రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ డొంక రోడ్లను మైహోం సిమెంట్స్ కంపెనీ అక్రమంగా ఆక్రమించుకున్నారన్న ఆరోపణపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ డొంకరోడ్ల ఆక్రమణపై నివేదిక సమర్పించాలని హుజూర్ నగర్ ఆర్డివో, మేళ్లచెరువు తాసిల్దార్ కు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హుజూర్ నగర్ న్యాయవాది కమతం నాగార్జున చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాది ఫిర్యాదు ప్రకారం తన కుటుంబ సభ్యులు, రైతులు సర్వే నెంబర్ 1100లో వ్యవసాయ భూములు కలిగి ఉన్నారని, ఈ వ్యవసాయ భూములను చేరడానికి మేళ్లచెరువు, మఠంపల్లి డొంక రోడ్డు వయా మై హోమ్ సిమెంట్ పరిశ్రమ మధ్యలో నుండి దారి ఉందని పేర్కొన్నారు. 2012లో రైల్వే లైను నిర్మాణ సమయంలో ఈ డొంకదారికి అండర్ పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో డొంకదారి మూసుకుపోయిందని పేర్కొన్నారు. ఇదే అదునుగా రైల్వే లైన్ కు అవతలి పక్క ఉన్న డొంకదారి భూమిని మైహోమ్ సిమెంట్ పరిశ్రమ ఆక్రమించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా మేళ్లచెరువు నుండి పోలీస్ స్టేషన్ వయా మై హోమ్ సిమెంట్ పరిశ్రమ దక్షిణ వైపు సర్వే నెంబర్ 876 ప్రభుత్వ భూమి గుండా చౌటపల్లి డొంక దారి ఉన్నదని, ఇటీవల ఈ డొంకదారిని కూడా మైహోమ్ సిమెంట్ పరిశ్రమ ఆక్రమించి, డొంకదారి భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డొంకదారులు మూసి వేయడం వల్ల రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు సంబంధించిన డొంకదారులు కబ్జాపై ఆల్టర్నేటివ్ దారిని ఏర్పాటు చేయాలని, కబ్జా చేసిన భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని మైహోమ్ సిమెంట్ పరిశ్రమ భూమిని, స్థానిక మేళ్లచెరువు గ్రామపంచాయతీకి నష్టపరిహారంగా ఇప్పించాలని ఫిర్యాదులు డిమాండ్ చేశారు. 2017లో డొంక దారి కబ్జాపై జరిపిన విచారణ రిపోర్టులు, డొంక దారి నక్షాలను ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ విచారణకు ఆదేశించారు. హుజూనగర్ ఆర్టీవో, మేళ్లచెరువు తాసిల్దార్ ను విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకొనున్నట్లు మేళ్లచెరువు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్




**టేక్మాల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** టేక్మాల్ మండలంలో వంద కోట్ల మేర అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం అని మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో టేక్మాల్ లో మోడల్ స్కూల్ భవనం నిర్మించడం జరిగిందని, నిలిచిపోయిన పనులు పూర్తి చేయడం మంత్రి దామోదర్ రాజనర్సింహతోనే సాధ్యమైందన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాల ఇలా అన్ని విద్యాసంస్థలను బలోపేతం దిశగా కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా గిరిజన తండాలకు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఎన్నిల ప్రచార సమయంలో వారి బాధలను స్వయంగా చూసిన మంత్రి మొదటగా రోడ్ల నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఎల్లుపేట, వేల్పుగొండ, కమ్మరికత్త, బొడగట్టు ప్రాంతాల వారికి వైద్య సేవల కోసం ఎల్లుపేటకు ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ తమ ఉనికి కోసం, కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశిస్తే రాజకీయ కక్ష సాధింపు చర్యలంటూ రాస్తారోకోలు నిర్వహిస్తుందన్నారు. దీనికి తోడు యూరియా కొరత ఉందంటూ రైతులను మోసం చేస్తూ, బిఆర్ఎస్ తమ ఉనికి కోసం రాద్దాంతం చేస్తుందన్నారు. టేక్మాల్ మండల రైతులకు సరిపడ యూరియా అందుబాటులో ఉందని, ఈ విషయంలో జయశంకర్ సార్ చౌరస్తా వద్ద బహిరంగ చర్చకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. మండల అభివృద్ధి కోసం సూచనలు చేస్తే తాము కలిసి వస్తామని, లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ సత్యనారాయణ, ఆర్టిఏ సభ్యులు మల్లారెడ్డి,యూసూఫ్, మాన్ కిషన్, విష్ణువర్ధన్ రెడ్డి, సేవాలాల్, భూమ్ రెడ్డి,శ్రీధరచారి, చంద్రశేఖర్ రెడ్డి, సత్యం, మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, రాజేశ్వర్గౌడ్, అవినాష్, రవిబాబు, యాదయ్య, మల్లేషం తదితరులు ఉన్నారు.

# స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగివు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం, జీఎస్టీ స్లాబుల మార్పు గురించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన నేపథ్యంలో మదుపరుల సెంటిమెంట్ బలపడటంతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,295.99 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై, ఇంట్రాడేలో 80,004.60 పాయింట్ల కనిష్ఠానికి చేరి, గరిష్ఠంగా 80,671.28 పాయింట్లకు పెరిగింది. చివరికి 409.83 పాయింట్ల లాభంతో 80,567.71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 135.45 పాయింట్లు పెరిగి 24,715.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో సుమారు 2,415 షేర్లు లాభపడగా, 1,333 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో టాటా స్టీల్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కోల్ ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎంఅండ్‌ఎం, ట్రెంట్, ఐటీసీ, ఎటర్నల్, టాటా మోటార్స్ లాభాల్లో ఉండగా, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ, విప్రో, హెచ్‌యూఎల్, టీసీఎస్, నెస్లే, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్ నష్టాల్లో ముగిశాయి.

# 2 కోట్ల ఫోన్ కనెక్షన్లు బ్లాక్: డీవోటీ




కేంద్ర టెలికమ్యూనికేషన్ విభాగం (డీవోటీ) కార్యదర్శి నీరజ్ మిత్తల్, మోసపూరిత కార్యకలాపాలకు ఉపయోగించిన రెండు కోట్లకు పైగా ఫోన్ కనెక్షన్లను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సంచార్ సాథీ ద్వారా ఇలాంటి మోసాలను అడ్డుకున్నామని దక్షిణ గోవాలో జరిగిన సమావేశంలో వీడియో ద్వారా మాట్లాడుతూ ఆయన తెలిపారు. దేశ సైబర్ భద్రతను మెరుగు పరిచేందుకు డీవోటీ అనేక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. టెలికాం రంగం ప్రతి రంగంలో కీలక పాత్ర పోషిస్తోం దని, వినియోగదారుల సంఖ్య పెరిగినప్పటికీ, ఆర్థిక రంగంలో టెలికాం వనరుల దుర్వినియోగం కూడా పెరుగుతోందని ఆయన అన్నారు. ఆర్థిక మోసాల గురించి సమాచారం సేకరించి, ప్రజలకు తెలియజేయడానికి డీవోటీ డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసిందని, ఇది సైబర్ సురక్షిత వాతావరణాన్ని అందిస్తుందని మిత్తల్ వివరించారు. అధిక నాణ్యత కలిగిన టెలికాం పరికరాల కోసం టెస్టింగ్ ల్యాబ్‌ల సంఖ్యను పెంచుతున్నామని, కృత్రిమ మేధ సాయంతో మోసపూరిత కనెక్షన్లను తొలగిస్తున్నామని, ప్రైవేటు సంస్థలతో కలిసి సైబర్ భద్రతను మెరుగుపరుస్తున్నామని ఆయన తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' మోసపూరిత కార్యకలాపాలకు ఉపయోగించే ఫోన్ నంబర్లను విజయవంతంగా గుర్తిస్తోందని, కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు మిత్తల్ పేర్కొన్నారు.

# బంగారం భగభగ

## తులం రూ.1.25 లక్షలకు చేరే అవకాశం

### ఐసీఐసీఐ బ్యాంక్ నివేదిక



పసిడి ధరలు కొనుగోలుదారులను ఆశ్చర్యపరుస్తూ సరికొత్త గరిష్ఠ స్థాయిలను తాకుతున్నాయి. రాబోయే రోజుల్లోనూ బంగారం ధరలు పెరుగుతాయని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకనామిక్ రీసెర్చ్ గ్రూప్ తన నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది బంగారం తులం ధర రూ.99,500 నుంచి రూ.1.10 లక్షల మధ్య ట్రేడవుతుందని, 2026 తొలి అర్ధభాగంలో రూ.1.10 లక్షల నుంచి రూ.1.25 లక్షలకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే అంచనా కంటే బలహీనపడితే అదనపు నష్టాలు వచ్చే అవకాశం ఉందని, సగటు డాలర్-రూపాయి మారకం రేటు రూ.87 నుంచి రూ.89 మధ్య ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధరలు సుమారు 33% పెరిగాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సడలింపు, ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారం ధరల పెరుగుదలకు ఊతం ఇస్తున్నాయి. ప్రపంచ బులియన్ ధర ఈ ఏడాది మిగతా కాలంలో ఔన్స్‌కు 3,400 నుంచి 3,600 డాలర్ల మధ్య, 2026 తొలి అర్ధభాగంలో 3,600 నుంచి 3,800 డాలర్ల వరకు పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగితే ధరలు ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక బలహీనతలు బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని, సురక్షిత పెట్టుబడిగా బంగారం కొనుగోలు స్వల్పంగా తగ్గినప్పటికీ ధరలు పెరుగుతాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశీయంగా రూపాయి బలహీనత, బలమైన పెట్టుబడి డిమాండ్ కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. భారతదేశ బంగారం దిగుమతులు జూన్‌లో 1.8 బిలియన్ డాలర్ల నుంచి జులై 2025లో 4.0 బిలియన్ డాలర్లకు పెరిగాయి, ఇది పండుగల సీజన్‌కు ముందు బలమైన డిమాండ్‌ను సూచిస్తుంది. గత సంవత్సరంతో పోలిస్తే గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. జులైలో రూ.12.6 బిలియన్ల నికర పెట్టుబడి నమోదైందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) డేటా ద్వారా నివేదిక తెలిపింది.

**పసిడి ధరలు రికార్డు స్థాయిలో రూ.1.07 లక్షలకు చేరిక**

పసిడి ధరలు రోజురోజుకు పరుగులు తీస్తూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర తులానికి రూ.1000 పెరిగి రూ.1,07,070కి చేరుకుని ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల సడలింపు, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి వంటి అంశాల నేపథ్యంలో బంగారం ధరలు వరుసగా పెరుగుతూ వస్తున్నాయి.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 514 | ₹ 61.68 |
| వరంగల్ | ₹ 492 | ₹59.04 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹1,06,970 (24 క్యారెట్లు) | ₹ 98,050 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
| --- | --- |
| ₹ 98,050 (22 క్యారెట్లు) | ₹1,06,970 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,37,000

# ఎయిరిండియా టికెట్లపై ఆకర్షణీయ రాయితీలు



ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా ఇటీవల సీనియర్ సిటిజన్లకు టికెట్లపై రాయితీ ప్రకటించిన తర్వాత, ఇప్పుడు బిజినెస్ క్లాస్, ప్రీమియం ఎకానమీ టికెట్లపై ప్రత్యేక ఆఫర్లతో ప్రయాణికులను ఆకర్షిస్తోంది. దక్షిణాసియా, పశ్చిమాసియా ప్రాంతాలకు ప్రయాణించే వారికోసం ఎంపిక చేసిన అంతర్జాతీయ మార్గాల్లో తక్కువ ధరకే విలాసవంతమైన ప్రయాణాన్ని అందిస్తూ ఈ ఆఫర్‌ను ప్రకటించింది. ప్రీమియం ఎకానమీ రౌండ్ ట్రిప్ టికెట్లు రూ.13,300 నుంచి, బిజినెస్ క్లాస్ టికెట్లు రూ.34,400 నుంచి అందుబాటులో ఉన్నాయి. ఎయిరిండియా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే వారికి అదనపు రాయితీలు లభిస్తాయి. FLYAI ప్రోమో కోడ్‌తో టికెట్‌పై రూ.2,400 వరకు, వీసా కార్డుతో బుకింగ్ చేస్తే VISAFLY కోడ్ ద్వారా రూ.2,500 వరకు రాయితీ పొందవచ్చు. ఈ పరిమిత కాల ఆఫర్ సెప్టెంబర్ 2 నుంచి 7 వరకు మాత్రమే అందుబాటులో ఉండి, 2026 మార్చి 31 వరకు చేసే ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్, ఎయిర్‌పోర్ట్ టికెటింగ్ కార్యాలయాలు, కస్టమర్ సర్వీస్ కేంద్రాలు, ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుకింగ్ చేయవచ్చు. అయితే, సెప్టెంబర్ 7న కేవలం వెబ్‌సైట్, యాప్ ద్వారానే బుకింగ్ చేయాలి. ఈ ఆఫర్ కింద టికెట్లు పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉంటాయి, మొదట బుక్ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎక్స్ఛేంజ్ రేట్లు, ట్యాక్స్‌ల కారణంగా నగరాల వారీగా ఛార్జీలు స్వల్పంగా మారవచ్చని, ఉత్తమ ప్రయోజనాల కోసం ముందుగానే బుక్ చేయాలని ఎయిరిండియా సూచించింది.

# బంగారం లోన్ మార్పులు

భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గోల్డ్ లోన్ విధానంలో ముఖ్యమైన సంస్కరణలు చేపట్టింది. ఈ కొత్త మార్పులతో ఇప్పుడు కేవలం కొన్ని క్షణాల్లోనే బంగారం ఆధారిత లోన్‌లను పొందవచ్చు. ఈ సంస్కరణలు లోన్ ప్రక్రియను మరింత సులభతరం చేసి, వేగవంతం చేశాయి. భారతీయుల్లో బంగారాన్ని పెట్టుబడి మార్గంగా, ఆర్థిక భద్రతగా భావించే ధోరణి గత కొన్ని సంవత్సరాలుగా గణనీయంగా పెరిగింది.

ఈ కొత్త విధానం బంగారం ఆధారిత లోన్‌లను మరింత సులభంగా, సమర్థవంతంగా చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ ఈ మార్పుల ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గోల్డ్ లోన్‌లను అందించే ప్రక్రియను డిజిటలైజ్ చేయడంపై దృష్టి సారించింది. ఇది వినియోగదారులకు వేగవంతమైన సేవలను అందించడమే కాకుండా, పారదర్శకతను కూడా పెంచుతుంది. భారతదేశంలో బంగారం ఎప్పటి నుంచో ఆర్థిక భద్రతకు చిహ్నంగా ఉంది, మరియు ఈ కొత్త సంస్కరణలు ఆ భావనను మరింత బలోపేతం చేస్తాయి. ఈ విధానం ద్వారా, వ్యక్తులు తమ బంగారాన్ని తాకట్టు పెట్టి తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకో వచ్చు. అదనంగా, ఈ మార్పులు గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులకు కూడా గోల్డ్ లోన్‌లను సులభంగా అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. ఆర్‌బీఐ ఈ సంస్కరణలను అమలు చేయడంతో, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు తమ సేవలను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ మార్పులు ఆర్థిక వ్యవస్థలో లిక్విడిటీని పెంచడంతో పాటు, బంగారం ఆధారిత లోన్‌ల పట్ల పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని ఆర్థిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త విధానం దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని, వినియోగదారులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుందని అంచనా.

# చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం

## యూజర్ల నుంచి సోషల్ మీడియాలో ఫిర్యాదులు

ఓపెన్ ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడటంతో భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు సమస్యలను ఎదుర్కొన్నారు. చాట్‌జీపీటీని యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు ఎదురైనట్లు యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం, బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ సమస్య తలెత్తగా, భారత్ నుంచి 500కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. మొబైల్ యాప్, వెబ్ వేదికల్లోనూ ఈ సమస్య కనిపించిందని యూజర్లు తెలిపారు. ప్రశ్నలు వేసినప్పుడు చాట్‌జీపీటీ వాటిని స్వీకరించడానికి నిరాకరిస్తోందని, స్వీకరించినా స్పందించడం లేదని, అలాగే లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలను కూడా ఎదుర్కొంటున్నట్లు యూజర్లు పేర్కొన్నారు. 'చాట్‌జీపీటీ డౌన్' అంటూ ఎక్స్‌లో పోస్టులు పెడుతున్నారు. 2022 చివర్లో ఓపెన్ ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా చాట్‌జీపీటీని అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బాట్ ద్వారా యూజర్లు సెకన్లలో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చు. క్లిష్టమైన ప్రశ్నలకు కూడా అలవోకగా సమాధానాలు ఇవ్వడంతో దీనిపై యూజర్లు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

# విక్రాన్ ఇంజనీరింగ్ ఐపీఓ.. ప్రారంభం విజయం

విక్రాన్ ఇంజనీరింగ్ ఐపీఓ మంగళవారం స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయింది. ఈ ఐపీఓ 2% ప్రీమియంతో ఆరంభమైంది, ఇది పెట్టుబడి దారులకు సానుకూల సంకేతంగా కనిపించింది. మార్కెట్ సెంటిమెంట్ కొంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, విశ్లేషకులు ఈ లిస్టింగ్‌ను మంచి డెబ్యూగా భావించారు. కంపెనీ యొక్క బలమైన వ్యాపార నమూనా, స్థిరమైన ఆర్థిక పనితీరు కారణంగా ఈ ఐపీఓ పట్ల పెట్టుబడిదారులలో ఆసక్తి కనిపించింది. సెప్టెంబర్ నెలలో ఇతర ఐపీఓలు కూడా మార్కెట్‌లోకి రాబోతున్నాయి, ఇవి రిటైల్ మరియు సంస్థాగత పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను అందించనున్నాయి. విక్రాన్ ఇంజనీరింగ్ ఐపీఓ యొక్క విజయవంతమైన లిస్టింగ్, ఇతర కంపెనీలకు సానుకూల సంకేతంగా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్‌లో అనిశ్చితి ఉన్నప్పటికీ, ఈ ఐపీఓ యొక్క పనితీరు ఆశాజనకంగా ఉంది. సెప్టెంబర్‌లో రాబోయే ఐపీఓలు వివిధ రంగాల నుంచి ఉండనున్నాయి, ఇవి ఆర్థిక వ్యవస్థలో డైనమిక్‌గా మార్పులను సూచిస్తున్నాయి. ఈ కొత్త ఐపీఓలు మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపుతాయని, పెట్టుబడిదారులకు లాభదాయక అవకాశాలను అందిస్తాయని విశ్లేషకులు ఆశిస్తున్నారు. విక్రాన్ ఇంజనీరింగ్ ఐపీఓ యొక్క ప్రారంభ విజయం, రాబోయే ఐపీఓలపై కూడా సానుకూల ప్రభావం చూపవచ్చని అంచనా. ఈ ఐపీఓలు భారత స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్తేజాన్ని తీసుకురాగలవని, ఆర్థిక వృద్ధికి దోహదపడగలవని నిపుణులు భావిస్తున్నారు.

# పన్ను సంస్కరణలు, వినియోగదారుల ఉపశమనం



జీఎస్టీ కౌన్సిల్ సమావేశం సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు జరుగుతోంది, ఈ సమావేశంలో పన్ను రేట్ల మార్పులు మరియు సంస్కరణలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరుగుతుంది. రాబోయే ఫెస్టివల్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రోజువారీ అవసర వస్తువులపై పన్ను రేట్లను తగ్గించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ మార్పులు వినియోగదారులకు గణనీయమైన ఉపశమనం కలిగించనున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎస్టీ విధానంలో సమర్థతను పెంచేందుకు, పన్ను వసూళ్లను సరళీకరించేందుకు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రోజువారీ వస్తువులపై పన్ను తగ్గింపు వల్ల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సమావేశంలో చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు సంబంధించిన జీఎస్టీ నిబంధనలను సులభతరం చేసే అంశాలపై కూడా చర్చ జరగనుంది. ఈ సంస్కరణలు చిన్న వ్యాపారులకు సౌలభ్యాన్ని అందించడంతో పాటు, ఆర్థిక వ్యవస్థలో పన్ను వసూళ్ల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని ఆశిస్తున్నారు. ఫెస్టివల్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, వినియోగ వస్తువులపై పన్ను తగ్గింపు ద్వారా రిటైల్ మార్కెట్‌లో ఊపు తీసుకురావచ్చని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీఎస్టీ కౌన్సిల్ ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. ఈ సంస్కరణలు దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వాన్ని, వినియోగదారులకు ఆర్థిక ఉపశమనాన్ని అందించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సమావేశంలో చర్చించే అంశాలు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో అమలు చేయబడతాయని, ఇది జీఎస్టీ విధానంలో ఏకీకృత విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం ద్వారా జీఎస్టీ విధానంలో మరింత పారదర్శకత, సరళతను తీసుకురావడం లక్ష్యంగా ఉంది. ఈ మార్పులు ఆర్థిక వృద్ధికి ఊతం ఇస్తాయని, వినియోగదారులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏఐతో భారత ఆర్థిక విప్లవం



కృత్రిమ మేధస్సు (ఏఐ) భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకురానుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ సాంకేతికత వ్యవసాయం, ఉత్పాదకత, సేవల రంగాల్లో గణనీయమైన మార్పులను తీసుకువచ్చి, ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ సాంకేతికత ద్వారా వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను మెరుగుపరచడం, పంటల సామర్థ్యాన్ని పెంచడం, వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఉత్పాదక రంగంలో ఏఐ ఆధారిత ఆటోమేషన్ ద్వారా తయారీ ప్రక్రియలు మరింత సమర్థవంతంగా మారనున్నాయని, ఇది ఉత్పత్తి ఖర్చులను తగ్గించి, నాణ్యతను పెంచుతుందని గోయల్ పేర్కొన్నారు. సేవల రంగంలో కూడా ఏఐ సాంకేతికత కస్టమర్ సేవలను, డేటా విశ్లేషణను, వ్యాపార ప్రక్రియలను మెరుగుపరుస్తుందని ఆయన తెలిపారు. ఈ మార్పులు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని, ఆర్థిక వృద్ధికి ఊతం ఇస్తాయని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఏఐతో పాటు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద తయారు చేయబడే సెమీకండక్టర్ చిప్‌లు 2025 చివరి నాటికి మార్కెట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. ఈ చిప్‌లు భారతదేశంలో సాంకేతిక ఆవిష్కరణలకు, స్వావలంబనకు దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ చిప్‌ల ఉత్పత్తి ద్వారా భారత్ గ్లోబల్ టెక్ హబ్‌గా మారే అవకాశం ఉందని, ఇది విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఏఐ సాంకేతికతను అన్ని రంగాల్లో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థను డిజిటల్ యుగంలోకి తీసుకెళ్లవచ్చని గోయల్ ఉద్ఘాటించారు. ఈ సాంకేతికత డేటా ఆధారిత నిర్ణయాలను సులభతరం చేస్తుందని, వ్యాపారాల సామర్థ్యాన్ని పెంచుతుందని ఆయన తెలిపారు. అదనంగా, ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు ప్రభుత్వం మద్దతు అందిస్తోందని, ఇది యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం ఇస్తుందని ఆయన చెప్పారు. ఈ సంస్కరణలు భారత్‌ను గ్లోబల్ ఆర్థిక శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని, దీర్ఘకాలంలో స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించడంలో దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ మార్పులు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త ఉత్తేజాన్ని నింపుతాయని, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రష్యాతో భారత్ రక్షణ ఒప్పందం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు మరియు పాకిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత్ తన రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుగాంచిన ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌ల అదనపు యూనిట్లను రష్యా నుంచి కొనుగోలు చేయడానికి భారత్ సన్నద్ధమవుతోంది. ఈ విషయంపై రష్యా అధికారులతో చర్చలు ప్రారంభించినట్లు రష్యా మీడియా వెల్లడించింది. భారత్ ఇప్పటికే ఎస్-400 వ్యవస్థలను ఉపయోగిస్తోంది, మరియు ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన సరిహద్దు ఘర్షణల సమయంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. పాకిస్థాన్ డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు, ఎస్-400 సాయంతో భారత్ వాటిని విజయవంతంగా కూల్చివేసింది. సరిహద్దుల్లో మోహరించిన ఈ వ్యవస్థ ఖచ్చితత్వంతో వైమానిక ముప్పును తిప్పికొట్టడంలో సఫలమైంది. ఈ నేపథ్యంలో, చైనా నుంచి పెరుగుతున్న సైనిక ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించింది.

# తేజాస్ అకాడమీ నుండి అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపిక

- 21 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిట్
- తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్ రావు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** మా తేజస్ అకాడమీ నుండి 21 మంది విద్యార్థులకు ఇండియన్ నావిలో సీనియర్ సెకండరీ రిక్రుట్స్ అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మా విద్యార్థులు నావిలో 2025 నియామకాలలో పాల్గొని జాతీయ స్థాయిలో మెరిట్ సాధించి, అగ్ని వీరులుగా ఉద్యోగాలకు ఎంపికకావడం జరిగిందని తెలిపారు. వారు ఒరిస్సాలోని చిలక ట్రెనింగ్ సెంటర్ లో 2025 సెప్టెంబర్ 11 న రిపోర్ట్ చేయాల్సి ఉందని వీరందరూ నేవీలో జాయిన్ అయి ఉన్నతమైన స్థానంలో ఉండి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొరుకుంటున్నామని తెలిపారు. తేజస్ అకాడమీలో రాష్ట్ర స్థాయిలో మార్కులు ఇంటర్మీడియట్ లో ఎంపీసి మొదటి సంవత్సరంలో 470 గాను 468, ఎంపీసి రెండవ సంవత్సరంలో 1000 గాను 993 మార్కులు సాధించారు. సిఇసి మొదటి సంవత్సరంలో 500 మార్క్‌లకు గాను 490, సిఇసి రెండవ సంవత్సరంలో 1000 గాను 973 మార్కులు సాధించారు. బైపిసి మొదటి సంవత్సరంలో 440 మార్క్ లకు గాను 436, బైపిసి రెండవ సంవత్సరంలో 1000 గాను 969 మార్కులు సాధిస్తూ.. ప్రతి నోటిఫికేషన్ లో తెలంగాణ లోనే అత్యధిక ఉద్యోగాలు సాధిస్తూ.. 2000కు పైగా మా తేజాస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చి దిద్దడం జరిగిందని తేజాస్ అకాడమీ చైర్మన్ సతీశ్ రావు తెలిపారు.

# ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ

- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి
- బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ



**రుద్రంగి సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :**
ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం పలు వినాయకులను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ తెప్ప నిర్మాణం ముఖ్యమైన భాగంగా మారనుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల,మహిళలల ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలోని రామకృష్ణపూర్ పల్లె వద్ద 5 లక్షలు,అచ్చయా కుంట వద్ద 5 లక్షలు,ఎల్లయ్య కుంట వద్ద 10 లక్షల నిధులతో బతుకమ్మ తెప్ప నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.పోచమ్మ కుంట వద్ద త్వరలోనే బతుకమ్మ తెప్ప నిర్మాణం చేస్తానని తెలిపారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తానని,రుద్రంగి మండల కేంద్రంలోని రైతులకు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం కోసం ఇటీవల 47 కోట్లతో 132/33 కె.వి సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.రుద్రంగి ప్రజలకు రైతులకు లో వోల్టేజ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఈ సబ్ స్టేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.రుద్రంగి మండలంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని తెలిపారు. ప్రతిరోజు పేద ప్రజల సమస్యల పరిష్కారాన్ని ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఎల్లయ్యకుంటా నుంచి వచ్చే ఫీడర్ ఛానల్ మరమ్మతులకు 16 లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. తద్వారా నాగారం చెరువు నుండి ఎల్లయ్యకుంటాల ఎల్లప్పుడూ నీరు ఉండే ఆస్కారం వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,తర్రె తరరే మనోహర్,తర్రె లింగం, ఎర్రం గంగ నరసయ్య, గండి నారాయణ, కొమిరే శంకర్, సామ మోహన్ రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, ముస్కు ముకుంద రెడ్డి, మోతే నరసయ్య, ఇప్ప మహేష్, సుర యాదయ్య, పల్లి గంగాధర్, దువ్వాక గంగాధర్, కట్కూరి దాసు, గండి అశోక్, సనుగుల గంగాధర్, ఎంపీడీవో నటరాజ్, రుద్రంగి కార్యదర్శి రాందాస్ నాయక్, అధికారులు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె బీజింగ్ పర్యటన

చైనా మిలిటరీ డే పరేడ్‌కు హాజరైన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి కనిపించారు. ఆయన కుమార్తె తొలిసారిగా విదేశీ పర్యటనకు రావడం ఈ సందర్భంలో జరిగింది. ఈ సంఘటన ఆమె భవిష్యత్‌లో పాలనా పగ్గాలు అందుకోనున్నారనే అభిప్రాయాలకు బలం చేకూరుస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఏర్పాటు చేసిన ఆయుధ ప్రదర్శన మరియు సైనిక కవాతులో కిమ్ జోంగ్ ఉన్‌తో పాటు కిమ్ జు యే కూడా పాల్గొన్నారు. కిమ్ బుల్లెట్ ప్రూఫ్ రైలులో మంగళవారం బీజింగ్‌కు చేరుకున్నారు. రైలు నుంచి దిగుతున్న సమయంలో కిమ్ వెనక ఆమె ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. 2022లో కిమ్ తన కుమార్తెను మొదటిసారిగా ప్రపంచానికి పరిచయం చేశారు, అప్పుడు ఆమె ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ స్థలంలో కనిపించింది. 2023లో ఉత్తర కొరియా సైన్యం స్థాపన దినోత్సవం సందర్భంగా ప్యాంగ్యాంగ్‌లో జరిగిన ఆయుధ ప్రదర్శనలో ఆమె తన తండ్రితో కలిసి హాజరైంది. అప్పటి నుంచి ఆమె పలు అధికారిక కార్యక్రమాలలో కనిపిస్తోంది. ఈ విధంగా పదేపదే తన కుమార్తెతో కలిసి కనిపించడం ద్వారా కిమ్ భవిష్యత్‌లో పగ్గాలు తన వారసులకు అందజేయాలనే సంకేతాలను పంపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉత్తర కొరియా మీడియా ఆమెను మొదట 'ప్రియమైన కుమార్తె'గా, తర్వాత 'గౌరవనీయ కుమార్తె'గా పిలిచింది. ఈ గౌరవప్రదమైన విశేషణాలు అత్యంత గౌరవనీయ వ్యక్తులకు మాత్రమే ఉపయోగించబడతాయి. కిమ్ జోంగ్ ఉన్ కూడా తన నాయకత్వ స్థానాన్ని స్థిరపరిచిన తర్వాతే 'గౌరవనీయ కామ్రేడ్'గా పిలవబడ్డారు. ఈ అంశాలు ఆమె వారసురాలనే అభిప్రాయాలకు బలం చేకూరుస్తున్నాయి. అయితే, ఆమె వయస్సు 13 ఏళ్లు మాత్రమే కావడంతో, వారసత్వ పగ్గాలు అందుకోవడానికి ఇంకా సమయం ఉందని ఉత్తర కొరియా వ్యవహారాల నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం, కిమ్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు, వారు 2010, 2013, 2017లలో జన్మించారు. కిమ్ జు యే రెండవ సంతానం కాగా, ఆమె అధికారాన్ని చేపట్టే అవకాశం ఉందని అధికారిక వర్గాలు సూచిస్తున్నాయి. కిమ్ జోంగ్ ఉన్ కూడా తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ 2011లో మరణించిన తర్వాత వంశపారంపర్యంగా అధికారాన్ని చేపట్టారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట వేయండి

- పాఠశాల విద్యలో జిల్లా ఆదర్శంగా నిలవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** విద్యారంగంలో ఉపాధ్యా యుల సేవలు వెలకట్టలేనివని, అవకాశాన్ని విని యోగించుకొని విద్యార్థుల బంగారు భవిష్య త్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ పమే లా సత్పతి సూచించారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరి యంలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లాస్థాయి ఉత్త మ ఉపాధ్యాయుల అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు తల్లి లాంటి వారని, వారు పిల్లలను ఆదరించి చక్కటి విద్యాబుద్ధులు నేర్పాలని అన్నారు. చాలా మంది పేద, మ ధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వస్తారని, వారికి సేవ చేసే అవకాశాన్ని విని యోగించుకోవాలని అన్నారు. వేలాది మంది భవిష్యత్తును సన్మార్గంలో నడిపే అవకాశం ఉపాధ్యాయులకు ఉం దని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారు మాత్రమే కాకుండా చాలామంది ఉపాధ్యాయులు తమ సేవలను గోప్యంగా అందిస్తున్నారని అన్నారు. వారం దరికీ అభినందనలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడు తూ... పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులను గమనిస్తూ ఉండాలని, వారు ఎలాంటి ఒత్తిళ్ళకు లోనవ్వకుండా చూసుకో వాలని అన్నారు. చెడు అలవాట్ల బారిన పడకుండా సంరక్షించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 43 మంది ఉపాధ్యాయులకు, ప్రైవేట్ పాఠ శాలలకు చెందిన 17 మంది ఉపాధ్యా యులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించిన 95 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గోడ గడియారాలను బహుమ తులుగా అందజేశారు. జిల్లా కలెక్టర్ పమే లా సత్పతి సృజనాత్మకతతో ఈ గడియా రంలో పాఠ శాల విద్యలో అవలంబించాల్సిన 12 అంశాలను సూచికలుగా పొందుపరిచి రూపొందించారు. అనంతరం ప్రభుత్వ పాఠ శాల్లో ఇటీవల ప్రవేశపెట్టిన "లాంగ్వేజ్ లాంతర్న్" (ఇంగ్లీష్/హిందీ/తెలుగుక్లబ్) కు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా విద్యాధి కారి చైతన్య జైనీ, విద్యాశాఖ కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.



# సిరిసిల్ల "పాతూరి"సారుకు కీర్తి పురస్కారం

## ఆన్‌లైన్ క్లాసుల్లో అరుదైన రికార్డ్

- మరెన్నో పురస్కారాలు అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 3, (జనంసాక్షి):** విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు బాధ్య తాయుత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాకే ప్రత్యేకతను తీసుకొస్తున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాతూరి మహేందర్ రెడ్డి. 1996లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన మహేందర్ రెడ్డి తొలి నుంచి అంకితభావంతో విధులు నిర్వహి స్తూ వస్తున్నారు. పాతూరి అందించిన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మకమైన సూరవరం ప్రతాపరెడ్డి కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారూ బుధవారం హైదరాబాదులో నిర్వహించిన పురస్కార ప్రదనోత్సవ కార్యక్రమంలో కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా పాతూరి మహేందర్ రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు.

**ఎన్నో ప్రశంసలుబిప్రత్యేకతలు**

29 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న మహేందర్ రెడ్డి ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు వివిధ సంస్థల నుండి సుమారు 1761 ప్రశంసా పత్రాలను అందుకున్నారు. డిజిటల్ విద్యాబోధనలో పాతూరి ప్రత్యేకత చాటుకున్నారు. డిజిటల్ విద్యా బోధన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. మహేందర్ రెడ్డి కి పురస్కారం రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# ఏసీబీకి చిక్కిన మున్సిపల్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఎసిబి అధికారులు నిర్వహించారు. ఇందులో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు. బుధవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రెవెన్యూ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసచారి రూ.7000 లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫోన్ కాల్ ఆరోపణలు రుజువు చేస్తే ఎన్నికల్లో పోటీ చేయను

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్
- ఆరోపణలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**జడ్చర్ల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** నేను కాంగ్రెస్ నాయకులకు ఫోన్ చేసినట్టు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు సి. లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్ లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిని మరిచి ఆరోపణలు చేస్తున్నాడని, నేను కాంగ్రెస్ నాయకులకు ఫోన్ చేసి మీ ఎమ్మెల్యే నాపై ఆరోపణలు చేయకూడదని చెప్పండి అని చెప్పానని ఎమ్మెల్యే అంటున్నాడని, ఎమ్మెల్యే చేస్తున్న ఫోన్ కాల్ ఆరోపణలు కాల్ డాటాతో సహా నేను ఫోన్ చేసిన వ్యక్తి పేరును నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని, మరి నిరూపించకుంటే మరి నీవు పోటీ చేస్తావా ఏం చేస్తావో నీవే చెప్పాలని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తనపై నిరంతరం వ్యక్తిగతంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. కానీ ఏ ఒక్క ఆరోపణను కూడా ఆధారాలతో నిరూపణ చేయడం లేదని, గత 20 నెలల నుంచి భూకబ్జాలు అయ్యాయని అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడమే తప్ప ఏ ఒక్క ఆరోపణలను కూడ ఎమ్మెల్యే నిరూపించ లేకపోతున్నారని, నిజంగానే జడ్చర్లలో కబ్జాలు జరిగితే, అవినీతి జరిగితే వాటిని ఆధారాలతో సహా నిరూపించి వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తనపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఇకపై చూస్తూ ఊరుకునేది లేదని ఇక ముందు ఏ ఆరోపణలు చేసిన ఆధారాలు చూపించి చేయాలని లేదంటే ఇక్కడితో ఆపే యాలని హెచ్చరించారు. జడ్చర్ల లోని ఎర్ర గుట్ట వద్ద ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు మాత్రమే ఇవ్వాలని తాను మొదటి నుంచి చెబుతున్నానని, ఇండ్లల్లో ఉన్న వారిని అందరిని అలానే ఉంచి విచారణ చేపట్టి అర్హులైన వారిని అందులోనే ఉంచి అనర్హులను బయటికి పంపించాలని అన్నారు. ఎమ్మెల్యే నోటికి వచ్చినట్టు మాట్లాడుతాను అంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు కెంఆర్ ను ఎలాగైనా బదులం చేయాలని ఉద్దేశంతోనే మాట్లాడు తున్నారని, తెలంగాణ గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుట్రలో బాగమన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన బిఆర్ఎస్ ను ఎవరు ఏమీ చేయలేరని, మిషన్ భగీరథ ద్వారా నిరంతరాయంగా తాగునీటిని అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై కమిషన్ దాదాపు రెండేళ్లు విచారణ చేసిన ఎక్కడ లొసుగులు దొరకలేదని, నివేదికలో ఏమి లేకపోవడంతో పరువు పోతుందనే ఉద్దేశంతో కెసిఆర్ ను బదులాం చేసేందుకు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి యూరియా తెప్పించ లేకపోతున్నారని, రాష్ట్రంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పాలకులు పట్టనట్టు చూస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో ఎక్కడ యూరియా కష్టాలు రానివ్వకుండా చర్యలు తీసుకున్నామని, రాష్ట్రాలు ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్సీ కవితను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, దీంతో పార్టీ కంటే ఎవరు పెద్ద కాదు అన్నది స్పష్టమైందని, పార్టీ పరిరక్షణ కోసం బిడ్డను బహిష్కరించడం హర్షనీయమన్నారు. అనంతరం ఇటీవల జడ్చర్ల ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులను మాజీ మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్, నాయకులు రఘుపతి రెడ్డి, పిట్టల మురళి, ప్రనిల్ చందర్, శ్రీకాంత్, పర్వత్ రెడ్డి, బాలు, పరమటయ్య, శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, కరాటే శ్రీను, శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రశాంత్ రెడ్డి, శశికిరణ్, దేవా పాల్గొన్నారు.



# తాటికుంట రిజర్వాయర్‌లో గల్లంతైన దంపతులు

**మల్దకల్ సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన దంపతులు గల్లంతవడంతో గ్రామంలో కలకలం రేగింది. మంగళవారం సాయంత్రం తాటికుంట గ్రామానికి చెందిన దుబ్బోనీబావి రాముడు (40), భార్య సంధ్య (35) ఇద్దరూ తాటికుంట రిజర్వాయర్ కు చేపల వేట కోసం వెళ్లారు. అయితే రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు వెతికినాఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే అధికారులకు సమాచారం అందించారు. బుధవారంసమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డి ఆర్ ఎఫ్, గజ ఈతగాళ్లుబృందాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు దంపతుల ఆచూకీ తెలియక పోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని గద్వాల్ సిఐ టంగుటూరి శ్రీను సంఘటన స్థలాన్ని చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు గలంతైన ప్రదేశంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసులు, డిఎస్పి మొగిలయ్య, తాసిల్దార్ ఝాన్సీ రాణి సందర్శించారు. రాముడు సంధ్య దంపతులు గల్లంత కావడంతో ఇద్దరు చిన్నారులు వీధిన పడారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తాటికుంట రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, గ్రామస్తులుతోపాటు పంచాయతి కార్యదర్శి శివన్నదగ్గర ఉండి పర్యవేక్షించారు.





# గురుకులాల్లో ఎలుకల కలకలం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్లయిన బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట, బోర్లం క్యాంప్ హాస్టల్ లను నిన్న అనగా మంగళవారం గురుకులాల, పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సుధాకర్ ఆదేశాల మేరకు పేరెంట్స్ సందర్శించారు. కోయ్యగట్ట మరియు బోర్లం క్యాంప్ బాలికల హాస్టల్ పిల్లలు చాల ఇబ్బందిపడుతున్నారని, ముఖ్యంగా హాస్టల్ పిల్లల్ని ఎలుకలు కరుస్తున్నయని ఎలుకలు కరిచిన పిల్లల్ని బాన్సువాడ ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. ఇంకా కొందరు పిల్లలు కుడా ఆనారోగ్యంతో ఉన్నారని డాక్టర్లు తెలిపారు. ఇది పిన్సిపాల్ నిర్లక్ష్యానికి కారణమని తెల్పినారు. వెంటనే జోనల్ ఆఫీసర్, ప్రభుత్వం ఎలుకల నివారణకు తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాలను సందర్శించి వాళ్ళలో చాలా మంది బోర్లం క్యాంప్ హాస్టల్ లో కోతుల బెడద, అలాగే, నీళ్ల కొరత చాలా ఉందని పేర్కొన్నారు. హాస్టల్‌లను సందర్శించిన వారిలో బండరెంజల్ సాయిలు, సంగెం సాయి కుమార్, ఇరాస్ సాయిలు, బొజ్జ సాయిలు, ప్రేమ్ కుమార్, సాయిలు తదితరులు ఉన్నారు. అదేవిధంగా కామారెడ్డి మండలంలోని బిక్నూర్ బాలుర (సీవోఈ) కాలె జ్ లో గతవారం రోజుల నుండి చిరుతపులి సంచరి స్తున్నట్టు స్వయంగా కళాశాల ప్రిన్సిపాల్ తెలిపాడం జరిగిందనీ, రెండు సార్లు పిల్లలు మరియు ప్రిన్సిపాల్ స్వయంగా చూసినట్టు సమాచారం ఉందన్నారు. దీంతో పారెస్ట్ డిపార్ట్‌మెంట్ వచ్చి చిరుత పాదలను గుర్తించారనీ, ఈ విషయంపై కలెక్టర్ వెంటనే స్పంది ంచి తమ పిల్లల ప్రాణాలను కాపాడాలనీ పత్రిక ప్రకటన ద్వారా కొత్తపల్లి సుధాకర్ తెలియజేశారు.



# గణేశ్ వేడుకల్లో ముస్లిం సోదరులు

## వినాయకుడి లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువత



**వనపర్తి, సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** వనపర్తి జిల్లాలో కుల మతాలకు అతీతంగా గణేశ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పలు గ్రామాల వినాయక మంటపాల వద్ద ముస్లీం సోదరులు అన్నదానాన్ని వితరణగా అందజేస్తున్నారు. గణేశ్ ఉత్సవాల నిర్వ హణకు భూరి విరాళాలు అందజే స్తూ పరమత సహనానికి ప్రతీ కగా నిలుస్తున్నారు. హిందూ , ముస్లీం భాయీ భాయీ అంటూ గత నెల 27 నుంచి సంబరాలు చేసుకుంటున్నారు.

**వక్ఫ్ కమిటీ మాజీ చైర్మెన్ అన్న వితరణ**

జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్డు 2బీహెచ్ కే కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ మంటపం వద్ద ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వక్ఫ్ కమిటీ మాజీ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్న దాన వితరణ చేశారు. భక్తులు భారీ ఎత్తున అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మండ్ల రాజు, బలరామ్ వెంకటేశ్, మాజీ కౌన్సిలర్ జములమ్మ పాల్గొన్నారు.

# నష్టపరిహారం కోసం రైతుల ఆందోళన

**కొల్చారం సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో మెదక్ –హైదరాబాద్ జాతీయ రహదారి పునర్నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు తమ కు న్యాయం చేయాలని బుధవారం రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద మూలమలుపును సరి చేస్తూ జాతీయ రహదారి నిర్మించడానికి తాము భూములు ఇచ్చా మన్నారు. దీనికి బదులుగా అప్పటి ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి వంపు తిరిగిన పాత రోడ్డును తమను సాగు చేసుకోమని చెప్పారన్నారు. కానీ ఇప్పుడు రెవెన్యూ సిబ్బంది ఆ పాత రోడ్డుపై ప్రభుత్వ బోర్డు పాతుతున్నారని మండిపడ్డారు. తమ కోల్పోయిన స్థలాన్ని తమకు తిరిగి ఇప్పించి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున కాంగ్రెస్ నాయకులు గజినీ వెంకట్ గౌడ్, పాషా ఖాద్రి అధికారులతో మాట్లాడారు. డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్, గిర్దవర్ ప్రభాకర్ అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని బాధితులను ఒప్పించారు. కాగా ఘటనా స్థలానికి స్థానిక ఎస్సై మొయినుద్దీన్ చేరుకొని తహ సీల్ కార్యాలయానికి వెళ్లి సమ స్య పరిష్కరించుకోవాలని సూచించారు.



# రాష్ట్ర మూకాస సభ్యత్వ నమోదు ప్రారంభం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం ఆధ్వర్యంలో ఒకే కులం ఒకే సంఘం నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బోప్ప దేవయ్య ఆధ్వర్యంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సభ్యత్వ నమోదుతో జిల్లాలో సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపుల సంఖ్య తెలి యడం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తునా రన్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి వారాల దేవయ్య. వేము లవాడ పడమర సంఘం అధ్యక్షులు కోయినేని బాలయ్య, నాయకులు బింగి శ్రీనివాస్ నామాల పోశెట్టి. సారా శ్రీనివాస్, ఎర్రం ఆగయ్య పాల్గొన్నారు.



# కాంగ్రెస్, బిజెపి కుట్ర

## రాజకీయలలో భాగమే సిబిఐ విచారణ

## రేవంత్ రెడ్డి బీజేపీ తో కుమ్మక్కయారు

**సిద్దిపేట బ్యూరో సెప్టెంబర్, 3 (జనంసాక్షి) :** కాంగ్రెస్ బిజెపి చేస్తున్న కుట్ర రాజకీయాల్లో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టును సిబిఐకి అప్పగించేఅందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకు న్నదని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పార్టీ నాయకులు దేవి ప్రసాద్, పల్లె రవికుమార్, బాలరాజులు స్పష్టం చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక మేడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదని ఒక 20 రిజర్వాయర్ల సమూహమే కాళేశ్వరం ప్రాజెక్టు అని వారు చెప్పా రు. మేడిగడ్డ ఒక రెండు పిల్లర్లు కుంగి పోయిన అంశాన్ని రాజకీయం చేస్తూ, విష ప్రచారం చేస్తూ కేసీఆర్ హరీష్ రావుల ప్రతిష్టను దెబ్బతీయడం ద్వారా టిఆర్ఎస్ పార్టీని నిలువరించాలని కాంగ్రెస్ బిజెపి కలిపి చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని వారు చెప్పారు. కాంగ్రెస్, బిజెపి కుట్ర రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.



# శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వరద ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** జిల్లాలో ఎడతెరిప లేకుండా వర్షాలు కురుస్తున్నందు న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలంలోని శ్రీపాద ఎల్లం పల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీటి పరిస్థితిని పరి శీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ .... గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఎస్ఆర్ఎస్పి, కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయ డంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక పెరు గుతు ందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కురిసిన వర్షాల తో వాగులు, చెరువుల నుండి సైతం వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఇన్ ఫ్లో అధికంగా ఉంటు ందని తెలిపారు. పాల్గొన్నారు.



# రైతన్నలకు యూరియా కోసం తప్పని తిప్పలు

**కనువిప్పు కలగాలని వినాయకునికి వినతి పత్రం**

**చిట్యాల సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** రైతన్నలు యూరియా కోసం పడుతున్న తిప్పలు అత్యంత దారుణంగా ఉందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా రాస్తారోకో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి రైతుల కు సకాలంలో యూరియా అందజేయడానికి వారికి కనువిప్పు కలగాలని వినాయకునికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను గోసపుచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను అందజేసి, వెంటనే కెసిఆర్ పై సిబిఐ ఎంక్వయిరీ రద్దు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ పార్క్ పవర్లూమ్ కార్మికులు సమ్మె విరమణ

- యజమానులకు, కార్మికులకు కూలి ఒప్పందం చర్చలు సఫలం

**తంగళ్ళపల్లి సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** సిఐటియు పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ.. తంగళ్ళపల్లి మండలం టెక్స్టైల్ పార్క్ కార్మికులకు ప్రభుత్వ ప్రైవేటు వస్త్రాలకు కూలి పెంచాలని గత 15 రోజుల నుండి సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతమైందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం రోజున చేనేత జౌళి శాఖ ఏడి రాఘవరావు, టెక్స్టైల్ పార్క్ పవర్ లూమ్ యాజమానులు, కార్మిక సంఘ నాయకులు కార్మికులతో సమ్మె కూలి డిమాండ్లపై చర్చలు జరిపారు. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న వస్త్రానికి సంబంధించి కార్మికులకు పని భారం పెరిగి ఇస్తున్న కూలి గిట్టుబాటు అవడం లేదు. ప్రభుత్వ ఆర్డర్ వస్త్రానికి మీటర్ కు అదనంగా 65 పైసలు యాజమాన్లు ఇచ్చే విధంగా చూస్తామని అదేవిధంగా వారం రోజులలో టెక్స్టైల్ పార్కు కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అన్నిటిపై చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఇచ్చిన హామీ ఇచ్చారని, అలాగే త్రీఫ్ట్, 10 శాతం యారన్ సబ్సిడీ ని కార్మికుల ఖాతాలో జమ చేస్తామని కార్మికులతో చర్చించి పనులు ప్రారంభించే విధంగా చూడాలని హామీ ఇచ్చారని వెల్లడించారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు షరతులతో కూడిన డిమాండ్లతో కార్మికులందరూ 15 రోజుల నుండి చేస్తున్న సమ్మె విరమించి పనుల్లోకి చేరుతారని తెలిపారు. గత 15 రోజుల నుండి సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేసిన కార్మికులందరికీ, సిఐటియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యజమానుల సంఘం అధ్యక్షుడు అనిల్, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేష్, నరసయ్య, కార్మికులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



**ఖానాపూర్ సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** మంచిర్యాల బాసర రహదారిపై మండలంలోని తర్లపాడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... కడం మండల కేంద్రానికి చెందిన వ్యాపారి తన కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని పాలజ్ కర్ర గణపతి సందర్శన కోసం గత మంగళవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సుమారు రాత్రి ఒంటిగంట ప్రాంతంలో కారు అదుపుతప్పి లోయలో పడ్డ ఘటనలో చిన్నారి అనన్య కు తీవ్ర గాయాలు కాగా మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హుటాహుటిన 108 అంబులెన్సులో ప్రభుత్వ ఖానాపూర్ ఆసు పత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు.

# మహబూబ్ నగర్ అభివృద్ధికి జగదీశ్వర్ రెడ్డి ప్రధాన భూమిక

## నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ అభివృద్ధికి కృషి చేసిన కొందరిలో జగదీశ్వర్ రెడ్డి అగ్రగణ్యుడు అని నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. నేడు జగదీశ్వర్ రెడ్డి వర్థంతి సందర్భ ంగా మహబూబ్ నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో వారి విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ఆవిష్కరించనున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెక్కెరి మధుసూదన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన సందర్భంగా అప్పుడు వారు అధికార పక్షంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడుతున్న మాకు అన్నివిధాలా సహకరించారని అన్నారు. పార్టీలకు అతీ తంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అభిమానులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ఎమ్మెల్సీ జగదీశ్వర్ రెడ్డి ఆదర్శప్రాయుడు అని అన్నారు. అనంతరం పద్మావతి కాలనీలోని గ్రీన్ బెల్ట్ దగ్గర జగదీశ్వర్ రెడ్డి విగ్రహావిష్కరణ చేసే ప్రదేశాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిజె బెనహార్, అజ్మత్ అలి మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# తండ్రి అనుమానాస్పద మృతి





## ముగ్గురు చిన్నారుల ఆచూకీ గల్లంతు

**వెల్దండ సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** వెల్దండ మండలం లోని పెద్దాపూర్ గ్రామ పరిధిలో సంఘటన చోటు చేసుకుంది.కుటుంబ కలహాల కారణంగా ముగ్గురు పిల్లలతో బయటకు వెళ్లిన ఓ తండ్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషాద ఘటన బుధవారం తెల్లవారుజామున వెల్దండ మండలం పెద్దాపురం గ్రామ శివారులో వెలుగు చూసింది. మృతుడు ప్రకాశం జిల్లా ఎర్రగుంట్ల పాలెం మండలం బోయలపల్లి గ్రామానికి చెందిన గుప్త వెంకటేశ్వ ర్లు (35)గా గుర్తించారు.వెంకటేశ్వర్లు, భార్య దీపికతో జరిగిన గొడవల నేపథ్యంలో, పెద్ద కుమార్తె మోక్షిత (8), చిన్న కూతురు వర్షిణి (6), కుమారుడు శివ ధర్మ (4)లను తీసుకొని బైక్‌పై ఇంటిని వదిలి వెళ్లాడు. నాలుగు రోజులుగా తిరుగుతున్నట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. అయితే అతని వెంట ఉన్న ముగ్గురు పిల్లల ఆచూకీ ఇప్పటి వరకు తెలియలేదు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతు న్నాయి. భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రకాశం జిల్లా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం పక్కా ప్రణాళిక

## పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 03 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం తోపాటు శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ముందుకు సాగుతుందని, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కోటి 56 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అహర్నిశలు కృషి చేస్తామని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమ ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలను వెచ్చించి రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుడుతుందని, భారతదేశంలో మరే రాష్ట్రం చేపట్టాలని అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్రం చేపడుతుండడం గర్వించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ముందు చూపు ఉన్న మనిషి అని, ఆయనను మనిషి అని అనడం కంటే గొప్ప రాజనీతిజ్ఞుడు, ఒక వ్యవస్థగా అభివర్ణించవచ్చని అరికపూడి పేర్కొన్నారు. ఇందులో భాగంగా గోపనపల్లి మంజీరా డైమండ్ హైట్స్ లో మరియు టీఎన్జీవోస్ కాలనీలో 64 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులకు, నానక్ రామ్ గూడలో 42 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులకు, జిపిఆర్ఏ క్వార్టర్స్ సమీపంలోని గమన్ హాస్పిటల్ ఎదురుగా శిలా నిలయం వరకు 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన వరదనీటి కాల్వ నిర్మాణపు పనులకు, కార్పొరేటర్ తో కలిసి అరికపూడి శంకుస్థాపన గావించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు చందమామ.. నేడు చరవాణి

## మెదక్ అదనపు ఎస్పీ మహేందర్




**పాపన్నపేట,(జనంసాక్షి) :** మనం చదివిన చదువు పది మందికీ ఉపయోగ పడాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళాల భద్రత,సైబర్ నేరాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత డ్రగ్స్,సిగరెట్,చెడు అలవాట్లకు దూరంగా ఉండాల న్నారు. డ్రగ్స్ నిర్మూలన,షీ టీం అధికారులు మాట్లాడుతూ .. మాదక ద్రవ్యాల వాడకంతో కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఆరోగ్యం దెబ్బతిస్తుందన్నారు. యువతలో శరీర మార్పుల వలన నిర్ణయాలకు స్నేహితులపై ఆధార పడుతున్నారని,మోసగాళ్లు పరిచయం ఏర్పరుచుకొని మన బలహీనతలను తెలుసుకొని వాటిని ఆసరాగా తీసుకునే అవకాశం ఉందన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ ఉద్దేశ్యంతో స్కూలు, కాలేజీ, ప్రభుత్వ కార్యాలయల అధికారుల సమన్వయంతో క్షేత్ర స్థాయిలోకి ఈ విషయాలను తీసుకు వెళ్తున్నామన్నారు. గతంలో పిల్లలకీ చందమామను చూపించి అన్నం తినిపించేవారని,నేడు మొబైల్ ఫోను ఇచ్చి అన్నం తినిపిస్తున్నారని గుర్తుచేశారు. చేపలకు గాలం వేసినట్టు..నేరగాళ్ళు విసిరిన అంతర్జాల వలలో చదువుకున్న వారు సైతం మోసపోతు న్నార న్నారు.అప్రమత్తతో ఉంటూ అందరికీ అవగాహన కల్పించాలని అధికారులు వివరించారు. ఈసందర్భంగా సైబర్ క్రైమ్ డిఎస్పీ సుభాష్ చంద్రబోస్,షీటీం ఏఎస్ఐ వెంకటయ్య,ప్రమీల,సాయికిరణ్,యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ అధికారి సతీష్, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

## డీ- సిల్టింగ్ పనులు పరిశీలన



**హైదరాబాద్, (జనంసాక్షి) :** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-6 పరిధి.. జూబ్లీ హిల్స్ పరిధిలోని వెంకటగిరి, కృష్ణ నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీలలోని పలు సమస్యాత్మకమైన ప్రాంతాలను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదటగా వెంకటగిరి ప్రాంతంలో వర్షం పడ్డప్పుడు అవుట్ లెట్ సరిగ్గా లేని కారణంగా వర్షం నీరు కాలనిలో నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. దీంతో జలమండలి ఇటీవల వర్షాల తరువాత డీ-సిల్టింగ్ పనులు చేపట్టింది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఈ ప్రాంతంలో పర్యటించి డీ-సిల్టింగ్ పనులు పరిశీలించారు. ఏళ్లనాటి సీవరేజ్ లైన్లు, రోడ్డుకింద పూడుకుపోయినట్టు, దీంతో మట్టి, చెత్త చేరి సీవరేజ్ సాఫీగా చేరకుండా.. వీధుల్లో ఓవర్ ఫ్లో అవుతున్నట్టు అధికారులు ఎండీకి వివరించారు. దీంతో ఈ ప్రాంతంలో సీవరేజ్ లైన్లను డీ-సిల్టింగ్ చేసి తాత్కాలికంగా సమస్యలని పరిష్కరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. శాశ్వత పరిష్కారంగా మ్యాన్ హోళ్లను రోడ్డుకు సమాంతరంగా పునర్నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి సీవరేజ్ మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని సూచించారు. అలాగే, జీహెచ్ఎంసీ సంబంధించిన వాననీటి కాలువలో సీవరేజ్ నీరు చేరకుండా ప్రతేక సీవరేజ్ పైప్ లైన్లను నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడీ అధికారులను ఆదేశించారు.

### తాగునీటి వృథా.. ఇద్దరికి ఫైన్

జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన ఇద్దరికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారా హిల్స్ లో జరిగింది.జలమండలి ఎండీ అశోక్ రెడ్డి బంజారా హిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా... రోడ్ నం. 12 లో నీరు లీకేజి అయినట్టు ఎండీ గమనించి.. స్థానిక మేనేజర్ ను లీకేజికి కారణాలు అరా తియ్యమని ఆదేశించారు.. దీంతో ఓ అండ్ డివిజన్ స్థానిక మేనేజర్ వెళ్లి పరిశీలించారు. అయితే దగ్గరికి వెళ్లి చూస్తే ఒక వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటితో కార్, బైక్ కడిగాడు. ఇదే విషయం ఎండీకి విన్నవించారు.. దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించవద్దని చెప్పారు. అంతే కాకుండా అతనికి నోటీసు అందించి, జరిమానా వెయ్యాలని సంబంధిత మేనేజర్ ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.10000 జరిమానా విధించారు. అలాగే ఆ ప్రాంతంలోనే మరో వ్యక్తి తాగునీటి సంపు నిండి ఓవర్ ఫ్లో అయి దాదాపు ఒక కిలో మీటర్ వరకు తాగునీరు రహదారిపై ప్రవహించింది.. నిర్లక్ష్యంతో నీటిని వృథా చేసినందుకు ఈ వ్యక్తికీ రూ.5000 జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు అండగా ఉంటాం..

- ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలి
- బిజెపి రాష్ట్ర నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణి కార్మికులకు అండ గా ఉంటామని, కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని బిజెపి రాష్ట్ర నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిఎంఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెలబోయిన సుజేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్మిక పోరు బాట బహిరంగసభకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూతెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర కార్మికులదేనని అన్నారు. కార్మిక సంఘాలు లేకుంటేనే సంస్థలు బాగుపడుతాయని అప్పుడు ఉండేదని, సంస్థలు పుట్టకముందే సంఘాలు పుట్టాయన్నారు. సింగరేణి సంపద భూతల్లి ఇచ్చిన వరం అని, ఈ సింగరేణి సంస్థ అన్ని వర్గాల అవసరాలు తీర్చేదిగా ఉండాలి కాని, ఒకరి స్వార్థానికి ఉపయోగపడేలా ఉండకూడదన్నారు. సింగరేణి కార్మికులను నమ్ముకుని అన్ని వ్యాపారాలు కొనసాగేవని, ఉపాధి కల్పించే గడ్డ, సింగరేణి అడ్డ అని చెప్పారు. భూమి ఉన్నంతకాలం సింగరేణి ఉంటుందన్నారు. కార్మికుల్లో చైతన్యం చచ్చిపోతే అరాచకాలు వస్తాయని, కాంట్రాక్ట్ వ్యవస్థ రాజ్యమేలుతుందని తెలియజేశారు. తెలంగాణ సర్కార్ వచ్చాక కార్మిక సంఘాలు చచ్చాయని, కేసిఆర్ చెప్పిందే వేదం అయిందని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమ దోచుకున్నారని ఆరోపించారు. మెడికల్ బోర్డు లో అన్ఫిట్ చేయండి అని అడిగితే పైరవి కారులు లేకుంటే పట్టించుకోవడం లేదని, కార్మికులకు భాద్యతలు ఉండాలని, ఐక్యతగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు బిఎంఎస్ నాయకులు చెప్పిన 40 శాతం బోనస్ పంచాలనే డిమాండ్ కు మద్దతు ఇస్తున్నామని, కార్మికుల సమస్యలన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్, ఆరూరి రమేష్, సీతారాంనాయక్, నరహరి వేణుగోపాల్ రెడ్డి, చల్లా నారాయణరెడ్డి, చందుపట్ల సత్యపాల్ రెడ్డి, బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబికే ఎమ్మెస్ కార్యదర్శి పి మాధవ నాయక్, బ్రాంచి కార్యదర్శి రేణిగుంట్ల మల్లేష్, ఎం రమాకాంత్, సారంగపాణి, పవన్ కుమార్, రాజారెడ్డి, కన్నం యుగదీశ్వర్, దొంగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ : ఈ నెల 6వ తేదీన గణేశ్ నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ వద్ద జరిగే గణేశ్ నిమజ్జనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

# మొక్కై వంగనిది.. మానై వంగునా?

## పిల్లలపై అతి గారాబం ప్రేమ కానే కాదు

- కష్టం విలువ తెలిసేలా పెంచాలి
- పొదుపు పాఠాలతోపాటు ఖర్చులపై నియంత్రణ నేర్పాలి
- అప్పుడే వారి భవిష్యత్ బాగుంటుంది



**రాజోలి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** కొడుకు అడుగుతున్నాడని ఆలోచన లేని నిర్ణయాలు తీసుకోవద్దు. కూతురు అలుగుతోందని అడిగిందల్లా కొనివ్వొద్దు. చదువుతున్నారు కదా అని ఏమరుపాటుగా ఉండొద్దు. చదవడం లేదని ఎప్పుడూ వెంటపడొద్దు. ఇంటికి ఎప్పుడొస్తున్నారు.. ఎప్పుడెళ్తున్నారో గమనిం చాలి. ప్రస్తుతకాలంలో పిల్లలతో స్నేహంగా ఉండాలి కానీ..వారిపై అతిప్రేమ ప్రమాదకరంగా మారుతోంది. అన్ని విషయాల్లో సరే అని కొన్ని సందర్భాల్లో కుదరదంటే వారి మనసు నొచ్చుకుంటోంది. వద్దు అనే పదం వారి ప్రాణాలకు ముప్పు తెస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో టీనేజీ యువత కొందరు ఆవేశంలో ప్రాణాలు తీసుకుంటుండగా...చేతికి అందివచ్చిన పిల్లలు కానరాని లోకాలకు చేరడంతో ఆయా తల్లిదండ్రులకు కడుపుకోతే మిగులుతోంది.

### కాలం మారుతోంది..!

కాలం మారుతోంది. దాంతో పాటు పిల్లల్లో ఆలోచన విధానంలో మార్పువస్తోంది. ప్రతీ అంశాన్ని త్వరగా స్వీకరించడంతో పాటు దానిపై నెగెటివ్ ఆలోచన చేయడంలో ముందుంటున్నారు. ఈ విషయాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లల ఆలోచన ధోరణిని గమనిస్తూ, అలవాట్లపై శ్రద్ధ చూపాలి. సెల్ఫోన్ కొనివ్వలేదని, బైక్ కావాలని, కోరింది కొనివ్వడం లేదనే కారణాలతో పసిపిల్లలు, యుక్త వయసుగల వాళ్లు విలువైన ప్రాణాలు



తీసుకుంటున్నారు. తమ కోరికలను తీర్చుకునే క్రమంలో ఎంతకైనా తెగిస్తున్నారు. ఈ విషయాల్లో కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తూ..వారికి ఏదీ అవసరం..ఏది అనవసరం అనేది కూర్చోబెట్టుకుని వివరించే ప్రయత్నం చేయాలి.

### తెల్లారింది మొదలు..

మనిషి ఉదయం లేచిన నాటి నుంచి రాత్రి నిద్రించే వరకు ఉన్న సమయంలో సెల్ ఫోనుదే ప్రథమస్థానం. మంచం పైనుంచి లేవగానే ఫోన్.. కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్.. బ్రేక్ ఫాస్ట్ చేస్తూ ఫోన్.. ఇలా చెప్పుకుంటూపోతే ఫోన్‌తోనే రోజంతా ఉంటారు.. అఖరికి రాత్రి పడుకునే ముందు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటున్నారు. అది చాలదన్నట్టు ఇంట్లో గృహిణిలకు అంటించారు. ఇప్పుడు వాళ్లు కూడా అను క్షణం ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఇక పిల్లల విషయానికి వస్తే అన్నం తినను అన్నా.. మారం చేసినా ఫోన్ ఇచ్చి వారిని సముదాయి స్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే గోలగోల చేసేవిధంగా కుటుంబమంతా ఎడిక్ట్ అయ్యింది.



### చదువులపై పెనుప్రభావం

ప్రతి వస్తువులోను మంచిచెడులు ఉంటాయి. కేవలం మంచిని గ్రహించాలి. కత్తితో వైద్యుడు శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలబెడతాడు. అదే కత్తితో చెడ్డవాడు ప్రాణాలు తీస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిందే ఇంటర్నెట్..దానిని స్మార్ట్‌ఫోన్‌లో పరిమితంగా వినియోగిస్తే జ్ఞానమే. ఎడిక్ట్ అయితే ప్రమాదమే. పిల్లలు దేనికి అలవాటుపడితే దానికి బానిసలవుతారు. ఇదే ఇప్పుడు వీరి చదువుపై ప్రభావం చూపిస్తోంది. చదువుకునే సమయంలో ఫోన్ దగ్గర పెట్టుకుని చాటింగ్‌లు చేయడం, యూట్యూబులు చూడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలు వెతుకులాట చేస్తూ చదువుపై ఏకాగ్రత సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. నిజానికి కొన్ని స్కూల్స్, కళాశాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు. ఎందుకంటే సెల్‌ఫోన్‌తో ఉంటే చదువుపాడైపోతుందని వారికి తెలుసు. కొన్ని కళాశాలల్లో మాత్రం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ తప్పనిసరి అంటున్నారు. అవసరం మేరకు వాడితే సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని పంచుతుంది. పరిమితిమించి వాడితే వినాశానానికి దారితీస్తుంది. కాబట్టి సెల్‌ఫోన్ ఇవ్వడం తప్పుకాదుకానీ..అది అతిగా వినియోగిస్తేనే తప్పు. తల్లిదండ్రులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.


### దెబ్బతింటున్న ఆరోగ్యం


స్కూల్‌కి వెళితే బ్లాక్ బోర్డు, డిజిటల్ బోర్డుపై అక్షరాలు కనిపించలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణంగా ఫోన్ నిలుస్తోంది. చీకటి గదిలో ఫోన్ చూడడం, ముఖానికి దగ్గరగా ఫోన్ పెట్టుకుని చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి మానసికస్థితిపై పడుతుంది. కొంతమంది పబ్‌జీకి ఎడిక్ట్ అయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. సరదాగా ప్రారంభమైన సెల్‌గేమ్ బాల్యాన్ని ఆపదలోకి నెట్టివేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోను నిద్రించే సమయంలో దిండు వద్ద పెట్టుకోవడం, పక్కన పెట్టుకోవడం వల్ల రేడియేషన్ కారణంగా మనిషి శరీరంలో ఇమ్యూనిటీ తగ్గించడంతోపాటు క్యాన్సర్ కణాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

# తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగం!

## సర్కారు ఉపాధ్యాయురాలిగా కొనసాగింపు

- పుట్టింది ఎస్సీ కులంలో.. కొలువు ఎస్టీ కోటాలో..!
- ప్రైమరీ నుండి పీజీ వరకు సర్టిఫికెట్‌లో ఎస్సీగానే నమోదు





**రంగారెడ్డి, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయు రాలు ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పుడీ అంశం చర్చనీయాంశంగా మారింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎస్సి కులానికి చెందినవారు కాగా ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగినికి స్వయాన అక్క కూడా ఎస్సీ కోటాలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్ మాత్రం పక్క రాష్ట్రం నుండి బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి ప్రభుత్వ ఉద్యోగం సాధించినట్టు తెలిసింది.

నల్లగొండ జిల్లా పీఏ పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఐదుగురు సంతానం. గ్రామంలోనూ మండల రెవెన్యూ రికార్డులలో కులం ఎస్సీ మాలవర్గానికి చెందినవారుగా నమోదయింది. వారిలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. ప్రైమరీ నుండి పీజీ వరకు చదివిన సర్టిఫికెట్లలో ఎస్సీ కులానికి చెందినవారిగా పేర్కొనబడి ఉంది. వారిలో ఒకరు హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్‌లో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ కోటాలోనే కొలువు వరించింది. కుటుంబం మొత్తం ఎస్సి కులానికి చెందినప్పుడు సదరు టీచర్ మాత్రం ఎస్టీ కోటాలో ఎలా ఉద్యోగం పొందిందన్న చర్చ ఊపందుకుంది. సదరు మహిళకు గ్రామంలో తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి చెందిన పట్టాదార్ పాస్ పుస్తకాల్లోనూ ఎస్సీ మాల వర్గానికి చెందినట్టుగా ఉంది. ప్రభుత్వం తరపున రైతుభరోసా సహాయమూ అందుతోంది. గతంలో కూడా ఆ మహిళపై ఆరోపణలు వచ్చినా జిల్లా విద్యాధికారి మాత్రం అమ్యామ్యాలు అందుకుని విచారణను గాలికొదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో 'జనంసాక్షి' తగిన ఆధారాలను సేకరించి విషయం వెలుగులోకి తెచ్చింది.

# ఎండు గంజాయి స్వాధీనం



**సంగారెడ్డి,( జనం సాక్షి) :** స్కూటీపై అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామ పరిధిలోని అల్లాన పరిశ్రమ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీ లో భాగంగా స్కూటీ పై ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తూన్న రెండు గంజాయిని పట్టుకున్నారు. పట్టుబడ్డారు. సత్వార్ కు చెందిన మహమ్మద్ ఖయ్యూం, ఫకీర్ అయూబ్ ల వద్ద వద్ద నుండి 140 గ్రాముల ఎండు గంజాయిని, డియో స్కూటీ ని, 2 మొబైల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం నిందితులను జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ కి తరలించారు. కార్యక్రమంలో హనుమంతు, అనుదీప్, కానిస్టేబుల్స్ అరుణ జ్యోతి, అంజిరెడ్డి, రాజేష్ ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 4 సెప్టెంబర్ 2025

# కుమార్తెతో దర్శనమిచ్చిన కిమ్

- ఆమె తదుపరి కొరియా నేత అంటూ ప్రచారం



బీజింగ్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : చైనా మిలిటరీ డే పరేడ్‌కు హాజరైన ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె కిమ్-జు-యే తో కనిపించారు. ఆయన వెంట తన 13 ఏళ్ల కుమార్తె కిమ్-జు-యే విదేశీ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. దీంతో కిమ్ తర్వాత పాలనా పగ్గాలు ఆమె అందుకోనున్నారనే వార్తలకు ఇది సంకేతమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఏర్పాటు-చేసిన ఆయుధ ప్రదర్శన, సైనిక కవాతులో కిమ్‌తో పాటు- ఆయన కుమార్తె పాల్గొంది. కిమ్ బుల్లెట్ ప్రూఫ్ రైలులో మంగళవారం బీజింగ్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. రైలు నుంచి దిగివస్తున్న సమయంలో ఆమె కిమ్ వెనక ఉన్నట్లు- అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మొదటిసారిగా 2022లో కిమ్ తన కుమార్తెను ప్రపంచానికి పరిచయం చేశారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగస్థలం వద్దకు ఆమెను వెంట తీసుకువచ్చారు. అనంతరం 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాజధాని నగరం ప్యాంగ్యాంగ్‌లో ఐసీబీఎంలు, ఇతర ఆయుధాలను ప్రదర్శించిన సమయంలో కిమ్-జు-యే కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు కూడా హాజరవుతోంది. ఇలా పదేపదే కుమార్తెతో ప్రత్యక్షమవడం వెనక.. భవిష్యత్తులో పగ్గాలు తన వారసులకే దక్కుతాయన్న సంకేతాలను కిమ్ పంపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. కిమ్-జు-యే మొదటిసారి కనిపించినప్పుడు ఆమె కిమ్ 'ప్రియమైన కుమార్తె'గా అక్కడి మీడియా అభివర్ణించింది. అనంతరం గౌరవనీయమైన కుమార్తె అంటూ ప్రస్తావించింది. ఈ విశేషణాన్ని అత్యంత గౌరవనీయులకు మాత్రమే ఉపయోగిస్తారు. కిమ్ కూడా భవిష్యత్తు నాయకుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న తర్వాతే ఆయన్ను గౌరవనీయ కామ్రేడ్‌గా పిలిచారు. ఇవన్నీ ఆమె వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఆమె వయస్సు 13 ఏళ్లే కావడంతో.. వారసత్వ పగ్గాలు అప్పగించడానికి చాలా సమయం ఉందని ఉత్తర కొరియా వ్యవహారాలను గమనించే కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా దక్షిణకొరియా నిఘా వర్గాల ప్రకారం కిమ్‌కు ముగ్గురు పిల్లలు. తొలి సంతానం కుమారుడు. కిమ్ అనంతరం ఆయనకు రెండో సంతానంగా పుట్టిన కుమార్తె కిమ్-జు-యే అధికారాన్ని చేపట్టే అవకాశం ఉందని స్థానిక అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్-2 2011లో మరణానంతరం పగ్గాలు చేపట్టారు.

# చైనా రక్షణ పాటవ ప్రదర్శన

- పుతిన్ సహా ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరు



బీజింగ్, సెప్టెంబర్3 (జనంసాక్షి) : చైనా మరోమారు తన సైనిక పాటవాన్ని ప్రదర్శించింది. తియాన్మెన్ స్క్వేర్ వేదికగా ఏర్పాటు చేసిన సైనిక బలాన్ని ప్రపంచదేశాలు వీక్షించేలా చేసింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ లాంటి వారు పాల్గొనడం విశేషం. అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం ముందు రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. శాంతా-యుద్ధమా, చర్చలా-ఘర్షణా.. ఏం కావాలో తేల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన ఏర్పాటు-చేసింది. ఈక్రమంలో తొలిసారి అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి 26 దేశాల నేతలు హాజరయ్యారు. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ ఇందుకు వేదికైంది. దీనిని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. జిన్‌పింగ్‌తో పాటు- ఇందులో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ , ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్ ఉన్ గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఈ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికన్ సైనికుల త్యాగాలను గుర్తించాలన్నారు. యుద్ధం నేపథ్యంలో చైనాకు మద్దతిచ్చి, ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా.. లేదా..? అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ అన్నారు. ఈ తరుణంలో జిన్‌పింగ్ నుంచి స్పందన వచ్చింది. దేశం సైనిక సామర్థ్యాలను మరింత పెంచుతామని ఈసందర్భంగా చైనా అధ్యక్షుడు ప్రతిజ్ఞ చేశారు. దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని రక్షించడంలో సైనికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈసందర్భంగా తైవాన్‌ను పరోక్షంగా ప్రస్తావించారు. అది తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. ప్రస్తుతం అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక, ఈ కార్యక్రమంలో చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ హాజరయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు పాల్గొన్నారు.



# కెసిఆర్‌కు కూతురు కన్నా పార్టీయే ముఖ్యం

- మాజీమంత్రి మల్లారెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) : కెసిఆర్‌కు కూతురుకన్నా, పార్టీ ముఖ్యమని, అందుకే సస్పెండ్ చేశారని భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. పార్టీని ధిక్కరించిన ఆమెపై వేటు-వేయడం సరైన నిర్ణయమేనని చెప్పారు. బోయిన్‌పల్లిలో శ్రీవెంకటేశ్వర లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణనాథుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు కుమార్తె, కుమారుడు ముఖ్యం కాదు.. ఆయనకు పార్టీయే ముఖ్యం. దేశవ్యాప్తంగా ఇలాంటి సస్పెన్షన్లు ప్రతి పార్టీలో జరిగాయి. ప్రతి కుటుంబంలో గొడవలు సహజం. తెలంగాణ ప్రజలే కేసీఆర్‌కు ముఖ్యం. తన కుమార్తె, కుమారుడి కోసం పార్టీని ఆయన నాశనం చేసుకోలేరు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో సీబీఐ మాత్రమే కాదు.. ఎవరూ ఏమీ చేయలేరు. సీబీఐ పేరుతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనుకోవడం సరికాదు. ఆయనలాంటి గొప్ప వ్యక్తి తెలంగాణ నాయకుడిగా ఉండటం మనందరి అదృష్టం. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డ్రామాలు చేస్తోందని మల్లారెడ్డి విమర్శించారు.

# ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం

- కేసీఆర్ బిడ్డ కవిత అవినీతి జరిగిందని అంగీకరించారు
- బీజేపీ అభ్యర్థిని ఎంపీటీసీగా గెలిపించే గ్రామానికి రూ.5 లక్షల నజరానా
- బీజేపీ జడ్పీటీసీని గెలిపించే మండలానికి రూ.10 లక్షల నజరానా : బండి సంజయ్
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 03(జనంసాక్షి) : ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని అంగీకరించిందన్నారు. కాళేశ్వరం విచారణ విషయంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతోందని, అసెంబ్లీలో సీబీఐ విచారణ చేయాలని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టులో మాత్రం సరైన వాదనలు విన్పించకుండా బీఆర్ఎస్ కు రిలీఫ్ వచ్చేలా చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన స్కాంల విషయంలో ఎడతెరిపి లేని విచారణలతో జాప్యం చేస్తూ దోషులు తప్పించుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై నివేదిక వచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశంతోపాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కేసు, గొర్రెల స్కాం కేసులను సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. నక్సలిజం ఫిలాసఫీ అని రేవంత్ రెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి దానికి అనుకూలంగా మాట్లాడటం విడ్డూరమన్నారు. నక్సలైట్లు కాల్చి చంపిన కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులైన శ్రీధర్ బాబు, పర్ణికారెడ్డి నక్సలిజం ఫిలాసఫీని ఆమోదిస్తారా? అని ప్రశ్నించారు. నక్సలైట్ల విషయంలో కేంద్రం వెరీ క్లియర్ గా ఉందని, వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతమొందించి తీరుతామని ఉద్ఘాటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టాక తొలిసారి కరీంనగర్‌కు విచ్చేసిన నూతన అధ్యక్షులు రామచంద్రావుకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కరీంనగర్ లోని కొండా సత్యలక్ష్మీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ... బీజేపీ స్టేట్ చీఫ్ ఎన్. రామచంద్రరావు పార్టీకి చేసిన సేవలు, త్యాగాలు ఎనలేనివన్నారు. రామచంద్రరావు అధ్యక్షుడు కావడం కార్యకర్తల్లో విశ్వాసం ఏర్పడిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిపించి రామచంద్రరావుకు అప్పగిస్తానని పోటీ చేసే అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదని తెలిపారు. ఏ గ్రామంలోనైతే బీజేపీ అభ్యర్థిని ఎంపీటీసీగా గెలిపించుకుంటారో, ఆ గ్రామానికి 5 లక్షల రూపాయలు ఇస్తా అని, ఏ మండలంలోనైతే బీజేపీ అభ్యర్థిని జడ్పీటీసీని గెలిపించుకుంటారో ఆ మండలానికి 10 లక్షలు ఇస్తా అని ప్రకటించారు. రాష్ట్రంలో రైల్వేలు, రోడ్ల నిర్మాణాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమైందని, గ్రామీణ ప్రాంతాలకు 73, 74వ సవరణల ప్రకారం కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు అందిస్తోందని చెప్పారు. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సుమారు రూ.12 లక్షల కోట్లు నిధులు ఇచ్చిందన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం ఏం ఇస్తోందంటూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అన్నదమ్ముల్లాంటివి, అవినీతికి కవలపిల్లలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, ఆ పార్టీకి చెందిన కుటుంబ సభ్యులే, ఎమ్మెల్సీలే బయటపెడుతున్నారు. అవినీతి సొమ్మును పంచుకోవడంలో విభేదాలు తలెత్తడంతో ఈ విషయాలు చెబుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ దోచుకున్న తర్వాత ఏమీ మిగల్లేదనేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, తెలంగాణలో ఉద్యోగులకు జీతాలు సకాలంలో రావడం లేదని, డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించడం లేదని రామచందర్ రావు అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని, రాబోయే స్థానిక సంస్థల నుండి మున్సిపల్ ఎన్నికల వరకు, మున్సిపల్ నుండి అసెంబ్లీ ఎన్నికల వరకు 2028లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురుతుందని దీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్‌పై రేవంత్ కుట్రలు

- ప్రజలే తిప్పి కొడతారన్న జగదీశ్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : మాజీ సీఎం కేసీఆర్ స్థాయి ఏంటో అందరికీ తెలుసని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌పై కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ పాలనను జనం అసహ్యించుకుం టున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.. రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏంటో చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తే.. తలదించుకోవాల్సింది సీఎం రేవంతే అని జగదీష్ రెడ్డి విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే అని ఉద్ఘాటించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మీద రాష్ట్ర ప్రజలు నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మోసపూరిత ఆలోచనలతో.. అధికారంలోకి వచ్చిందని ప్రజలు గ్రహించారని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి కాంగ్రెస్ పతనం ప్రారంభం అవుతుందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త.. శక్తికి మించి పనిచేయాలని అప్పుడే విజయం చేకూరుతుందని పేర్కొన్నారు. కేసీఆర్ మీద వస్తున్న ఆరోపణలకు కాలమే సమాధానం చెబుతుందని.. జగదీష్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలి

- జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా జర్నలిస్టులు పెంపొందించుకోవాలని మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో కృత్రిమ మేధలో, టూల్స్ టెక్నిక్స్, వర్క్ షాపును తెలంగాణ మీడియా అకాడమీ, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్ కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన దాదాపు 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం రంగంలో కూడా ఏఐని విరివిగా వాడుతున్నారని అన్నారు. అందులో భాగంగా న్యూస్ రూములు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐ ని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకొని రిపోర్టింగ్ లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చు అని ఆయన తెలిపారు. ఏఐ సాంకేతికత పై లోతైన నైపుణ్యం ఉన్న, ఇంటర్నేషనల్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి శిక్షణ నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మన తెలంగాణలో జర్నలిస్టులకు ఏఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అని ఆయన అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థి లాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందని, ఏఐ మనసును భ్రమింప జేసి తప్పుడు సమాచారాన్ని వివక్ష లాంటి సమాచారాన్ని అందించే ప్రమాదం ఉందన్నారు. తన వద్ద ఉన్న ఉదాహరణల ఆధారంగా ఏఐ అవుట్ పుట్ టూల్స్ కూడా జాతి, మత, వర్గ, లింగ భేదాలు కలిగించే కంటెంట్ ను అందిస్తాయన్నారు. ఆటోమేషన్ లో భాగంగా ఏఐ ఏజెంట్స్ వస్తున్నాయని, దీని ద్వారా రాబోయే కాలంలో వివిధ రకాల ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. చాట్ జిపిటి, పెర్ప్లెక్సిటీ-, నోట్ బుక్ ఎల్ ఎం, గూగుల్, జమినయి, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్ ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. ఆఇ డాటా -ట్రైనింగ్ లో వినియోగంలో లోపం వల్ల, ప్రాంప్టింగ్ ఇంజనీరింగ్ సరిగా చేయకపోవడం వల్ల, ఈ వివక్ష లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చేందుతుంది అన్నారు. ఆఇ నైతిక నియమాలు తదితర అంశాలకు లోబడి జర్నలిస్టులు బాధ్యతా యుతంగా కృత్రిమ మేధ పరిజ్ఞానంను ఉపయోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిలో కవితకు భాగస్వామ్యం లేదంటే ఎలా?

- ఆమె మాటలు నమ్మదగ్గవిగా లేవు: కాంగ్రెస్



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) : పదేళ్ల పాటు- బీఆర్ఎస్ పాలనలో కీలక స్థానంలో ఉన్న కవితకు అవినీతి వ్యవహారాల్లో భాగస్వామ్యం లేకుండా అవి జరిగాయని అనటం అసాధ్యమని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజల సొమ్ము దోచుకున్న తర్వాత, వాటాలో తేడా రావడంతోనే కవిత బహిరంగ వేదికపైకి వచ్చారని వ్యాఖ్యానించారు. కవిత రాజీనామాపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవిత కొన్ని కఠోర సత్యాలు, కొన్ని అబద్ధాలు మాత్రమే మాట్లాడారని ఆయన అన్నారు. కవిత నిజంగా అవినీతి విషయాల్లో ఆధారాలు ఇస్తే వాటిని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా లిక్కర్ మార్ట్ కేసు, ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రిపై ఎత్తేసిన కేసు వంటి అంశాలపై సరైన వివరాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందని హామీ ఇచ్చారు. కేసీఆర్‌పై స్పై చేయాల్సిన అవసరం లేదన్నారు. స్పై చేయడం మాకు అలవాటు కాదు.. ఫోన్ ట్యాప్‌లు మీరు చేశారు. మీరు మీలో మీరే గొడవ పడి బయటపడుతున్నారని అంటూ బీఆర్ఎస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. ఆయన కవిత ఇటీవలే అమెరికా నుండి తిరిగివచ్చిన తర్వాత హరీష్ రావు, సంతోష్‌పై ఆరోపణలు చేయడం, అంతకు ముందు కేటీ-ఆర్‌పై విమర్శలు చేయడం బీఆర్ఎస్ లోపల విభేదాలను బహిర్గతం చేస్తోందని అన్నారు. ఇదిలావుంటే కవిత రాజీనామా చేయడాన్ని మహేష్ గౌడ్ స్వాగతించారు. నైతికతకు కట్టుబడి ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయడం శుభపరిణామమని అన్నారు. కవిత కేసీఆర్ వదిలిన బాణం మాత్రమే. ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికి ఇవన్నీ చేస్తున్నారు. అయితే నైతికతతో తీసుకున్న ఈ నిర్ణయం సానుకూలమే అని వ్యాఖ్యానించారు. అంతేకాక, రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ అనే పార్టీ రాజకీయ ముఖచిత్రంలో ఉండదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# 6న గణేశ్ నిమజ్జన సెలవు

- నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి: డిసిపి

హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) : గణేశ్ నిమజ్జనం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 6న శనివారం సెలవు ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెలవు ఇస్తున్నట్లు తెలిపింది. అక్టోబర్ 11న రెండో శనివారం పనిదినంగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 6న హైదరాబాద్‌లో జరగనున్న నిమజ్జనానికి జీహెచ్ఎంసీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఆరోజున సుమారు 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గణేష్ నిమజ్జనానికి పోలీస్ శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు . నగరవ్యాప్తంగా దాదాపు 3 వేల మంది పోలీసులను మోహరించామని, అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం జరగబోతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం లాగే ఖైరతాబాద్ బడా గణపతిని 6వ తేదీ ఉదయాన్నే టస్కర్ ఎక్కిస్తారని, శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ఐడెంటిఫై చేసి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఈ సారి ఖైరతాబాద్ బడా గణపతి శోభాయాత్రకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని.. ఆయన రాక సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు డీసీపీ శిల్పవల్లి. ముఖ్యంగా చార్మినార్, ఎంజే మార్కెట్ ఏరియాలో ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు పర్యవేక్షణ ఉంటు-ందని తెలిపారు. గణేషుడి మండపాల దగ్గర ఆకతాయిలను గుర్తించడానికి ఇప్పటికే షీ టీ-మ్స్, ఎస్వోటీ- పోలీసులు మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వినాయక నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 6, 7 తేదీల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు ఉంటాయని తెలిపారు. మిలాద్ ఉన్ నబి ర్యాలీని ముస్లింలు ఈ నెల 14కు వాయిదా వేసుకున్నారన్నారు. ఇతర జిల్లాల పోలీసులు, ప్రత్యేక బలగాలను బందోబస్తుకు వాడుతున్నామని చెప్పారు. పెద్ద విగ్రహాలు నిమజ్జనం అయ్యేవరకు కానిస్టేబుల్ స్థాయి అధికారి ఉంటాడని తెలిపారు. ట్యాంక్ బండ్ వద్ద గణేష్ నిమజ్జనం చేసేటప్పుడు విగ్రహాలను విసిరేయకుండా క్రేన్ల సహాయంతోనే నిమజ్జనం చేయాలని సూచించారు.

# 6న హైదరాబాద్‌కు అమిత్ షా

హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా రానున్నారు. మోజంజాహి మార్కెట్ వద్ద గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికి ప్రసంగిస్తారు. ఆరోజు మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ-కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు- పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి.. కమిటీ- సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం 4 గంటలకు మెజాంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుని గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370